
'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 208

బుధవారం 18-10-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సోనోవిజన్‌లో దసరా స్క్రాచ్ కార్డ్ స్కీమ్‌కు ఆదరణ

సోనోవిజన్‌లో స్క్రాచ్ కార్డ్ స్కీమ్ అందరిని ఆకట్టుకుంటుంది. మాములు డిస్కౌంట్‌తో పాటు కార్డ్ స్క్రాచ్ చేయగా మినిమం 6% పైన కొంతమందికి మరింత ఎక్కువ పర్సంటేజ్ డిస్కౌంట్ రావడంపై కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్ని పెద్ద కంపెనీల నుండి ఎల్.ఇ.డి, వాషింగ్ మెషిన్స్, రిఫ్రిజిరేటర్స్, ఎ.సి, మొబైల్స్ & ల్యాప్‌టాప్స్ మరియు గృహోపకరణములు అత్యంత విస్తృతశ్రేణిలో లభిస్తున్నాయి. ముఖ్యంగా సోనోవిజన్ స్పెషల్ క్యాష్‌బ్యాక్ ఆఫర్స్‌లో 15% వరకు లభించడం ఈ సంవత్సరం ప్రత్యేకత.



దసరా శుభాకాంక్షలతో...
సోనోవిజన్ దసరా సేల్
Lowest Prices GUARANTEED Best Service
LG Life's Good 208 Cm (83") 4K OLED Smart
EMI : 6999/-
SAMSUNG 189 Cm (75") 4K Ultra UHD
EMI : 3990/-
SONY 164 Cm (65") 4K Ultra
EMI : 5500/-
Haier 139 Cm (55") LED 4K HD
EMI : 1994/-
TCL 108 Cm (43") Google LED
EMI : 2182/-
iPhone15, iPhone15+
5000/- Cash Back
18/0, 20/0, 30/0 Schemes Available
HDFC Bank Cards
iPhone 15Pro, 15 Pro Max
4000/- Cash Back
24/0, 30/0 Schemes,
ICICI Bank Card No Cost EMI
24/0 Scheme Available
SAMSUNG S-23 Ultra Mobile 8000/- Cash Back HDFC Bank Card
A-54 5G
24/0, 30/0 Scheme Available
Upto 10000/- Upgrade
vivo V-29 V-29 Pro
9/0, 10/1, 12/0, 24/0 Schemes Available
X-90 Pro Series 8500/- Instant Cash Back
7/1, 6/0, 24/0 Schemes Available
oppo Reno - 10 5G 2000/- Instant Cash Back ICICI, SBI Bank Cards
6/0, 7/0, 8/0, 10/2, 12/4 Schemes Available
ONEPLUS 11 R - 11 5G Instant Cash Back ICICI Credit Card
realme 11 Pro+ 5G 2000/- Instant Cash Back Selected Bank Cards
6/0, 10/2, 12/4 Schemes Available
hp DELL ASUS Lenovo MacBook
12/4, 15/5, 24/0, 30/0 Schemes Available
Instant Discount Selected Bank Cards
LG Life's Good Side by Side 694 Litres Refrigerator
EMI : 12600/-
SAMSUNG Side by Side 700 Litres Refrigerator
EMI : 6333/-
LLOYD Frost Free Double Door 276 Litres Refrigerator
EMI : 1900/-
Haier 256 Litres BMR Refrigerator
EMI : 2085/-
VOLTAS beko Direct Cool Single Door 190 Litres Refrigerator
EMI : 1150/-
Godrej Direct Cool Single Door 190 Litres Refrigerator
EMI : 1083/-
LG Life's Good Front Load Washing Machine 11 KGS
EMI : 5335/-
SAMSUNG Front Load Washing Machine 9 KGS
EMI : 3500/-
BOSCH Front Load Washing Machine 6.5 KGS
EMI : 2984/-
IFB Top Load Washing Machine 6.5 KGS
EMI : 1625/-
Whirlpool Top Load Washing Machine 7.5 KGS
EMI : 1275/-
LLOYD Semi Automatic Washing Machine 7.5 KGS
EMI : 995/-
LG Life's Good 10 Years Compressor WARRANTY 5 Years PCB WARRANTY
EMI : 3000/-
SAMSUNG
EMI : 3050/-
VOLTAS
EMI : 2875/-
LLOYD
EMI : 3000/-
BLUE STAR
EMI : 3085/-
HITACHI
EMI : 3041/-
DAIKIN
EMI : 3100/-
KAFF COMBO OFFER
4 Burner Glass Cooktop
Air Chimney
Offer Price : 17,700/-
Microwave Oven
Rs : 6500/- Onwards
Chimney
Rs : 8300/- Onwards
Water Dispenser
Rs : 8200/- Onwards
Water Purifier RO
Rs : 12800/- Onwards
Water Geyser
Rs : 3350/- Onwards
Wet Grinder
Rs : 3500/- Onwards
Rice Cooker
Rs : 1600/- Onwards
Mixer Grinder 3 Jar 750 Watts
Rs : 2900/- Onwards
* T & C Apply
No Charges On BharatPe PhonePe & Bank Card Payments
Visit Our Website www.sonovision.in (Our Team Members are Waiting to Serve You Online & Offline)
LG Life's Good SAMSUNG SONY LLOYD Whirlpool Panasonic Haier DAIKIN HITACHI VOLTAS VOLTAS beko IFB BOSCH Carrier BLUE STAR
TCL EUREKA FORBES KENT pureit Sunflame Preethi Butterfly FABER V-GUARD KEELINE AO Smith UniStar Amirthaa Crompton MAHARAJA WHITELINE HAVELLS morphy richards BAJAJ
MOBILES
SAMSUNG vivo oppo iPhone ONEPLUS realme mi
LAPTOPS
hp DELL ASUS Lenovo MacBook
ACCESERIES
boAt FIRE-BOLTT
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
విశాఖపట్నం
డైమండ్‌పార్క్ - 1
9390006608, 8333924946
డైమండ్‌పార్క్ - 2
9246667474, 8333924929
9246667575, 9154281127
9440804187, 9100991705
9100991704, 9154281129
9246666214, 9390006613
తూర్పు గోదావరి
9246662288, 9246666212
9100991700, 9154281119
9154281197, 98, 99
9246665511, 9246666201
7331149376, 77, 78
శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా
9246666206, 9154279913
8712600519, 20, 21
పశ్చిమ గోదావరి
8333924936, 9154281175
9246666205, 9154281172
9390006620, 9154281112
8333924938, 9154281115
విజయనగరం
9246666208, 9390006630
8712600523, 8712600535
శ్రీకాకుళం
9154281140, 41
విజయవాడ ఎన్.టి.ఆర్. జిల్లా, కృష్ణా జిల్లా.
9440804182, 9246666202
9440804183, 9246666209
9246666203, 9154281640
9246661616, 9100991702
8712600531, 532, 533
9154281648, 649, 650
9100991701, 9246666664
9100991703, 9154281626
8333924930, 9154281628
8712600536, 8712600537
9154281645, 46, 47
గుడివాడ
9100991708, 9154281178, 79
మచిలీపట్నం
7331149379, 80, 81
గుంటూరు జిల్లా
9154279910, 9440804185
9246667373, 9154867822, 23, 24
9246666204, 9154279905
9246666215, 9100991706
8333924937, 9154279903
9246666211, 9154279901
9390006609, 9154281200
7331149366, 367, 368
ఒంగోలు
9246666329, 9154279918
రాయలసీమ
తిరుపతి - 7331149370, 371, 372
తిరుపతి - 9100991707, 9154279919
9440804186, 9154279916
కర్నూలు - 9154281642, 43
కర్నూలు - 8333924947, 48
అనంతపురం - 9154281191, 92
9154281194, 96
8712600528, 8712600530
8712600525, 526, 527
ఖమ్మం
9246666319, 9154281634
9100991709, 9154281635
8333924931, 9154281637, 38
కొత్తగూడెం
9154867825, 26, 27
కరీంనగర్
8712635843, 44, 45
8712635841, 42
హైదరాబాద్
9246663535, 9440804181
9154281180, 9154281181
7331149363, 364, 365
8333924932 / 933
8333924943, 9154281186



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 208

బుధవారం 18-10-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నెదర్లాండ్స్ సంచలన విజయం

ప్రపంచ కప్ లీగ్ మ్యాచ్‌లో 38 పరుగుల తేడాతో ఓడిన దక్షిణాఫ్రికా - 10లో



మూడు రోజుల నష్టాలకు చెక్

క్రూడాయిల్ ధరల తగ్గుదల ప్రభావం.. సెన్సెక్స్ 261 పాయింట్లు లాభం - 11లో



చట్టబద్ధత కల్పించలేం

స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించలేమని.. అది పార్లమెంట్ పరిధిలోని అంశమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸



చైనాలో పుతిన్

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చైనాలో పర్యటిస్తున్నారు. ఆయన బీఆర్ఐ పదో వార్షికోత్సవానికి హాజరు కానున్నారు.

వివరాలు 6లో ▸



గాజా ఆస్పత్రిపై భీకర దాడి

గాజాలోని అల్ అహ్లీ సిటీ ఆస్పత్రిపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో 500 మంది ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸



అధికారమిస్తే కులగణన చేపడతాం

కులగణన, ఓబీసీలకు 27% రిజర్వేషన్లు తదితర హామీలతో కాంగ్రెస్ పార్టీ మధ్యప్రదేశ్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసింది.

వివరాలు 7లో ▸

న్యూస్‌రీల్

గ్లోబల్ టూరిజం హబ్‌గా భారత్



గ్లోబల్ టూరిజం హబ్‌గా భారతదేశం ఎదిగేందుకు అవసరమైన అన్ని అవకాశాలను అందిపుచ్చుకుంటున్నామని ప్రధాని మోదీ చెప్పారు. విశాఖ పోర్టు అథారిటీకి సంబంధించిన పలు ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయడంతో పాటు కంటైనర్ టెర్మినల్ విస్తరణ ఫేజ్–2ను జాతికి అంకితం చేశారు.

వివరాలు 2లో ▸

రేపు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు సీఎం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో పర్యటించనున్నారు. జగనన్న చేదోడు పథకం కింద అర్హులైన రజక, నాయీబ్రాహ్మణ, దర్జీ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మల ఖాతాల్లో ఆర్థిక సాయం జమ చేయనున్నారు.

వివరాలు 2లో ▸

అవినీతికి పాల్పడి.. 17ఏ గురించి వాదిస్తారా?



సాంకేతిక కారణాలు చూపి కేసును కొట్టేయాలని టీడీపీ నేతలు కోరుతున్నారు తప్ప.. తమ నాయకుడు అవినీతికి పాల్పడలేదని చెప్పడంలేదని మాజీ మంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని అన్నారు. సాక్ష్యాలు లేకుండా ఏ కోర్టు రిమాండ్ విధించదన్నారు.

వివరాలు 5లో ▸

రామోజీ మా సంతకాలు

ఫోర్జరీ చేశారు..

నకిలీ సంతకాలతో షేర్లను శైలజా కిరణ్‌కు బదలాయించారు

మార్గదర్శి సహ వ్యవస్థాపకుడు జీజే రెడ్డి కుమారుడు యూరిరెడ్డి వెల్లడి

- గదిలో బంధించి.. తుపాకీతో బెదిరించారు.. అది ఆయన సామ్రాజ్యం.. ఎదిరిస్తే ప్రాణాలు దక్కవు
- ప్రాణభయంతో ఖాళీ స్టాంపు పేపర్‌పై సంతకాలు చేశాం
- షేర్ల బదిలీ ప్రక్రియ పూర్తి చేయలేదు
- ఆఫర్, యాక్సెప్టెన్సీ, కన్సిడరేషన్ లేనే లేవు.. మా సంతకాలు ఫోర్జరీ చేసి షేర్లను శైలజా కిరణ్ పేరిట బదలాయించారు
- రామోజీకి భయపడి మా ఫిర్యాదును ఎవరూ పట్టించుకోలేదు
- మార్గదర్శి సొమ్ము అక్రమ తరలింపుపై సీఐడీ కేసులతో మాకు ధైర్యం వచ్చింది
- సీఐడీకి ఫిర్యాదు చేశాం.. ఆధారాలు కావాలన్నారు
- మేమిచ్చిన ఆధారాలు పరిశీలించిన తర్వాతే కేసు నమోదు చేశారు



సాక్షి, అమరావతి: 'రామోజీరావు పచ్చి మోసం చేశారు. తొలుత మమ్మల్ని ఓ గదిలో నిర్బంధించి, తుపాకీతో బెదిరించి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో షేర్లు బదిలీ చేయించుకోవాలని ప్రయత్నించారు. ప్రాణాలు దక్కించుకొనేందుకు ఆయనిచ్చిన ఖాళీ స్టాంపు పేపర్లపై సంతకాలు పెట్టి బయట పడ్డాం. షేర్లు మాత్రం బదిలీ చేయలేదు. ఆ తర్వాత ఫోర్జరీ సంతకాలతో

మిగతా 9వ పేజీలో ▶

మాపై సీఐడీ కేసు కొట్టేయండి

మార్గదర్శి షేర్లు అక్రమంగా బదలాయించారని సీఐడీకి ఫిర్యాదు.. రామోజీరావు ఏ1గా, శైలజా కిరణ్ ఏ2గా కేసు నమోదు

ఈ కేసు కొట్టేయాలంటూ హైకోర్టులో రామోజీ, శైలజా కిరణ్ పిటిషన్లు

9 లో



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం స్వీకరిస్తున్న వహీదా రెహమాన్

సినిమాలు.. కళాకారులు

సమాజంలో మార్పుకి సారథులు

ఢిల్లీలో మంగళవారం 69వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. విజేతలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రి అనురాగ్‌ఠాకూర్ అవార్డులను ప్రదానం చేశారు. వహీదా రెహమాన్ దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకోగా.. అల్లు అర్జున్ జాతీయ ఉత్తమ నటుడు అవార్డు స్వీకరించారు. ఆలియా భట్, కృతి సనన్ ఉత్తమ నటీమణులుగా అవార్డులు అందుకున్నారు.

10 లో



జాతీయ ఉత్తమ నటుడు అవార్డు అందుకున్న అల్లు అర్జున్

ఆరోగ్య సురక్ష విస్తరణ

పట్టణాల్లోని ప్రతి వార్డు పరిధిలోనూ శిబిరాల నిర్వహణ

- ప్రజలందరికీ సేవలు మరింత చేరువ చేసేలా ప్రభుత్వ నిర్ణయం
- తొలుత 542 పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో 1,626 శిబిరాల నిర్వహణకు ప్రణాళిక
- తాజా నిర్ణయంతో వార్డుల వారీగా శిబిరాల ఏర్పాటు
- ఇప్పటికే శిబిరాలు పూర్తయినవి మినహాయించి మిగిలిన ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహణ
- ఇప్పటివరకు 8,985 పైగా క్యాంపుల నిర్వహణ.. 35 లక్షల మందికి పైగా వైద్య సేవలు



అనకాపల్లి జిల్లా యలమంచిలి మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సాక్షి, అమరావతి: అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఎంతో విజయవంతంగా నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. గ్రామాల్లోనే ప్రజలందరూ ఉచితంగా స్పెషలిస్ట్ వైద్యసేవలు, మందులు పొందడం.. అలాగే, పట్టణ, నగర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న శిబిరాలకూ ప్రజలు పోటెత్తుతుండడంతో వీటిని ప్రతి వార్డుకూ విస్తరించాలని వైద్యశాఖ సంకల్పించింది.

ఇప్పటివరకు 8,985 శిబిరాల నిర్వహణ..

గత నెల 30 నుంచి ఇప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13 పనిదినాల్లో 8,985 క్యాంపులు నిర్వహించారు. వీటిల్లో 35,11,552 మంది ఉచిత స్పెషలిస్ట్ వైద్యసేవలు పొందారు. వీరిలో 61,971 మందిని

మిగతా 8వ పేజీలో ▶

ఫ్యాక్ట్‌చెక్

నిజాలకు పాతర

అబద్ధాల జాతర

- అన్ని రంగాల్లో సీమ పురోగమిస్తుండటాన్ని జీర్ణించుకోలేక విషం కక్కిన ఈనాడు
- సీఎం జగన్ చర్యలతో అభివృద్ధిలో పయనిస్తున్న రాయలసీమ
- యుద్ధప్రాతిపదికన గాలేరు–నగరి, తెలుగుగంగ, హంద్రీ– నీవా తదితర ప్రాజెక్టుల పరుగులు
- సీమలో ఈ నాలుగేళ్లలో 71 పరిశ్రమల స్థాపనకు రూ.36,610 కోట్ల పెట్టుబడులు

8 లో

21 లక్షల మందికి..

ఒక్కరోజులోనే కుల ధ్రువీకరణ పత్రాలు

- 2022 ఆగస్టు నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఒకసారి తీసుకున్న వారికి అప్పటికప్పుడే సర్టిఫికెట్ల జారీ
- కీలక సమయాల్లో లబ్ధిపొందిన నిరుద్యోగులు, విద్యార్థులు
- సాధారణంగా దరఖాస్తు చేసుకున్న 30 రోజులకు తహసీల్దార్ ఆఫీసుల ద్వారా జారీ
- సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇప్పుడు కేవలం ఒక రోజులోనే..

2 లో

ఇదండీ సంగతి



ఇలా ప్యారాచూట్‌లో వెళితే టికెట్ గ్యారంటీ అని తెలిసింది!

బాబుకు నో రిలీఫ్

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో తీర్పు రిజర్వు

సెక్షన్ 17ఏ నిజాయితీపరులకే.. అవినీతిపరులకు కాదు

ఈ కేసులో అవినీతి స్పష్టంగా కనిపిస్తోంది

రూ. వందల కోట్ల కుంభకోణం దర్యాప్తును అడ్డుకోవడానికి ఈ సెక్షన్‌ను ఉపయోగించరాదు

అవినీతి కేసులో ఆధారాలుంటే ప్రత్యేక కోర్టు విచారించొచ్చు.. ఏపీ సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ

బాబు 40 రోజులుగా జైల్లో ఉన్నారు.. మధ్యంతర బెయిల్ ఇవ్వండి

చంద్రబాబు న్యాయవాది సాల్వే అభ్యర్థన

17ఏపై ఇరు పక్షాల వాదనలు పూర్తి

ఫైబర్‌నెట్ కుంభకోణం కేసు విచారణ శుక్రవారం చేపడతామన్న ధర్మాసనం

అప్పటివరకు బాబును అరెస్టు చేయొద్దన్న సుప్రీంకోర్టు

9 లో



'కిలారు' డుమ్మా 9 లో

రెండో రోజు విచారణకు లోకేశ్ ఆదేశాలతోనే గైర్హాజరు

దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు 'దసరా' వేషాలు!

క్లుప్తంగా...

రేపు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు సీఎం జగన్

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ ఈ నెల 19న కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో పర్యటించనున్నారు. ఆరోజు ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి ఎమ్మిగనూరుకు చేరుకుంటారు. వీవర్స్ కాలనీ వైడబ్ల్యూసీఎస్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొని.. జగనన్న చేదోడు పథకం కింద అర్హులైన రజక, నాయీబ్రాహ్మణ, దర్జీ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం జమ చేయనున్నారు. సభ అనంతరం అక్కడి నుంచి బయలుదేరి తాడేపల్లికి చేరుకుంటారు.

20లోగా ఉపాధ్యాయ ఖాళీలపై నివేదిక

డీఈఓలు, ఆర్జేడీలకు విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఉపాధ్యాయ ఖాళీలపై విద్యాశాఖ దృష్టి సారించింది. అన్ని జిల్లాల్లోను వివిధ మేనేజ్‌మెంట్లలో ఉన్న ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను అందించాలని డీఈఓలు, ఆర్జేడీలకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. డైరెక్ట్ నియామకాలకు అనుగుణంగా పోస్టుల రోస్టర్ రిజిస్టర్స్‌తో సహా ఈనెల 20వ తేదీలోగా వివరాలను కమిషనరేట్‌కు పంపించాలని ఆదేశించారు. డీఎస్సీ నోటిఫికేషన్ సూచించిన ప్రొఫార్మాలో ఈ వివరాలు అందించాలని డీఈఓలకు సూచించారు.

ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్‌గా అజయ్‌రెడ్డి

ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి/పెనగలూరు: ఏపీ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) చైర్మన్‌గా కొండూరు అజయ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. ఆయన ఈ పదవిలో రెండేళ్లు కొనసాగుతారని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. అజయ్‌రెడ్డి ఇంతకుముందు ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్‌గా పనిచేసిన పదవీకాలం గత జూలై 22తో ముగిసింది. తనను రెండోసారి ఈ పదవిలో నియమించినందుకు సీఎంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలు .. మిలీనియం టవర్స్!

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖలో పలు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతున్నది. ఇందుకోసం వివిధ భవనాలను అధికారుల త్రిసభ్య కమిటీ పరిశీలించినట్లు తెలుస్తున్నది. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం డిసెంబర్ నుంచి విశాఖ నుంచి ప్రభుత్వ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు సీఎం జగన్ సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా మునిసిపల్, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో పాటు పరిపాలనశాఖ కార్యదర్శులతో కూడిన త్రిసభ్య కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ మిలీనియం టవర్స్‌తో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు భవనాలను పరిశీలించినట్టు సమాచారం. ప్రధానంగా మిలీనియం టవర్స్‌లో అందుబాటులో ఉన్న 2 లక్షల చదరపు అడుగుల భవనాలను అధికారుల త్రిసభ్య కమిటీ పరిశీలించినట్లు తెలుస్తోంది. ఇక్కడే ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నట్టు గుర్తించినట్లు సమాచారం. అదేవిధంగా గ్రే హౌండ్స్‌లో ఉన్న భవనాలనూ కమిటీ పరిశీలించింది. ఇక్కడ పోలీసుశాఖ ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు అవకాశం ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. వీఎంఆర్‌డీఏ కు చెందిన వివిధ భవనాలను కూడా త్రిసభ్య కమిటీ స్వయంగా పరిశీలించింది. వీఎంఆర్‌డీకు చెందిన భవనాల్లో మునిసిపల్‌శాఖ ఉన్నతాధికారులు.. వైద్యారోగ్యశాఖకు చెందిన ఉన్నతాధికారులు ఆరిలోవలోని విమ్స్ నుంచి విధులకు హాజరయ్యే అవకాశం ఉందని త్రిసభ్య కమిటీ ప్రాథమికంగా భావించినట్టు సమాచారం. ఇక ఇక్కడకు వచ్చే అధికారులకు అవసరమైన వసతి సౌకర్యాలను మాత్రం ఆయా శాఖలే చూసుకోవాలని కమిటీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

21 లక్షల మందికి.. ఒక్కరోజులోనే
కుల ధ్రువీకరణ పత్రాలు

- 2022 ఆగస్టు నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఒకసారి తీసుకున్న వారికి అప్పటికప్పుడే సర్టిఫికెట్ల జారీ
- కీలక సమయాల్లో లబ్ధిపొందిన నిరుద్యోగులు, విద్యార్థులు
- సాధారణంగా దరఖాస్తు చేసుకున్న 30 రోజులకు తహసీల్దార్ ఆఫీసుల ద్వారా జారీ
- సీఎం జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో గ్రామ సచివాలయాల్లో ఇప్పుడు కేవలం ఒక రోజులోనే..
- ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ వద్ద దాదాపు కోటి మందికి సంబంధించి కుల ధ్రువీకరణ పత్రాల డేటా
- భవిష్యత్తులో వీరందరికీ మళ్లీ ఎప్పుడు అవసరమైన అదేరోజు ఆ సర్టిఫికెట్ల జారీ

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంస్కరణలు ప్రజలకు ఎంతో మేలుచేస్తున్నాయి. ముఖ్యంగా కుల వీకరణ పత్రాల జారీలో సర్కారు తీసుకొచ్చిన కొత్త విధానం వారి కష్టాలు తీరుస్తోంది. ఎందుకంటే.. ఈ పత్రాల జారీని ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. గతంలో ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే గరిష్టంగా 30 రోజుల్లోగానీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యేవి కావు. ఆ తర్వాత ఏదేని కారణంతో మళ్లీ అవసరమైనా మరోసారి 30రోజులు నిరీక్షించాల్సిందే. ఈ ఇబ్బందుల్ని పసిగట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అలాంటి వారికి సాంత్వన చేకూర్చే నిర్ణయం తీసుకున్నారు. దాని ప్రకారం.. కుల ధృవీకరణ పత్రం పొందిన వారికి, మళ్లీ దాని అవసరం ఎప్పుడైనా ఏర్పడితే కొత్తగా తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరంలేకుండా అంతకుముందు తీసుకున్న వివరాల ప్రకారం అడిగిన రోజునే గ్రామ, వార్డు సచివాలయాల్లో మరోసారి ఆ పత్రాలిచ్చే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2022 ఆగస్టు నుంచి అమలుచేస్తోంది. దీని ద్వారా గత ఏడాది కాలంలో రాష్ట్రంలో 21,00,888 మంది దరఖాస్తు చేసుకున్న రోజునే కుల ధ్రువీకరణ పత్రాలను అందుకున్నారు.

గతంలో ఒకసారి తీసుకున్న వారికి..

సాధరణంగా.. విద్యార్థుల స్కూళ్లలో లేదంటే కాలేజీల్లో చేరే సమయంలోనూ.. వివిధ ఉద్యోగ నోటిఫికేషన్ల సమయంలో నిరుద్యోగ యువతకు.. వివిధ సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారులకు కుల ధ్రువీకరణ పత్రాల అవసరం ఎక్కువగా ఉంటుంది. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో అమలులో ఉన్న నిబంధన ప్రకారం ఈ కుల ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్న రోజు నుంచి గరిష్ఠంగా 30 రోజుల్లో సంబంధిత మండల తహసీల్దార్ దానిని జారీచేయాల్సి ఉంటుంది. అయితే, చాలామంది గతంలో ఒకసారి తీసుకున్నా.. సరిగ్గా కాలేజీల ప్రవేశాలు, ఉద్యోగ నోటిఫికేషన్ల సమయంలో వివిధ కారణాలతో మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకుంటుంటారు. ఇలాంటి వారికి సైతం ఏడాది క్రితం వరకు గరిష్ఠంగా 30 రోజులకు గానీ అవి జారీ అయ్యేవి కావు. ఫలితంగా సకాలంలో అవి అందక అక్కడక్కడ కొందరు తమ అవకాశాలను కోల్పోయేవారు. అయితే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022 ఆగస్టులో కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అలాంటి వారికి అప్పటికప్పుడే సర్టిఫికెట్లు జారీచేయాలని సంకల్పించింది. విద్యార్థులు, నిరుద్యోగ యువత, వివిధ పథకాల లబ్ధిదారులు కీలక సమయాల్లో రెండోసారి అవసరమైతే దరఖాస్తు చేసుకున్న రోజునే ఆ పత్రాలు అందించేలా వీలు కల్పించింది.

భవిష్యత్తులోనూ కోటి మందికి అడిగిన రోజునే..

మీ–సేవా కేంద్రాల ద్వారా 2011 నుంచి ఇప్పటి వరకు దాదాపు నాలుగున్నర కోట్ల కుల ధృవీకరణ పత్రాలు జారీ అయ్యాయి. అందులో కొందరు నాలుగైదుసార్లు కూడా వాటిని పొంది ఉండొచ్చని.. అయితే, వాటిని ఆధార్ వివరాలతో సరిపోల్చినప్పుడు దాదాపు 75 లక్షల మంది ఆ సర్టిఫికెట్లు తీసుకున్నట్లుగా తాము గుర్తించామని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటుచేసిన గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అంటే.. 2020 జనవరి 26 నుంచి ఇంకో కోటిన్నర మందికి ఈ పత్రాలు జారీ అయినట్లు వారు తెలిపారు. ఈ పత్రాలను కూడా ఆధార్ వివరాలతో సరిపోల్చినప్పుడు 75 లక్షల మంది వివరాలను గుర్తించామన్నారు. ఇలా మీ–సేవ కేంద్రాల ద్వారా జారీ అయిన కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన 75 లక్షల మంది.. గ్రామ సచివాలయాల ద్వారా వాటిని పొందిన 75 లక్షల మంది కలిపి కోటిన్నర దాకా ఉన్నా, కొంతమంది రెండుచోట్ల తీసుకుని ఉండొచ్చన్న భావనతో కనీసం కోటి మంది కుల ధృవీకరణ పత్రాలు తీసుకున్న వారి సమాచారం గ్రామ, వార్డు సచివాలయాల ఆన్‌లైన్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరందరికీ భవిష్యత్‌లో వీటి అవసరం ఎప్పుడు ఏర్పడినా, గతంలో మాదిరిగా 30రోజులు వేచి ఉండే పరిస్థితి లేకుండా దరఖాస్తు చేసుకున్న రోజే వారికి గ్రామ, వార్డు సచివాలయాల్లో కుల ధృవీకరణ పత్రం జారీచేసే అవకాశం ఉంటుందన్నారు.



గత ఏడాది కాలంలో జిల్లాల వారీగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకున్న రోజునే కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన వారి సంఖ్య..

జిల్లా	సంఖ్య
అల్లూరి సీతారామరాజు	31,931
అనకాపల్లి	62,177
అనంతపురం	62,704
అన్నమయ్య	81,247
బాపట్ల	62,347
చిత్తూరు	77,721
అంబేద్కర్ కోనసీమ	72,125
తూర్పు గోదావరి	1,19,714
ఏలూరు	98,041
గుంటూరు	1,54,803
కాకినాడ	64,058
కృష్ణా	82,629
కర్నూలు	91,195
నంద్యాల	52,193
ఎన్టీఆర్	1,18,943
పల్నాడు	96,071
పార్వతీపురం మన్యం	31,710
ప్రకాశం	98,970
నెల్లూరు	93,281
శ్రీసత్యసాయి	46,650
శ్రీకాకుళం	40,787
తిరుపతి	98,872
విశాఖపట్నం	1,06,602
విజయనగరం	37,628
పశ్చిమ గోదావరి	1,20,244
వైఎస్సార్	98,245
మొత్తం	21,00,888

గ్లోబల్ టూరిజం హబ్‌గా భారత్

- రూ.655 కోట్లతో ఈక్యూ 7, డబ్ల్యూక్యూ 6, 7, 8 బెర్తుల ఆధునీకరణ పనులకు ప్రధాని శంకుస్థాపన
- కంటైనర్ టెర్మినల్ విస్తరణ ఫేజ్–2ను వర్చువల్‌గా ప్రారంభించిన మోదీ



మహారాణిపేట(విశాఖ దక్షిణ): విశాఖపట్నం పోర్టు అథారిటీకి సంబంధించిన పలు ప్రాజెక్టులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అలాగే కంటైనర్ టెర్మినల్ విస్తరణ ఫేజ్–2ను జాతికి అంకితం చేశారు. ముంబై కేంద్రంగా నిర్వహిస్తున్న గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్–2023కు ప్రధాని మోదీ మంగళవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్లోబల్ టూరిజం హబ్‌గా భారతదేశం ఎదిగేందుకు అవసరమైన అన్ని అవకాశాలను అందిపుచ్చుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే విశాఖపట్నం, చెన్నైలో మోడ్రన్ క్రూయిజ్ హబ్‌లు తీసుకువచ్చామన్నారు. ముంబైలో కూడా త్వరలో ఇంటర్నేషనల్ క్రూయిజ్ హబ్ రాబోతోందని తెలిపారు. అలాగే రూ.655 కోట్ల వ్యయంతో విశాఖ పోర్టు చేపట్టిన ఈక్యూ 7, డబ్ల్యూ క్యూ 6, 7, 8 బెర్తుల యాంత్రీకరణ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. రూ.633 కోట్లతో పూర్తి చేసిన విశాఖ కంటైనర్ టెర్మినల్ రెండో విడత విస్తరణ ప్రాజెక్టును ఆయన జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం నుంచి పోర్టు ట్రస్ట్ చీఫ్ ఇంజనీరింగ్ విభాగం సలహాదారు వేణు ప్రసాద్, వీసీటీపీఎల్ ప్రతినిధి కెప్టెన్ జాలీ, జేఎం.బక్షి, బోత్రా తదితరులు పాల్గొన్నారు.

పలు సంస్థలతో ఒప్పందాలు

గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్‌లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమక్షంలో విశాఖ పోర్టు పలు ఒప్పందాలు కుదుర్చుకుంది. పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దూబే.. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా తరపున ఎం.కె.వాతోర్, నేవీ అడ్మిరల్ నెల్సన్ డిసౌజా, ట్రయాన్ సంస్థ తరపున రజనీష్ మహాజన్ ఈ ఎంవోయూలపై సంతకాలు చేశారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ప్రస్తుతం విశాఖలోని కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకు ఉన్న 4 లేన్ల రహదారిని 6 లేన్లుగా అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం పోర్టు రూ.501 కోట్లు ఖర్చు చేయనుంది. అలాగే ఔటర్ హార్బర్‌లో పలు అభివృద్ధి పనులు చేసేందుకు భారత నౌకాదళంతో మరో ఒప్పందం కుదుర్చుకుంది. ట్రయాన్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో జరిగిన ఒప్పందంలో భాగంగా.. విశాఖ పోర్టు సాలగ్రామపురంలోని భూమిని ట్రయాన్ సంస్థకు దీర్ఘకాలిక లీజుకు ఇవ్వనుంది. ఈ ఒప్పందం విలువ రూ.900 కోట్లు. ఒప్పందంలో భాగంగా కన్వెన్షన్ సెంటర్లు, ఐటీ టవర్లు నిర్మించనున్నారు. కాగా, గ్లోబల్ మారిటైం సమ్మిట్‌లో విశాఖ పోర్టు ఏర్పాటు చేసిన స్టాల్ సందర్శకులను ఆకట్టుకుంది. విశాఖ పోర్టు అథారిటీ ఏపీ ప్రభుత్వంతో కలిసి ఏర్పాటు చేసిన స్టేట్ సెషన్‌లో పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు.



నిర్మలా సీతారామన్‌తో విజయసాయిరెడ్డి భేటీ

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి భేటీ అయ్యారు. ఢిల్లీలోని నార్త్‌బ్లాక్‌లో ఆర్థికశాఖ కార్యాలయంలో మంగళవారం ఆమెను కలిసిన విజయసాయిరెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పలు ఆర్థిక అంశాలను చర్చించారు.
– సాక్షి, న్యూఢిల్లీ

భూముల రీ సర్వేకు జాతీయస్థాయి ప్రశంస

- భూహక్కు–భూరక్ష సమీక్షలో మంత్రులు పెద్దిరెడ్డి, బొత్స, ధర్మాన
- రెండు దశల్లో ఇప్పటి వరకు 4 వేల గ్రామాల్లో సర్వే పూర్తి
- వచ్చే ఏడాది జనవరి నాటికి మూడో దశ సర్వే పూర్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నెలకొన్న భూసమ స్యలన్నింటినీ పరిష్కరించే లక్ష్యంతో చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియకు జాతీయ స్థాయిలో ప్ర శంసలు లభిస్తున్నాయని మంత్రులు పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ అన్నారు. రాష్ట్రంలో వందేళ్ల తర్వాత జరుగుతున్న భూముల రీ సర్వేను అత్యంత శాస్త్రీయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం జగనన్న భూహక్కు–భూరక్ష పథకంపై మంత్రి పెద్దిరెడ్డి అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. మంత్రులు మాట్లాడుతూ ఇటీవలే కేంద్ర కార్యదర్శి, అడిషనల్, జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారులతోపాటు 5 రాష్ట్రాల నుంచి సర్వే విభాగానికి సంబంధించిన కమిషనర్లు రాష్ట్రంలో పర్యటించి, భూముల రీ సర్వే విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. మొదటి, రెండు దశల్లో మొత్తం 4 వేల గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేసి, భూహక్కు పత్రాలను పంపిణీ చేసినట్లు అధికారులు మంత్రుల కమిటీకి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,072 గ్రామాల్లో డ్రోన్ ఫ్లైయింగ్ ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. 9 వేల గ్రామాలకు డ్రోన్ ఇమేజ్‌లను పంపించినట్లు చెప్పారు. మూడో దశకు సంబంధించి ఇప్పటికే 360 గ్రామాల్లో సర్వే పూర్తయ్యిందన్నారు. అర్బన్ ప్రాంతాల్లోనూ సర్వే ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపారు. నాలుగు మున్సిపల్ ఏరియాల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేసి, హక్కు పత్రాలను అందించాలనే లక్ష్యం మేరకు పనిచేయాలని మంత్రులు ఆదేశించారు.

మూడో దశ సర్వేను వచ్చే ఏడాది జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా అన్ని విభాగాల అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన సలహాదారు అజేయ కల్లం, భూపరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మైనింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, సర్వే సెటిల్మెంట్, భూమి రికార్డుల శాఖ కమిషనర్ సిద్దార్థ్ జైన్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సూర్యకుమారి పాల్గొన్నారు.

రూ.6,929 కోట్లతో గిరిజనాభివృద్ధి

- సబ్‌ప్లాన్ నిధుల సద్వినియోగంలో వేగం పెంచాలి
- అధికారులకు ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర ఆదేశం

సాక్షి, అమరావతి/దొండపర్తి (విశాఖ దక్షిణ): రాష్ట్రంలో రూ.6,929 కోట్ల వ్యయంతో గిరిజనాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర తెలిపారు. సీఎం వైఎస్ జగన్ గతేడాది కంటే.. ఈ ఏడాది ఎస్టీ సబ్‌ప్లాన్‌కు రూ.784 కోట్లు అధికంగా కేటాయించారని వివరించారు. ఈ నిధులను సద్వినియోగం చేస్తూ.. గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర సబ్‌ప్లాన్ నిధుల వినియోగాన్ని సమీక్షించారు. అన్ని రంగాల్లోనూ గిరిజనులు అభివృద్ధి సాధించాలన్నదే వైఎస్ జగన్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అందుకే గతేడాది కంటే ఈ ఏడాది అధిక నిధులను కేటాయించారని చెప్పారు. 2022–23లో ఎస్టీ సబ్‌ప్లాన్‌కు రూ.6,144.90 కోట్లు మంజూరు చేయగా.. ఈ ఏడాది రూ.6,929.09 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఈ నిధులను పూర్తిగా గిరిజన సంక్షేమానికే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిధుల సద్వినియోగంలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. గిరిజన గూడేలకు రహదారులు, తాగునీటి సరఫరా, విద్యా సంస్థల్లో సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, డైరెక్టర్ జె.వెంకటమురళి, ట్రైకార్ ఎండీ రవీంద్రబాబు, జీసీసీ ఎండీ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న పీడిక రాజన్నదొర

జీసీసీ సేవల విస్తృతానికి కొత్త వెబ్‌సైట్

గిరిజనులు, వినియోగదారులు, ఉద్యోగులకు అవసరమైన శీఘ్ర సేవలు, సమగ్ర సమాచారాన్ని అందించడంతో పాటు జీసీసీ సహజ ఉత్పత్తుల మార్కెట్‌ను మరింత విస్తృతం చేసేందుకు గిరిజన సహకార సంస్థ(జీసీసీ) నూతన వెబ్‌సైట్ దోహదపడుతుందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తెలిపారు. మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జీసీసీ నూతన వెబ్‌సైట్‌ను రాజన్నదొర ప్రారంభించారు. సీఎం జగన్ సారథ్యంలో నాలుగేళ్లలో గిరిజన సాధికారత సాధనలో జీసీసీ అనూహ్యమైన, మంచి ఫలాలను గిరిజనులకు అందించిందని వివరించారు. గిరిజనులకు డీఆర్ డిపోల ద్వారా రేషన్ సరుకుల సరఫరా, పెట్రోల్ బంకుల ఏర్పాటు, వివిధ రాష్ట్రాల్లో రిటైల్ ఔట్‌లెట్‌ల ద్వారా ఉత్పత్తుల విక్రయాలు, వన్‌ధన్ వికాస కేంద్రాల ఏర్పాటు, అరకు వ్యాలీ కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో విశేషమైన కృషి చేస్తూ సత్ఫలితాలు సాధిస్తోందని వెల్లడించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ సిబ్బందిని ఆయన అభినందించారు. గిరిజన సంక్షేమ శాఖ నేతృత్వంలో జీసీసీ చేస్తున్న కార్యక్రమాలను సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు జీసీసీ సహజ ఉత్పత్తుల మార్కెట్‌ను మరింతగా విస్తరించేందుకు ఈ వెబ్‌సైట్ విశేషంగా దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జీసీసీ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో జీసీసీ అందిస్తున్న సేవలు, ఖర్చు చేస్తున్న నిధులు, ప్రణాళికలు, ఫలితాలు వంటి వివరాలు అన్నీ గణాంకాలతో సహా నూతన వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. జీసీసీ సహజ ఉత్పత్తుల విక్రయానికి ఆన్‌లైన్ షాపింగ్‌తో పాటు సోషల్ మీడియా వేదికలను ఈ నూతన వెబ్‌సైట్‌తో అనుసంధానించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జీసీసీ ప్రధాన కార్యాలయం సహా ప్రాంతీయ కార్యాలయాలు, ఉద్యోగుల వివరాలను సమగ్రంగా అందుబాటులో ఉంచడంతో పాటు, పారదర్శకత, జవాబుదారీతనం పెంచే చర్యల్లో భాగంగా జీసీసీ సిబ్బంది బదిలీలు, ఉత్తర్వుల వివరాలతో పాటు టెండర్లు, నోటీసులు, ప్రకటనలు సమగ్రంగా ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని వివరించారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దాండే, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.మురళి, జీసీసీ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్, ట్రైకార్ ఎండీ రవీంద్రబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ చీఫ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘మామిడి’లో మనమే ఘనం

సాక్షి, అమరావతి : దేశంలో అత్యధికంగా మామిడి ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. అలాగే జాతీయ స్థాయి సగటు హెక్టార్‌కు మామిడి ఉత్పాదకతను మించి రాష్ట్రంలో సగటు హెక్టార్‌కు మామిడి ఉత్పాదకత అత్యధికంగా ఉంది. దేశంలో ఏపీ తర్వాత మామిడి ఉత్పత్తిలో ఒడిశా రాష్ట్రం ఉంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశాలో మామిడి తదితర పండ్ల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా రైతులకు మేలుతో పాటు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని అంతర్జాతీయ కార్మిక సంస్థ అధ్యయన నివేదిక వెల్లడించింది. కొరియా ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ ఏజెన్సీ సహకారంతో ఈ అధ్యయనం నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశాలో ఆహార ప్రాసెసింగ్ రంగంలో సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక రూపంలో విడుదల చేశారు.

- దేశంలోనే ముందంజలో రాష్ట్రం
- ఏపీలో హెక్టారుకు సగటున 12 టన్నుల ఉత్పత్తి
- జాతీయ సగటు 9.6 టన్నులు
- మామిడి ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా రైతులకు మేలు, నిరుద్యోగులకు ఉపాధి
- అంతర్జాతీయ కార్మిక సంస్థ అధ్యయన నివేదికలో వెల్లడి



నివేదికలో ఉన్న ముఖ్యాంశాలు

- జాతీయ స్థాయిలో హెక్టార్‌కు సగటున 9.6 టన్నుల మామిడి ఉత్పత్తి అవుతుండగా, ఏపీలో హెక్టార్‌కు సగటున 12 టన్నులు ఉత్పత్తి అవుతోంది.
- ఒడిశాలో హెక్టార్‌కు సగటున 4 నుంచి 6.3 టన్నుల మామిడి ఉత్పత్తి అవుతోంది.
- ఏపీలో ఉత్పత్తయ్యే మామిడి పండ్లలో 16% ఫ్రూట్ ప్రాసెస్ చేపడుతున్నారు. ఇలా ప్రాసెస్ చేసిన ఉత్పత్తుల డిమాండ్‌ను పెంచాల్సి ఉంది.
- ఏపీలో బంగినపల్లి, సువర్ణ రేఖ, నీలం, తోతాపురి రకాలు ఎక్కువగా పండుతుండగా, ఎగుమతికి అనువైన ఇమామ్ పసంద్, బంగినపల్లి, సువర్ణరేఖ వంటి గుజ్జు రకాలూ ఎక్కువగానే పండుతున్నాయి.
- ఏపీలో ఉత్పత్తి అయ్యే గుజ్జు రకాల పండ్లలో దాదాపు 54 శాతం ఎగుమతి అవుతున్నాయి. ప్రాసెస్ చేసిన పండ్ల ఉత్పత్తులకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది.
- గుజ్జు రకాల మామిడి పండ్ల ఉత్పత్తి ఏపీ, ఒడిశాలో అత్యధికంగా ఉంది. పండ్ల ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించడం ద్వారా అధిక ఉద్యోగాలు కల్పించవచ్చు. పండ్ల ప్రాసెసింగ్ పరిశ్రమలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉంది.
- ఫుడ్ ప్రాసెసింగ్‌లో కీలకమైన పరిమితులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలు నాణ్యమైన ముడి పదార్థాలను అందుబాటులో ఉంచాలి.
- ప్రభుత్వ పథకాలను అందుబాటులో ఉంచడంతో పాటు త్వరగా అనుమతులివ్వాలి. పండ్ల ప్రాసెసింగ్‌లో 75 శాతం మహిళలకు, 25 శాతం పురుషులకు ఉపాధి లభిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 3.39 మిలియన్ ఎంఎస్ఎంఈలను ఉండగా, ఒడిశాలో 1.98 మిలియన్ ఎంఎస్ఎంఈలున్నాయి. ఈ రెండు రాష్ట్రాల ఎంఎస్ఎంఈల్లోనే 111 మిలియన్ల మంది ఉపాధి పొందుతున్నారు.
- నమోదైన ప్రాసెసింగ్ యూనిట్ల కన్నా ఏపీ, ఒడిశాల్లో నమోదుకాని యూనిట్లు 26 నుంచి 80 రెట్లు ఉంటాయి.
- ఏపీ ప్రభుత్వం 2020–25 లక్ష్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ విధానాన్ని తెచ్చింది.. కొత్త సాంకేతిక బదిలీలను ప్రోత్సహించడం, సాంకేతికతను అప్‌గ్రేడేషన్ చేయడం, ముడి సరుకు సక్రమంగా సరఫరా అయ్యేలా సరైన పంటల ప్రణాళికలకు మద్దతు ఇవ్వడం, వ్యవసాయ ప్రాసెసింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేయడం. యువతకు వ్యవస్థాపక నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందించడం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఇంక్యుబేషన్ కేంద్రాల ఏర్పాటు, రైతు భరోసా కేంద్రాలు తదితరాలతో బ్యాక్‌వర్డ్ లింక్‌లను ఏర్పరచుకోవడం వంటివి లక్ష్యంగా విధానాన్ని రూపొందించుకుంది.

‘వెంకటగిరి’ ఉత్పత్తులు అత్యద్భుతం

ఇన్వెస్ట్ ఇండియా టీమ్ కమిటీ కితాబు

సైదాపురం/వెంకటగిరి రూరల్: వెంకటగిరి నేతన్నలు తయారు చేసిన పలు అద్భుతమైన డిజైన్‌లు అబ్బురపరుస్తున్నాయని ఇన్వెస్ట్ ఇండియా టీమ్ కమిటీ ప్రతినిధులు కితాబిచ్చారు. వెంకటగిరి చీరలు, చేనేత ఉత్పత్తులు, జరీ తదితర ఉత్పత్తులను మంగళవారం కేంద్ర బృందం పరిశీలించింది. ఓపెన్ ఇండియా ఒన్ ప్రొడక్ట్ అవార్డులో భాగంగా 2023లో ప్రతిష్టాత్మకంగా జరిగే పోటీల్లో వెంకటగిరి చేనేత ఉత్పత్తులకు ప్రాధాన్యమిచ్చారు. ఈ మేరకు ఇన్వెస్ట్ ఇండియా టీమ్ కమిటీ ప్రతినిధి జగీష్‌తివారిమిశ్రా, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డితో కలిసి వెంకటగిరిలో తయారు చేసే పలు చేనేత ఉత్పత్తులు, చీరలు, డిజైన్‌లను పరిశీలించారు. కేంద్ర బృందానికి వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు. పట్టణంలోని సాలికాలనీలోని టాటాట్రస్ట్ అంతరాన్ అందిస్తున్న సహకారం, నేతన్నల వృత్తిలో నైపుణ్యం వంటి అంశాలపై ఆరాతీశారు. బంగారుపేటలో రాష్ట్రపతి చేనేత అవార్డు గ్రహీతలు కూనా మల్లికార్జున్, గౌరవబత్తిన రమణయ్య నివాసాల వద్ద జందాని ట్రెడిషన్ రంగంలో తయారు చేసిన చీరలు, చీరలపై తెలుగు సంప్రదాయల కళ ఉట్టిపడేలా తయారు చేసిన డిజైన్‌లపై ఆరాతీశారు. వెంకటగిరి రాజా కాలంలో వెంకటగిరి జరీ చీరల ప్రత్యేకతపై వివరాలు తెలుసుకున్నారు. రాజరాజేశ్వరి చేనేత సహకారం సంఘాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వెంకటగిరిలోని ప్రముఖ వస్త్ర వ్యాపారి నక్కా వెంకటరమణయ్య అండ్ సన్స్ వద్దకు వెళ్లి తయారీ విక్రయానికి సిద్ధంగా ఉన్న పట్టు చీరలను పరిశీలించారు. అలాగే ప్రసిద్ధి చెందిన ఐఐహెచ్‌టీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ) కళాశాలను కేంద్ర బృందం ప్రతినిధి జగీష తివారి మిశ్రా పరిశీలించారు.



బంగారుపేటలో చేనేత పడుగు అల్లును పరిశీలిస్తున్న జగీష్ తివారి మిశ్రా



HONDA
Activate
your celebrations
Smart KEY
Smart SAFE
Smart UNLOCK
Smart START
Smart FIND
With H-Smart Technology
ACTIVA 125
It's SmartIVA
Scooter ante
ACTIVA
SUPER 6 OFFERS*
Low ROI @ 6.99%
No Cost EMI
Cashback Upto ₹5000
Down Payment ₹0
100 Pe 100
No Hypothecation
1. Connect earphones
2. Scan QR code
3. Enjoy the video
7230032200
30 MILLION#
BOOK ONLINE NOW!
CLICK BOOK RELAX
Honda Motorcycle & Scooter India Pvt. Ltd., Registered Office: Plot No. 1, Sector - 03, IMT Manesar, Distt. Gurugram, (Haryana) – 122050, India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com
*Terms and Condition apply. Product shown in the picture may vary from the actual product available in the market. Accessories shown in the product are not part of the standard equipment. #Source: Cumulative sales figure of Brand Activa from June 2001 to June 2023.
Honda Exclusive Authorized Dealerships: VIJAYAWADA: Sri Santosh Honda - 9703123445, 8019669955; Anvita Honda - 9225922599, 0866-6628333; Vihari Honda- 9703247365, 9703218817; ONE TOWN (VIJAYAWADA): Anvita Honda - 8142941414; GUDIVADA: Pruthvi Honda - 8977185999, 8977803888; JAGGAIAHPET: Sri Santosh Honda - 9703123445; MYLAVARAM: Vihari Honda - 9703218817; KAANURU: Sri Santosh Honda - 08666452666, 9618909494; GANNAVARAM: Sri Santosh Honda - 9912195558, 9391935558; VISSANNAPETA: Aishwarya Honda - 08673-272722, 9000866319; TIRUVURU: Sri VenkataSatya Honda - 08673-253446, 8977836666; KAIKALURU: Pruthvi Honda - 08677-225555, 9642854888; MACHILIPATNAM: Nagasai Honda - 9676945616; KANCHIKACHERLA: Sri Spandana Honda - 08678-273066, 8523034242; NANDIGAMA: Apple Honda - 07660867711, 08678-279001; CHALLAPALLI: Annapurna Honda - 8499900065; NUZIVIDU: Srishivani Honda - 7893194444; VUYYURU: Pruthvi Honda - 08676236236, 8142026888; IBRAHIMPATNAM: Leo Honda - 9348686966; KANKIPADU: Sri Santosh Honda - 7901097975; HANUMAN JUNCTION: Anvita Honda - 9492225959, 08656-245959; BHAVANIPURAM: Vihari Honda - 9703218820.
For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

ఒక్క క్షణం ఒక రోజునే మార్చగలదు.
ఒక్క రోజు ఒక జీవితాన్నే మార్చగలదు.
ఒక్క జీవితం ప్రపంచాన్నే మార్చగలదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 18 అక్టోబర్ 2023

రంగుల ఒలింపిక్స్ స్వప్నం

ఎప్పటి నుంచో వింటున్నదే... తెర వెనుక జోరుగా ప్రయత్నాలు సాగుతున్నదే... ఇప్పుడు అధికారికంగా ఖరారైంది. 128 ఏళ్ళ సుదీర్ఘ విరామం తర్వాత క్రికెట్ మళ్ళీ విశ్వక్రీడల్లో పునఃప్రవేశం చేయనుంది. మరో అయిదేళ్ళలో రానున్న 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో ఈ 'జెంటిల్మెన్ క్రీడ' సహా స్క్వాష్, బేస్‌బాల్/ సాఫ్ట్‌బాల్, లక్రాస్, ఫ్లాగ్ ఫుట్‌బాల్ ఆటలు అయిదింటిని అదనంగా ప్రవేశపెట్టనున్నారు. భారత్‌లో 50 ఓవర్ల ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ జరుగుతున్న వేళ ఈ ప్రకటన రావడం విశేషం. ముంబయ్‌లో 141వ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ప్రారంభ సమావేశంలో మాట్లాడుతూ, భారత్‌లో 2036 నాటి ఒలింపిక్స్ నిర్వహణకు మన ప్రధాని బాహాటంగా ఉత్సుకతను వ్యక్తం చేశారు. ఆ వెంటనే రెండు రోజులకే ఒలింపిక్ కార్యక్రమ సంఘం అధ్యక్షుడు కార్ల్ స్టాస్ క్రికెట్‌కు ఒలింపియాడ్‌లో స్థానాన్ని ప్రకటించడం ఉత్సాహం నింపింది. కాలానికి తగ్గట్టు మారే ఈ ప్రయత్నం అభినందనీయమే. అదే సమయంలో ఇది పలు సవాళ్ళపై చర్చ రేపింది.

ఎప్పుడో 1900లోనే తొలిసారిగా ప్యారిస్ ఒలింపిక్స్‌లోనే క్రికెట్ భాగమైంది. తర్వాత ఇన్నేళ్ళకు లాస్ ఏంజెల్స్‌లో మళ్ళీ తెరపైకి వస్తోంది. స్క్వాష్ సహా మిగతా 4 ఆటలకు విశ్వ క్రీడాంగణంలో ఇదే తెరంగేట్రం. ప్రపంచంలోని అతి పెద్ద క్రీడా సంరంభం నుంచి ఇన్నేళ్ళుగా క్రికెట్‌ను దూరంగా ఉంచడం దురదృష్టకరమే! ఇప్పుడు టీ–20 క్రికెట్ విస్తృత ప్రాచుర్యం పొందడమే కాక మునుపెన్నడూ లేని విధంగా ప్రపంచంలోని అనేక దేశాలు ఆ ఫార్మట్ పోటీల్లో పాల్గొంటున్నాయి. ఈ నేపథ్యంలో టీ–20 క్రికెట్‌కు కూడా చోటివ్వడం ప్రజాస్వామ్యబద్ధమైన ఆలోచన. తద్వారా ఒలింపిక్స్ మరింత చేరువవుతుంది. ఫుట్‌బాల్ తర్వాత ప్రపంచంలో అత్యధికులు అనుసరించే క్రీడగా క్రికెట్ ప్రసార, ప్రచార హక్కులతో ఒలింపిక్ సంఘానికి వచ్చే ఆదాయం, అటు నుంచి భారత్‌కు లభించే వాటా సరేసరి. అందుకే, ఐఓసీ తీసుకున్న ఈ నిర్ణయం వెనుక చాలా లెక్కలే ఉన్నాయి.

అయితే చిన్న తిరకాసుంది. క్రికెట్ సహా కొత్తగా చేరే ఆటలన్నీ 2028 ఒలింపిక్స్‌కే పరిమితం. వాటిని తర్వాత కొనసాగించాలా లేదా అన్నది ఆపైన 2032లో ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చే బ్రిస్బేన్ నిర్ణయిస్తుంది. నిజానికి, కామన్వెల్త్ దేశాలే కాక, ప్రపంచమంతా ఆడే విశ్వక్రీడగా క్రికెట్ విస్తరించాల్సి ఉంది. ఐఓసీ గుర్తింపు పొందిన 206 దేశాల్లో ప్రస్తుతం 50 శాతాని కన్నా తక్కువ చోట్లే క్రికెట్ ఆడుతున్నారు. కనీసం 75 శాతం చోట్ల క్రికెట్ తన ఉనికిని చాటాల్సి ఉంది. అది ఓ సవాలు. కొన్ని ఐఓసీ సభ్యదేశాలు చేస్తున్న ఈ వాదన సబబే. అలాగే, కొత్తగా ఒలింపియాడ్‌లోకి వస్తున్న అయిదింటిలో నాలుగు... టీమ్ స్పోర్ట్స్. కాబట్టి, క్రీడాగ్రామంలో ఆటగాళ్ళ సంఖ్య అంగీకృత కోటా 10,500 కన్నా 742 మేర పెరుగుతుంది. గేమ్స్ విలేజ్‌పై భారం తగ్గించడానికి ఇతర ఆటల్లో అథ్లెట్ల కోటా తగ్గించడం, కొన్ని మెడల్ ఈవెంట్లను ఈసారికి పక్కనపెట్టడమే మార్గం. అది కొంత నిరాశే!

అలాగే, ఒలింపిక్స్‌లోకి క్రికెట్ పునఃప్రవేశం బాగానే ఉంది కానీ, అగ్ర క్రికెటర్లు ఆ క్రీడాసంరంభంలో కాలుమోపుతారా అన్న అనుమానం పీడిస్తోంది. ఇటీవలి ఏషియన్ గేమ్స్ అనుభవమే అందుకు సాక్ష్యం. ఆసియా ఖండంలోని అధిక భాగం అగ్రశ్రేణి జట్లు ప్రధాన ఆటగాళ్ళను అక్కడకు పంపనే లేదు. అదేమంటే, దగ్గరలోనే 50 ఓవర్ల ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ ఉందన్నాయి. ఇండియా అయితే ఏషియాడ్‌కి క్రికెట్ జట్టునే పంపకూడదనుకుంది. ఆఖరు క్షణంలో క్రికెట్ బోర్డ్ మనసు మార్చుకుంది. వచ్చే 2028 నాటి అంతర్జాతీయ క్రికెట్ క్యాలెండర్ ఇంకా ఖరారు కాలేదు గనక, ఆ ఏడాది జూలైలో 16 రోజుల పాటు సాగే ఒలింపిక్స్‌లో అగ్రతారలు ఆడేందుకు వీలుగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) షెడ్యూల్‌ను ఖరారు చేస్తుందని ఒలింపిక్ సంఘం ఆశాభావంలో ఉంది.

గతంలో యూ23 అవతారంలో ఒలింపిక్స్‌లో ఫుట్‌బాల్ ప్రయోగం చేశారు. కానీ, ఆదరణ, ఆదాయం అంతంతే! టెన్నిస్, గోల్ఫ్‌లను చేర్చుకున్నా, ప్రథమశ్రేణి పేర్లు కనపడలేదు. ఇక, వరుణుడి కరుణపై ఆధారపడడం క్రికెట్‌కు మరో తలనొప్పి. తాజా ఏషియాడ్‌లో వాన వల్ల మ్యాచ్ రద్దయి, టీ20 ర్యాంకింగ్‌ను బట్టి స్వర్ణపతక విజేతను నిర్ణయించిన ప్రహసనం చూశాం. ఇక, 2036 ఒలింపిక్స్‌ను భారత్‌లో నిర్వహించేలా సర్వశక్తులూ ఒడ్డుతామని మోదీ ప్రకటించడం సంతోషమే అయినా, సాధ్యాసాధ్యాలపై అనుమానాలున్నాయి. జీ20 సదస్సు, ఏషియాడ్‌లో పతకాల శతకం తెచ్చిన ఉత్సాహంలో ప్రధాని దీన్ని '140 కోట్ల ప్రజల స్వప్నం'గా పేర్కొన్నారు. కానీ, వేల కోట్లతో స్టేడియమ్‌లు నిర్మించేకన్నా సామాన్యులకు కూడుగూడుపై దృష్టి పెట్టాలనే వాదనని విస్మరించలేం.

భారీ ఖర్చు రీత్యా 2026 కామన్వెల్త్ గేమ్స్ నిర్వహించడానికి సైతం ఆస్ట్రేలియా చేతులెత్తేసింది. ఇక, 2010లో మన కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణ అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయింది. అప్పట్లో భారత ఒలింపిక్ అసోసియేషన్‌ను 14 నెలలు ఐఓసీ బహిష్కరించింది. అవన్నీ మనం మర్చిపోరాదు. 2035 నాటికి భారత్ 6 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థ అవుతుందనీ, 2047కి అగ్రరాజ్యంగా అవతరిస్తామనీ జబ్బలు చరుస్తున్న వేళ ఒలింపిక్స్ స్వప్నం వసతులు పెంచుకోవడానికీ, క్రీడా ప్రతిభను పెంచిపోషించుకోవడానికీ ఉపయుక్తమే! దాని వెంటే ఉన్న సవాళ్ళతోనే సమస్య. తలసరి ఆదాయంలో మనల్ని ఎంతో మించిన లండన్, టోక్యో, ప్యారిస్, సియోల్‌లకున్న సహజమైన సానుకూలత మనకుందా? సంబరం ముగిశాక ఏథెన్స్, రియో లాంటి ఆతిథ్య దేశాలకు ఐరావతాలుగా మారి క్రీడాంగణాల్ని వాడుకొనే ప్రణాళిక ఉందా? పేరుప్రతిష్ఠలతో పాటు ప్రజలకూ పనికొచ్చేలా వ్యూహరచన చేస్తేనే ఎంత రంగుల కలకైనా సార్థకత.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
ఆశ్వయుజమాసం, **తిథి:** శు.చవితి రా.11.26 వరకు
తదుపరి పంచమి, **నక్షత్రం:** అనూరాధ రా.8.26 వరకు
తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** రా.1.56 నుండి 3.33 వరకు,
దుర్ముహూర్తం: ప.11.22 నుండి 12.09 వరకు,
అమృత ఘడియలు: ఉ.9.54 నుండి 11.31 వరకు.

సూర్యోదయం: 5.56
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

బహుజనులకు అదే విముక్తి మార్గం

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

కోట్లాది మంది రాజ్యాధికారానికి నోచుకోకుండా పోవడానికి రాజకీయాల్లో ఉన్న వర్ణతత్వమే కారణం అన్నారు అంబేద్కర్. నిజానికి అంబేద్కర్, మహాత్మా ఫూలే, పెరియార్ రామస్వామి నాయకర్ బహుజన వర్గాల సామాజిక, సాంస్కృతిక రాజకీయ విముక్తి కోసం బాటలు వేస్తూనే వచ్చారు. కానీ దళిత బహుజనులు, మైనారిటీలు మత భావాల ఊబిలో కూరుకుపోయారు. రాజ్యాధికారాన్ని అగ్రవర్ణ పార్టీల మీద ఆధారపడి పొందాలనే భావనలోనే ఇంకా ఉన్నారు. దేశంలో సామాజిక న్యాయం సంపూర్ణంగా జరగాలంటే కులాల వారీగా జనాభా లెక్కలు సేకరించాలి. శూద్రులను రాజకీయంగా, ఆర్థికంగా పైకి తేవడం అన్ని పార్టీల తక్షణ కర్తవ్యం కావాలి.

బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రారంభించిన బీసీ కుల గణన ఇండియా కూటమికి ప్రధాన ఎజెండాగా ఉంది. దేశంలో సామాజిక న్యాయం సంపూర్ణంగా జరగాలంటే కులాల వారీగా జనాభా లెక్కలు సేకరించాలి. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల జరుగుతున్నాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మిజోరం, తెలంగాణ వంటి ముఖ్యమైన రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో దగ్గర దగ్గర 16.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో దళిత బహుజన మైనారిటీలు 85 శాతం. అభ్యర్థులుగా నిలబడుతున్న మెజారిటీ వర్గం అగ్ర కులాలే.

డబ్బును, మద్యాన్ని నియంత్రించడానికి ఈ రాష్ట్రాల్లో 970 చెక్‌పోస్టులు పెట్టారని చెబుతున్నారు. నిజానికి ఎన్నికల వ్యవహారం మొత్తం మద్యం, మాఫియా, డబ్బు పంపిణీలో మునిగిపోయి వుందని అందరికీ తెలుసు. ఎన్నికల బరిలో కోటీశ్వరులు, అవినీతి సమ్రాట్లు, కల్తీ వ్యాపారులు, విద్యా వ్యాపారులు ఎక్కువమంది నిలబడుతున్నారు. కేసుల్లో ఉన్నవారు భారీగా ఉన్నారు. దీనికి పార్టీల భేదం లేదు. అందులో ఉన్నవారు ఇందులో ఉంటారు. ఆ పార్టీలో ఉన్నవారు టికెట్ లేకపోతే రెండో రోజే జంప్ అవుతారు. సామాజిక న్యాయానికి దూరంగా బతుకుతున్న పార్టీలు ఇవన్నీ. ఇంతకుముందు ఇచ్చిన మానిఫెస్టోనే మరలా కొత్తగా ప్రకటిస్తారు.

రాజ్యాంగాన్ని పూర్తి చేసిన తరువాత అంబేడ్కర్ చేసిన ప్రకటన చాలా విలువైనది. జనవరి 26, 1950 నుంచి వైరుధ్యాల జీవితంలోకి మనం అడుగు పెడుతున్నాం. రాజకీయాల్లో, ఆర్థిక, సాంఘిక జీవితాల్లో అసమానత్వం, వైరుధ్యాలను తొలగించకపోతే అసమానత్వంతో బాధపడుతున్న ప్రజలు ఈ రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థను పేల్చివేస్తారు అని హెచ్చరించారు. ఇది చాలా వాస్తవమైన ప్రకటన. రాజ్యాంగం ఇచ్చిన హక్కును గౌరవించలేని అంధత్వం సోకాల్డ్ రాజకీయ నాయకుల్ని వెంటాడుతోంది.

అంబేడ్కర్ భారతదేశానికి బ్రాహ్మణవాదం, పెట్టుబడిదారీ వాదాలను శత్రువులన్నాడు. బ్రాహ్మణవాదం అంటే ఇది బ్రాహ్మణులకు పరిమితమైంది కాదు. నా కులమే అన్ని కులాల కంటే అధికమైందనే భావం, ఆ కుల భావంతో ఇతరులను కించపరచడం. నేను, నా కుటుంబం, నా కులం మాత్రమే ఆర్థికంగా పైకి రావాలని ఆలోచించడం. కులాన్ని, కుటుంబాన్ని దాటలేనివాడు రాజనీతిజ్ఞుడు కాలేడు.

అంబేడ్కర్ ఆలోచనలు ఆనాటి నుండి ఈనాటి వరకు సమకాలీనంగానే ఉండడానికి కారణం సమాజంలో మార్పు చాలా ఆలస్యంగా జరుగుతోంది. నిజానికి కాంగ్రెస్ పార్టీ బీసీలకు మొదటి నుండి అన్యాయం చేస్తూనే వచ్చింది. కాకా కాలేల్కర్ కమీషన్‌ను తొక్కిపెట్టింది. మండల్ కమిషన్‌ను తొక్కి పెట్టింది. ఇకపోతే 1951లో రాజ్యాంగంలో 15(4), 16(4) క్లాజులను పొందుపరచి రాజ్యాంగ పరంగా బీసీ రిజర్వేషన్లకు వున్న అడ్డంకి తొలగించబడింది. అక్కడి



నుండి 1978 వరకు పరిపాలనలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను తమ రాజకీయ చదరంగంలో పావులుగా వాడుకున్నదే తప్ప వారి సంక్షేమానికి ఇసుమంత సౌలభ్యాన్ని కూడా కలిగించలేదు. 2012–1978న అప్పటి జనతాపార్టీ ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ పార్లమెంటులో చేసిన ప్రకటన మేరకు మాజీ పార్లమెంటు సభ్యులు బి.పి. మండల్ అధ్యక్షతన వెనుకబడిన తరగతుల కమీషన్ నియమింపబడింది. ఆ కమీషన్‌లో ఆర్.ఆర్. బోలె, దివాన్ మోహన్ లాల్, దీనబంధు సాహు, కె. సుబ్రహ్మణ్యం, యస్.యస్. గిల్ సభ్యులుగా వున్నారు. ఈ కమిషన్ మొత్తం 40 సిఫార్సులను చేసింది. అందులో ప్రధానమైనవి:

సాంఘికంగా, విద్యా విషయకంగా వెనుకబాటుతనం, ఆర్థిక పేదరికం అనేవి అంగవైకల్యం పొందిన కుల వ్యవస్థ తాలూకు రెండు ప్రత్యక్ష ఫలితాలు. వీటిని తొలగించడానికి తీవ్రమైన పరిపాలనా మార్పులు అవసరం; రిజర్వేషన్లు వుండడం వలన అర్హత, యోగ్యత ఏమీ దెబ్బతినవు. జనాభాలో 52 శాతం వున్న వీరికి ఆ జనాభాకు తగిన రిజర్వేషన్లు విద్యా ప్రభుత్వోద్యోగాల్లో వుండాలి; ఉద్యోగ నియామకాలలో ప్రత్యక్షంగా భర్తీ చేసుకొనేటప్పుడు అభ్యర్థుల వయసు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల వలె పొడిగించాలి; ఆయా కులాల్లోని అభ్యర్థులు దొరకనపుడు ఖాళీలను మూడు సంవత్సరాల వరకు అట్టి పెట్టాలి; మిగులు భూముల పంపిణీ బీసీలకు కూడా జరపాలి; 3,743 కులాలను బీసీ కులాలుగా తేల్చారు.

మండల్ కమిషన్ నివేదిక అమలు జరపకపోవడం వల్లే ఆనాడు కాంగ్రెస్‌కు బీసీలు దూరమయ్యారు. ఆ తరువాత జనతా పార్టీ ఏర్పడిన తరువాత మండల్ కమీషన్ నివేదికలోని కొన్ని అంశాలు అమలు జరపడం గురించే జన సంఘ్ బయటకు వచ్చి భారతీయ జనతా పార్టీగా రూపొందింది. బీసీల రిజర్వేషన్ల విషయంలో బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒకటిగానే ఉన్నాయని మాజీ ప్రధాని వీపీ సింగ్ ఈ వ్యాసకర్తతో స్వయంగా అన్నారు. బీసీలంతా హిందువులే అని బీజేపీ ప్రకటిస్తుంది. శూద్రులను క్షత్రియత్వం నుండి కిందకి నెట్టి బానిసలుగా మార్చారని అంబేడ్కర్ చెప్పారు. ఏ బానిసత్వాన్ని అయితే వైదిక, బ్రాహ్మణవాదం, హిందూ వాదం బీసీలపై రుద్దిందో వారు అదే హిందూ ఆచారాలని ఆచరించడం ఆశ్చర్యాన్ని కొలిపే విషయం.

సామాజిక, రాజకీయ బానిసత్వం అనే భావజాలం కట్టు బానిసలుగా చేస్తుంది. శూద్రులను బానిసత్వం నుండి విముక్తి చేయడం కోసం, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో తీవ్రంగా కృషి చేశారు జ్యోతిబా ఫూలే. శూద్రులను రాజకీయంగా, ఆర్థికంగా పైకి తేవటం ప్రభుత్వ కర్తవ్యం. శూద్రుల మనస్సు హృదయమూ సంతోషపడినట్లయితే ముందు ముందు బ్రిటిష్ ప్రభుత్వం వారి విధేయత గురించి ఆలోచించవలసిన అవసరమే రాదు అన్నారు జ్యోతిబా. ఆయన ఉద్యమం 1840 నుండి 1880 వరకు బలంగా సాగింది. ఆయన సత్యశోధక్ సమాజాన్ని స్థాపించి శూద్రుల్లోనూ, దళితుల్లోనూ ఉత్తేజకరమైన మార్పులు తీసుకువచ్చాడు. శూద్రుల్లోని భూస్వామ్య కులాలు ఓబీసీల నుండి విడిపోయాక బ్రాహ్మణవాదులు, భూస్వామ్య కులాలు కలసి ఓబీసీలను, దళితులను అణుస్తూ వచ్చాయి. నిజానికి 1870 దశకంలోనే జ్యోతిబా, ఆయన శ్రీమతి నిమ్న జాతుల పాఠశాలల కోసం సుమారు పది సంవత్సరాల పాటు కృషి చేశారు. అవి స్థిరపడ్డాయనుకొన్న తర్వాతనే ఇతర సాంఘిక, సేవా కార్యక్రమాలవైపు దృష్టి మళ్ళించారు. అయితే విదేశీయుల ఆదరణ తగ్గటం, స్థానికులు వాటిపై తగినంత శ్రద్ధ చూపకపోవటం వంటి కారణాల వల్ల అవి ప్రత్యేకంగా నిలబడలేకపోయాయి.

నిజానికి దళితులని, శూద్రులని ఎప్పటికప్పుడు నూత్నమైన నినాదాలతో అగ్రకుల పార్టీలు మోసం చేస్తూనే వస్తున్నాయి. అంబేడ్కర్, మహాత్మా ఫూలే, పెరియార్ రామస్వామి నాయకర్ ఈ వర్గాల సామాజిక, సాంస్కృతిక రాజకీయ విముక్తి కోసం బాటలు వేస్తూనే వచ్చారు. కానీ దళిత బహుజనులు, మైనార్టీలు మత భావాల ఊబిలో కూరుకుపోయారు. రాజ్యాధికారాన్ని అగ్రవర్ణ పార్టీల మీద ఆధారపడి పొందాలనే భావనలోనే ఇంకా ఉన్నారు. ఇండియా కూటమి ఒక దళితుడిని ప్రధానమంత్రిగా ప్రకటించే స్థాయిలో ఎందుకు లేదు? నిరంతరం రాజ్యాంగ సూత్రాలను ధ్వంసం చేయాలనే ఆలోచనతో ముందుకెళ్తున్న బీజేపీని కొన్ని ప్రయోజనాలను ఆశించో, కొన్ని ఆచారాలకు లోబడో, మళ్ళీ మళ్ళీ ఎన్నుకుంటున్నారు. వారి గంభీరమైన ఉపన్యాసాలకు మైమరచిపోయి వారికి సామాజిక, రాజకీయ బానిసత్వం చేస్తూనే వస్తున్నారు. కోట్లాది మంది రాజ్యాధికారానికి నోచుకోకుండా పోవడానికి కారణం రాజకీయాల్లో ఉన్న వర్ణతత్వమే అన్నారు అంబేడ్కర్. ఆయన మార్గంలోనే విముక్తి ఉందని దళిత, బహుజనులు గమనించినప్పుడే మత, కుల భావాలకు అతీతంగా సమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

వ్యాసకర్త దళితోద్యమనేత | 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

గుర్తుకొస్తున్నాయి



అనిల్ నాకు చిరకాల మిత్రుడు. ఇండియా కోసం అనిల్‌తో కలిసి చాలా కాలం ఆడటం నా అదృష్టం. ఆటకు నిజమైన స్ఫూర్తి, స్ఫూర్తికి నిజమైన ఛాంపియన్ అనిల్. జన్మదిన శుభాకాంక్షలు మిత్రమా! (17 అక్టోబర్ అనిల్ కుంబ్లే బర్త్ డే.)

– సచిన్ టెండూల్కర్, క్రికెట్ దిగ్గజం

నా వల్ల కాదు



నవంబర్‌లో జరుగనున్న ఈ ఏడాది వెబ్ సమిట్‌కు నేను దూరంగా ఉండదలిచాను. అందుకోసం నా ప్రదర్శనను రద్దు చేసుకున్నాను. బదులుగా ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రజల శాంతి కోసం ప్రార్థిస్తున్నాను. హమాస్‌ను ఖండిస్తున్నాను.

– గ్యారీ ట్యాన్, 'వైకాంబినేటర్' సీఈవో

ఇలా ఎలా జరుగుతుంది!



వీగర్‌లో మారణహోమానికి, తైవాన్‌లో దురాగతాలకు, హాంకాంగ్‌లో మానవ హక్కుల హననానికి పాల్పడుతూ... ఉక్రెయిన్‌లో పుతిన్ చర్యలకు మద్దతు ఇస్తున్న చైనాతో వాణిజ్య చర్చల ప్రణాళికను సునాక్ (బ్రిటన్) ప్రభుత్వం గుట్టు చప్పుడు కాకుండా పునరుద్ధరించింది!

– బెనెడిక్ట్ రోజర్స్, యాక్టివిస్ట్–ఎనలిస్ట్


మతిపోతోంది!



డాక్టరుగా శిక్షణ పొందడంలో ప్రయోజనం ఏమిటి! నేను లింక్డ్ఇన్‌లో గమనిస్తున్నాను. పి.ఎ. (ఫిజిషియన్ అసోసియేట్)గా ఉద్యోగాలు చేస్తున్నవారి వేతనం డాక్టర్‌లకు వస్తున్న దాని కన్నా ఎంతో మెరుగ్గా ఉంది. నేనిప్పుడు పి.ఎ. అర్హతను పొందాలని చూస్తున్నాను. వైద్య డిగ్రీ ఉన్నవారు దరఖాస్తుకు అర్హులో కాదో మరి!

– డాక్టర్ నాట్, ఇంగ్లండ్


రేడియో తరంగాలు



కొత్త పుస్తకం 'ఇగ్నైటింగ్ కలెక్టివ్ గుడ్‌నెస్: మన్ కీ బాత్ ఎట్ 100'... ప్రధాని నరేంద్ర మోదీజీ నాయకత్వంలో మన దేశం చేపట్టిన ఒక ప్రత్యేక ప్రయాణం గురించి చెబుతుంది. నూరవ ఎపిసోడ్ మార్క్ దాటిన ఈ రేడియో ప్రసంగాల సంకలనాన్ని యువత తప్పనిసరిగా చదవాలి. పుస్తకాన్ని ప్రచురించిన 'బ్లూ క్రాఫ్ట్'కు అభినందనలు.

– అమిత్‌షా, కేంద్ర హోం మంత్రి


ముక్కలవని మనిషి



కుమార్తె షీనా బోరా హత్య కేసులో ప్రధాన నిందితురాలిగా అభియోగాలు మోసిన ఇంద్రాణీ ముఖర్జీ... కుష్వంత్‌సింగ్ లిటరరీ ఫెస్టివల్–2023లో తన పుస్తకం 'అన్‌బ్రోకెన్' గురించి మాట్లాడిన విధానం ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. స్వీయ ప్రేమ, సామాజిక నిబంధల గురించి ఎంతో లోతైన అవగాహనతో ఆమె తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

– బలరామ్ శర్మ, సామాజిక కార్యకర్త

విజాతి వికర్షణ



"క్వీర్‌నెస్ అనేది సహజమైన ఒక అసహజం. నగర జీవులది, ఉన్నత వర్గాలది కాదు" అని సుప్రీంకోర్టు చెప్పింది. 'క్వీర్' అంటే 'విజాతి ధ్రువాలకు ఆకర్షింపబడని' అని అర్థం. ఈ అసహజం 'సహజమే' అని కోర్టు అభిప్రాయపడింది కదా... మరి సజాతి పెళ్లిళ్లను గుర్తించడానికి ఎందుకు నిరాకరించినట్లు?

– ఆదిత్య రాథోడ్, జియో పొలిటికల్ జర్నలిస్ట్



అనుకరణ

మా అమ్మాయి
తన సైకిల్ హ్యాండిల్ మధ్య
గూడు అల్లుకున్న ఒక సాలె పురుగును
తీసెయ్యలేక పోయింది-
ఎదురుచూస్తూ ఉంది.
దానంతట అదే తన నివాసం
మార్చుకుంటుందేమోనని!

అప్పుడు నేనన్నాను
'ఆ గూడు తీసెయ్యరా బుజ్జీ
అప్పుడు దానికి తెలిసొస్తుంది
ఈ స్థలం తన ఇల్లు కాదనీ...
అప్పుడు నువ్ ఎంచక్కా
నీ బైక్ వాడుకోవచ్చు'- అని.

నా కూతురు ముఖంలో
ఆందోళన కనిపించింది-
'లేదు నాన్నా! లేదు
అలా చేయడం వల్లే కదా?
వలస వచ్చిన చాలామంది
నిరాశ్రయులై పోతున్నారూ?' అంది.

ప్రపంచం నా కళ్ళముందు
గిర్రున తిరిగింది!

మూలం: ఫాడీ జౌదా
(పాలస్తీనియన్–అమెరికన్ కవి)
తెలుగు: డాక్టర్ దేవరాజు మహారాజు

రెండు వేల ఏళ్ల పట్టణం

సందర్భం



గార రంగనాథం

ఒక వ్యక్తి ప్రఖ్యాతుడైనప్పుడు అతడి పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవాలనీ, అతడి క్రమాభివృద్ధిని అవగతం చేసుకోవాలనీ ఉత్కంఠ సహజం. ఒక ప్రాంతం వెలుగులోకి వచ్చినా అలాంటి ఉత్సుకతే జనానికి కలుగుతుంది. ఉత్తరాంధ్రకు చెందిన విశాఖపట్టణం కార్యనిర్వాహక రాజధానిగా ముస్తాబవుతున్న గొప్ప సందర్భంలో ఆ పట్టణ చరిత్రను పరిశీలిద్దాం.

ఇతిహాసాలలో హస్తినాపురం, మధురానగరం, చరిత్రలో కళింగనగరం, ధాన్యకటకం, పిష్టపురం ఇలా నగరాలూ, పురాలూ, కటకాలూ ఉన్నాయేగానీ పట్టణాలు లేవు. బంగాళాఖాత తీరంలో విదేశాలతో వాణిజ్యం కోసం ఏర్పడిన కొన్ని రేవుల వద్ద ఏర్పడిన నగరాలను మాత్రం ఎందుచేతనో పట్టణాలుగా పిలవడం జరిగింది. గోపాలపట్టణం, కళింగపట్టణం, భీమునిపట్టణం, మచిలీపట్టణం, నాగపట్టణం, చెన్నపట్టణం, ఇలా. అలాంటిదే విశాఖపట్టణం కూడా!

విశాఖపట్టణం కళింగ దేశంలో ఒక భాగం. కళింగం ఆంధ్రం కంటే భిన్నమైన నేల. బౌద్ధమతం నందుల పాలనకు ముందే కళింగదేశంలో ప్రవేశించింది. మౌర్యుల కాలంలోనే బౌద్ధం కళింగ దేశంలో వ్యాప్తి చెందింది. విజయుడనే కళింగరాజు 700 మంది బౌద్ధ భిక్షువులతో బుద్ధుని అస్తికలను తీసుకొని కళింగ తీరపు రేవులో ఓడెక్కి సింహళం వెళ్ళాడని బౌద్ధ గ్రంథాలు తెలుపుతున్నాయి. కళింగ ప్రజలు జీవనోపాధికై తూర్పు దేశాలకు వలస వెళ్ళేవారు. కళింగ పట్టణం మొదలైన రేవుల నుండి ప్రజలు ఓడలెక్కి బర్మా, ఇండోనేషియా వంటి దేశాలకు వలస వెళ్ళారు. బౌద్ధమతం ఈ వలసలను ప్రోత్సహించింది. అలాంటి రెండువేల ఏళ్ళనాటి కళింగ దేశపు రేవు పట్టణాల్లో విశాఖపట్టణం ఒకటని చెప్పవచ్చు.

విశాఖ ప్రాంతంలో రెండువేల ఏళ్ళ క్రిందట బౌద్ధం మంచి ప్రచారంలో ఉండేది. అనకాపల్లి దగ్గరి ఒకప్పటి బుద్ధునికొండే నేడు బొజ్జన్నకొండగా పిలువ బడుతోంది. గుప్తుల నాణెం ఇక్కడ దొరికినందున క్రీ.శ. నాలుగైదు శతాబ్దుల నాడు ఈ ప్రాంతం బౌద్ధ క్షేత్రంగా మంచి ప్రచారంలో ఉండేదని చెప్పవచ్చు. విశాఖలోని తొట్లకొండ బౌద్ధ నిర్మాణాలు క్రీస్తుకు పూర్వమే నిర్మించబడినట్లు చరిత్ర. ఇక్కడి బావికొండ, పావురాలకొండ ఒకనాటి బౌద్ధప్రాచుర్యానికి నిదర్శనాలు. అలాంటి కాలంలో విశాఖ అనే మహిళ జైన మతాన్ని వదలి బౌద్ధంలో ప్రవేశించి తన యావదాస్తిని దానం చేసినట్టు బౌద్ధచరిత్రలు చెబుతు న్నాయి. ఈ తీరంలో ఆవిడ తన ఆస్తితో బౌద్ధ సన్యాసుల కోసం ఒక నగరం నిర్మించి ఉంటుంది. దానిని అప్పటి నుండి ఆమె పేరన విశాఖ పట్టణంగా పిలుచుకొని ఉంటారు. చారిత్రక సంఘటనల తోడి ఒక అంచనా ఇది.

సముద్రతీరాన రాముడు ప్రతిష్ఠించిన ఈశ్వరుడు రామేశ్వరుడు అయినట్టే, విశాఖ సముద్రతీరాన విశాఖవర్మ నిర్మించిన కోవెలే విశాఖేశ్వర ఆలయం అయిందని ఇక్కడి ప్రజలు నమ్ముతుంటారు. విశాఖవర్మ శ్రీపురం నుండి కోరోషండ శాసనాన్ని వేయించాడు. అతని కాలం నుండి ఈ పట్టణాన్ని విశాఖపట్నంగా పిలుస్తున్నారు. 1600 సంవత్సరాల నాడు నిర్మించిన ఆ కోవెల కాలక్రమంగా ఆటుపోట్లకు గురై సముద్రగర్భంలో కలిసిపోయింది. ప్రస్తుతం ఆ ప్రాంతాన్నే 'లాసన్సు బే' అంటున్నారు. అప్పటినుండి భక్తులు ఈ ప్రాంతంలోనే సముద్రస్నానం చేస్తూ ఉండడం వలన ఇక్కడి రాళ్ళను నేటికీ తీర్థపురాళ్ళని అంటున్నారు.

ఇవన్నీ అంచనాలే అయినా, విష్ణువర్ధన మహారాజు పరిపాలనా కాలంలో, క్రీ.శ. 1068లో వేయించిన ద్రాక్షారామ భీమేశ్వరుని కోవెలలోని శిలాశాసనంలో విశాఖపట్టణం అనే పదం ఉంది. ఈ విశాఖకు



సంబంధించి ప్రస్తుతానికి దొరుకుతున్న తొలి చారిత్రకాధారం ఇదే! విశాఖపట్నానికి దక్షిణగా ఉన్న దుర్గకొండ మీద ఐదు శాసనాలు లభించాయి. అందులో నాల్గు క్రీ.శ.1090, 1180, 1198, 1250 కాలాల నాటివి. ఈ నాల్గింటిలోనూ 'విశాఖపట్టణమైన కులోత్తుంగ చోడపట్టనత్తు' అనే ఉంది. వెయ్యేళ్ళ క్రిందటే ఉనికిలో ఉన్న విశాఖపట్టణాన్ని కులోత్తుంగుడను చోళరాజు పేరన 'కులోత్తుంగ చోళపట్టణం'గా మార్చినట్టు వీటి ద్వారా స్పష్టమౌతోంది.

ఇక 1500 తరువాత తూర్పు దండయాత్రకు వచ్చిన కృష్ణదేవరాయలు కటకం ప్రతాపరుద్ర గజపతిని జయించడం కోసం కొంతకాలం పాటు తన సైన్యాన్ని సింహాచలం ప్రాంతంలో నిలిపి ఉంచాడు. సైన్యం నిలిచిన చోట్లు పాలెంలు అయ్యాయి. అలా ఏర్పడిన పదులకొద్దీ పాలెంలు ఈ విశాఖపట్టణం లోపలా, బైటా నేటికీ ఉన్నాయి. కానీ రాయల నాటి చరిత్రలో సింహాచలానికి ఉన్న ప్రాధాన్యత విశాఖకు లేదు. అప్పటికి దాని ప్రశస్తి తగ్గి ఉంటుంది.

విశాఖలో ఆంగ్లేయులు అడుగుపెట్టింది 1634 అయినా, వారి ఫ్యాక్టరీ 1682లో ప్రారంభమైంది. యూరోపియన్లు జలమార్గంలోనే మన దేశానికి రావడం, సహజసిద్ధ ఓడరేవు విశాఖలో ఉండడం, వారి ఎగుమతి దిగుమతులు ఓడల్లోనే జరుగుతుండడం కారణంగా విశాఖ ప్రఖ్యాతమైంది. హార్బరుతో పాటు, కోరమండల్, కాల్‌టెక్స్, ఉక్కు ఫ్యాక్టరీ లాంటి పరిశ్రమలెన్నో చేరి విశాఖపట్నం మహానగరమైంది.


ఆంధ్రరాష్ట్ర శాశ్వత రాజధాని విశాఖలో ఏర్పడాలనే రొక్కం లక్ష్మీనరసింహం గారి సవరణకు అనుకూలంగా 61, ప్రతికూలంగా 58 ఓట్లు పడినట్లు, 20 మంది తటస్థంగా ఉండిపోయినట్లు, 1953 డిసెంబర్ 1న వార్తాపత్రికలలో వచ్చింది. ముందటిరోజు అప్పటి ఆంధ్రరాష్ట్ర తాత్కాలిక రాజధాని కర్నూలులో జరిగిన శాసనసభలో ఈ ఓటింగ్ జరిగినట్లు శాసన సభాధ్యక్షులు వల్లంపాటి వెంకట్రామయ్య సభలో ప్రకటించారు. అనంతరం సభలోగల ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు స్పందిస్తూ 1956 ఏప్రిల్ సరికి విశాఖలో శాశ్వత రాజధాని ఏర్పాటు చేస్తామని సమాధానమిచ్చారు. పాలకుల చేత తరతరాలుగా వెనుకబాటుకు గురౌతున్న కళింగాంధ్రలో ఈ నాటికి ఒక రాజధాని ఏర్పడడం ఎంతైనా ముదావహం.

వ్యాసకర్త సాహిత్య విమర్శకుడు | 98857 58123
(70 ఏళ్ళ 'రాజధాని' హామీ నెరవేరుతున్న వేళ.)

మనుషులలో దేవుడు

మనుషులు నిత్యం దేవాలయాలకు వెళతారు. పూజలు చేస్తారు. ఆపద మొక్కులు మొక్కుతారు. ఆపదలు తీరితే సంతోషంతో మొక్కులు చెల్లిస్తారు. తీరకపోతే దేవుడున్నాడా, ఉంటే తమను ఎందుకు పట్టించుకోవట్లేదని వాపోతారు. చేసే పూజలు, వేసే కానుకలు చాలవేమో అని మరింత భక్తిని ప్రదర్శిస్తారు.

మనిషి తాను చేసిన శిలా విగ్రహాలకు మాత్రమే మహిమ ఉందని విశ్వసిస్తూ, సాటి మనిషికి అవసరంలో సహాయపడక పోవటం దైవానికి ఆనందం కలిగించదని గుర్తించడు. సృష్టి అణువు అణువులో ఉన్న తనని గుర్తించని మనిషిని దేవుడు మెచ్చడు. దేవుడెక్కడో కొండల్లో, కోనల్లో ఉంటాడని భావిస్తూ వ్యయప్రయాసలకు ఓర్చి వెతుకుతూ ఉండే మనిషికి, నిజంగా కళ్ళు తెరిచి, మనసు పెట్టి చూస్తే, సాటి మనిషిలోనే దైవం కనిపిస్తాడని ఒక మహాకవి చెప్తాడు. మనుషుల్లో దైవాన్ని దర్శించగలగటం ఉదాత్త లక్షణం.



దేవతా ప్రతిమలకు ఉత్సవాలూ, కల్యాణాలూ చేయించటానికి వేలు వ్యయం చేసే మనిషి, ఇంటిముందు నిల్చున్న అన్నార్తునికి మెతుకు విదల్చడని నిందిస్తాడు మరో మహాకవి. కంటి కెదురుగా కనిపించే ప్రతి మనిషిలో దైవాన్ని దర్శించగలిగితే, ఆపన్నులకు స్నేహ హస్తాన్ని అందించగలిగితే, నిత్యం భగవంతుని ప్రత్యక్ష సాన్నిధ్యాన్ని అనుభవిస్తున్నట్లే! మనిషి తన సాటి మనిషికి అందించే సేవే భగవంతునికి చేసే నిజమైన సేవ అవుతుంది. మానవ సేవే మాధవ సేవ అంటే అదే కదా!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

చంద్రఘంట రూపిణి పాహిమాం



రావణ వాహనంపై అమ్మవారితో శ్రీశైలవాసుడు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. దేవీనవరాత్రుల్లో భాగంగా మంగళవారం శ్రీశైల భ్రమరాంబాదేవి చంద్రఘంట రూపంలో అభయహస్తంతో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయం వద్దనున్న ప్రత్యేక వేదికపై చంద్రఘంట రూపంలో అలంకరించిన భ్రమరాంబాదేవి ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లను రావణ వాహనంపై అధిష్టించి ప్రత్యేక హారతి ఇచ్చారు. ఉత్సవమూర్తులకు ఆలయ ఉత్సవం నిర్వహించి గ్రామోత్సవానికి తరలించారు. డప్పు వాయిద్యాల నడుమ గ్రామోత్సవం సాగింది.

ముత్యపు పందిరిలో మలయప్ప వైభోగం



ముత్యపు పందిరిలో ఊరేగుతున్న శ్రీమన్నారాయణుడు

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి మలయప్ప స్వామి ముత్యపు పందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సింహ వాహనాన్ని అధిష్టించి యోగ నరసింహుడు రూపంలో ఊరేగిన స్వామి రాత్రి ముగ్ధమనోహర స్వరూపుడై ఉభయ దేవేరులు శ్రీదేవి, భూదేవితో కలిసి భక్తులను సాక్షాత్కరించారు. అనంతరం సహస్రదీపాలంకార సేవలో ఊయలూగుతూ స్వామివారు దర్శనమిచ్చారు. తర్వాత సర్వాలంకార భూషితుడై అశేష భక్తజన గోవింద నామాల నడుమ పురవీధుల్లో రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారు వైభవంగా ఊరేగారు. ఉత్సవ శోభల్లో వివిధ కళా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు కనువిందు చేశాయి. వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ దర్శనం

విజయవాడలో వైభవంగా దసరా ఉత్సవాలు

అన్నవరం సత్యదేవుని ఆలయం నుంచి పట్టు వస్త్రాల సమర్పణ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారికి విశేష అలంకరణ, నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా దర్శించుకున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి నిర్వహించిన విశేష ఆర్జిత సేవల్లోనూ ఉభయదాతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మను రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. దసరా ఉత్సవాలలో భాగంగా దుర్గమ్మకు అన్నవరం శ్రీవీర వెంకట సత్యనారాయణస్వామి వారి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను సమర్పించారు. అన్నవరం దేవస్థాన ఈవో, దుర్గగుడి దసరా ఉత్సవాల ఫెస్టివల్ ఆఫీసర్ ఎస్ఎస్.చంద్రశేఖర్ ఆజాద్ అమ్మవారికి సమర్పించేందుకు పట్టువస్త్రాలను తీసుకురాగా, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ ఈవో కేఎస్ రామారావు సాదరంగా స్వాగతం పలికారు. ఉత్సవాల ఏర్పాట్లను సీపీ టీకే రాణా పర్యవేక్షించగా,



అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు

ఆలయ ప్రాంగణంలో డీసీపీ విశాల్‌గున్ని క్యూలైన్లను పర్యవేక్షించారు. సాయంత్రం ఆది దంపతుల నగరోత్సవం కన్నుల పండువగా సాగింది. నగరోత్సవంలో ఆలయ చైర్మన్ రాంబాబు, ఈవో కెఎస్ రామారావు పాల్గొన్నారు.

వైష్ణవీదేవిగా రాజశ్యామల

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం శ్రీశారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు వైష్ణవీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి హారతి ఇచ్చారు. రాజశ్యామల సమేత చంద్రమౌళీశ్వరులకు ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి పతార్చన నిర్వహించారు. శ్రీచక్రానికి నిర్విరామంగా నవావరణ అర్చన చేశారు. రాజశ్యామల యాగం, చండీ హోమం శాస్త్రోక్తంగా జరిపారు. పండిత రత్న డాక్టర్ ప్రభాకర కృష్ణమూర్తి అహల్యా శాప వృత్తాంతాన్ని ఈ సందర్భంగా భక్తులకు వివరించారు. విశాఖకు చెందిన పి.చిన్నా బృందం సంగీత కచేరీ నిర్వహించారు. తెలంగాణకు చెందిన రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ దంపతులు పీఠాన్ని సందర్శించి రాజశ్యామల యాగంలో పాల్గొన్నారు. ఏపీ రాష్ట్ర దేవదాయశాఖ ఆర్‌జేసీ సురేష్‌బాబు, సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కుటుంబ సభ్యులు పీఠాన్ని సందర్శించి స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకున్నారు. కాగా, శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సామూహిక కుంకుమ పూజలకు మహిళల నుంచి విశేష స్పందన లభిస్తోంది.



అమ్మవారికి నమస్కరిస్తున్న స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర

అవినీతికి పాల్పడి.. 17ఏ గురించి వాదిస్తారా?

- సాక్ష్యాలు లేకుండా కోర్టులు రిమాండుకు పంపవు
- ప్రజలను మోసం చేసేందుకే టీడీపీ ప్రయత్నం
- చంద్రబాబు మోసాలకు శిక్ష పడే రోజు వచ్చింది
- మాజీ మంత్రి పేర్ని నాని



చిలకలపూడి(మచిలీపట్నం): సాంకేతిక కారణాలు చూపి కేసును కొట్టేయాలని టీడీపీ నేతలు కోరుతున్నారు తప్ప.. తమ నాయకుడు అవినీతికి పాల్పడలేదు అని వారు చెప్పడంలేదని మాజీ మంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. సాక్ష్యాలు లేకుండా ఏ కోర్టు కూడా రిమాండ్ విధించదన్నారు. మంగళవారం కృష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టరేట్‌లో ఓ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన.. మీడియాతో మాట్లాడారు. అవినీతి విషయం చెప్పకుండా 17ఏ సెక్షన్ ప్రకారం గవర్నర్ అనుమతి తీసుకోవాలని వాదించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. స్కిల్ స్కామ్‌లో డబ్బులు కాజేశారని ఏసీబీ కోర్టు, హైకోర్టు చెబుతున్నప్పటికీ టీడీపీ నాయకులు 17ఏ గురించి మాత్రమే చెప్పటం ప్రజలను మోసం చేయటమేనన్నారు. అవినీతి నిరోధకశాఖ అవినీతిని బట్టబయలు చేయడానికే ఉంటుందన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేయడం ద్వారా ఎన్నో మోసాలు చేసిన వ్యక్తి చంద్రబాబు అని, న్యాయవ్యవస్థ గురించి టీడీపీ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సొమ్ము దోచారా, లేదా చెప్పకుండా నాటకాలు ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. తప్పు చేస్తే పోలీసులు అరెస్టు చేస్తారని, న్యాయవ్యవస్థ రిమాండ్ విధిస్తుందని.. ఈ విషయంలో ప్రభుత్వం ఎందుకు కల్పించుకుంటుందని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన మోసాలకు ప్రకృతి, దేవుడు, న్యాయం, ధర్మం శిక్షించే రోజు వచ్చిందని ఆయన చెప్పారు.

జగన్ వల్లే సామాజిక న్యాయం సాధ్యమైంది

వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి

కర్నూలు (రాజ్‌విహార్): రాష్ట్రంలో సామాజిక న్యాయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం), పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు స్పష్టం చేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే 'సామాజిక న్యాయ బస్సు యాత్ర' జయప్రదానికి సన్నాహక సమావేశం మంగళవారం కర్నూలులో నిర్వహించారు. సమావేశానికి రాయలసీమ జిల్లాల ఎస్సీ సామాజిక వర్గాల ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరు కాగా.. ఆయన మాట్లాడారు. నాడు బాబా సాహెబ్ అంబేడ్కర్ దళితుల అభ్యున్నతికి ఎంతో కృషి చేయడంతో పాటు భావితరాల కోసం కలలు కన్నారన్నారు. ఆయన ఆశయ సాధన మేరకు సీఎం జగన్ పనిచేస్తున్నారని చెప్పారు. ఎక్కడో అట్టడుగున ఉండాల్సిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఏ రాష్ట్రంలో లేని తరహాలో రాజకీయ పదవులు ఇచ్చి, సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా గుర్తింపు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన మేలును వివరించేందుకు చేపట్టే సామాజిక న్యాయ బస్సుయాత్రను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, డాక్టర్ సుధాకర్, హఫీజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నారికేళం 'ధర'హాసం

- రాష్ట్ర ప్రభుత్వం చొరవతో పెరిగిన కొబ్బరి ధర
- వెయ్యి కాయలకు రూ.రెండు వేల వరకు పెరుగుదల
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో దిగివచ్చిన వ్యాపారులు
- మరోవైపు కలిసొస్తున్న దసరా.. దీపావళి.. కార్తీక మాసం



సాక్షి అమలాపురం/అంబాజీపేట: కొబ్బరి ధర పతనమై రైతులు ఇబ్బంది పడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలించాయి. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని నాఫెడ్ కేంద్రాలను ఏర్పాటు చేయించింది. దీంతో కొబ్బరి ధరలు అమాంతంగా పెరిగాయి. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన తరువాత పచ్చి కొబ్బరి వెయ్యి కాయలకు రూ.రెండు వేల వరకు ధర పెరగ్గా.. ఎండు కొబ్బరి క్వింటాల్‌కు రూ.500 చొప్పున పెరగడం విశేషం. రాష్ట్రంలో 3 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతుండగా.. ఉభయ గోదావరి జిల్లాలలోనే అత్యధికంగా 1.78 లక్షల ఎకరాల్లో ఉంది. ఉద్యాన శాఖ అంచనా ప్రకారం సగటున 106.9 కోట్ల కాయల దిగుబడిగా వస్తోంది. ఇందులో అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1.03 లక్షల ఎకరాలు, కాకినాడ జిల్లాలో 20 వేల ఎకరాలు, తూర్పు గోదావరి జిల్లాలో 18,754 ఎకరాల్లో సాగు కొబ్బరి సాగవుతోంది.

నాఫెడ్ కేంద్రాలు.. వరుస పండుగలతో..

రాష్ట్రంలో కొబ్బరి మార్కెట్ ధరలు అంబాజీపేట మార్కెట్‌పై ఆధారపడి ఉంటాయి. కొబ్బరి ధరలు పతనం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని కోనసీమ జిల్లాలో నాఫెడ్ కేంద్రాలను ఏర్పాటు చేయించింది. ప్రస్తుతానికి అంబాజీపేట మార్కెట్ యార్డు కేంద్రంగా కార్యకలాపాలకు అధికారులు సిద్ధమయ్యారు. తొలిసారి ఆర్‌బీకేల ద్వారా కూడా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక్కడ మిల్లింగ్ కోప్రా (ఎండు కొబ్బరి)ను క్వింటాల్‌ను రూ.10,860, బాల్ కోప్రా (కురిడీ కొబ్బరి గుడ్డు) క్వింటాల్ రూ.11,750 చొప్పున ధర చెల్లించి కొనుగోలు చేయనున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో కొబ్బరి మార్కెట్‌లో ఒక్కసారిగా కదలిక వచ్చింది. ఈ పరిస్థితుల్లో స్థానిక వ్యాపారులు దిగి వచ్చి ధరలు పెంచారు. మరోవైపు దసరా, దీపావళి, కార్తీక మాసం రావడంతో ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు జోరందుకున్నాయి. దీంతో పచ్చికాయ, ముక్కుడు కాయల ధరలు పెరిగాయి. ప్రస్తుత మార్కెట్‌లో వెయ్యి కాయల ధర రూ.8 వేల నుంచి రూ.8,500 వరకు ఉంది. గడచిన 10 రోజులలో ధర రూ.2 వేల వరకు పెరగడం విశేషం.

రాజకీయంగా వాడుకోవాలని చూస్తే సహించం

- నకిలీ స్టాంపుల కుంభకోణంపై ఒంగోలు ఎస్పీ మలికాగర్గ్
- రాజకీయ ఒత్తిళ్లకు లొంగొద్దని ఎమ్మెల్యే బాలినేని స్పష్టం చేశారు



ఒంగోలు సబర్బన్ : ప్రకాశం జిల్లా ఒంగోలులో సంచలనం సృష్టించిన నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపుల కుంభకోణం కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ మలికాగర్గ్ చెప్పారు. ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడారు. నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపుల కుంభకోణం కేసును ఎవరైనా రాజకీయంగా వాడుకోవాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కేసులో ఏ పార్టీ వాళ్లు ఉన్నా వదిలిపెట్టేది లేదన్నారు. 20 రోజుల క్రితం వేరే కేసులో ఒంగోలు తాలూకా పోలీసులు తనిఖీ చేస్తుంటే అక్కడ నకిలీ స్టాంపులు, డాక్యుమెంట్లు బయటపడ్డాయని, అప్పటి నుంచి వేగంగా కేసు దర్యాప్తు జరుగుతోందన్నారు. ఈ కేసు దర్యాప్తును వేగంగా చేపట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్వయంగా తనతో చెప్పారని తెలిపారు. తనతో పాటు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌తో కూడా ఈ కేసు విషయంపై బాలినేని స్పష్టంగా మాట్లాడినట్టు చెప్పారు. ఈ కేసులో ఏ పార్టీ వారున్నా, చివరకు తన అనుచరులున్నా సరే ఎలాంటి రాజకీయ ఒత్తిడులకు తలొగ్గవద్దని కూడా బాలినేని స్పష్టం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కొన్ని పార్టీలు రాజకీయ ప్రాబల్యం కోసం అనవసర ఆరోపణలు చేస్తున్నాయని, వెంటనే మానుకోవాలని సూచించారు. ఈ కేసుకు సంబంధించి ఎలాంటి ఆధారాలున్నా పోలీస్ అధికారులకు తెచ్చివ్వాలని సూచించారు. అంతే కానీ రాజకీయ స్వార్థం కోసం పోలీస్ దర్యాప్తును పక్కదారి పట్టిస్తే మాత్రం సహించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. 'కేసులో వేలకొలది డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నాం. వాటిలో 130 డాక్యుమెంట్లను నిశితంగా పరిశీలిస్తున్నాం. వాటిలో నకిలీవి ఎన్ని, అసలు డాక్యుమెంట్లు ఎన్ని ఉన్నాయో అటు రెవెన్యూ, ఇటు రిజిస్ట్రేషన్ల శాఖల సమన్వయంతో దర్యాప్తు జరుగుతోంది. ఇప్పటికే ఎనిమిది మందిని అరెస్ట్ చేశాం, మరో 12 మందిని అరెస్ట్ చేయాల్సి ఉంది. ఇంకా ఎవరెవరి పాత్ర ఇందులో ఉందో కూడా లోతుగా దర్యాప్తు చేస్తున్నాం' అని అన్నారు. తొలుత దర్శి డీఎస్పీతో సిట్ ఏర్పాటు చేశామని, కేసు తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఒంగోలు ఏఎస్పీ కే. నాగేశ్వరరావుకు కేసును అప్పగిస్తూ అప్‌గ్రేడ్ చేసినట్టు తెలిపారు.

కాణిపాకం ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

ఆలయ చైర్మన్‌గా మోహన్‌రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

కాణిపాకం(యాదమరి): కాణిపాకం ఆలయ పాలక మండలి పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ దేవదాయ శాఖ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఆలయ ధ్వజస్తంభం వద్ద నూతన పాలక మండలి సభ్యులు అగరంపల్లె మోహన్‌రెడ్డి, నరసింహులుశెట్టి, గోపి, గోవర్ధన్, సుశీల, కాంతమ్మ, ప్రతిమ, సుబ్బలక్ష్మమ్మ, వెంకట రమణమ్మ, రామసుబ్బమ్మ, అనిత, జయశ్రీ, రవీంద్రులు, కొండయ్య, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ స్వామి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పాలక మండలి చైర్మన్‌గా అగరంపల్లె మోహన్‌రెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పాలక మండలి చైర్మన్‌కు, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకటేశు, ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు బుజ్జిరెడ్డి, హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలక మండలి సభ్యులు

నా భర్త స్వేచ్ఛగా తిరిగేలా ఆదేశాలివ్వండి

హైకోర్టులో కొల్లు రవీంద్ర భార్య నీలిమ పిటిషన్

సాక్షి, అమరావతి: తన భర్త కొల్లు రవీంద్రను పోలీసులు అక్రమంగా గృహ నిర్బంధంలో ఉంచారని, ఆయనను తక్షణమే విడిచిపెట్టి, ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛగా తిరిగేందుకు అనుమతినివ్వాలని కోరుతూ కొల్లు నీలిమ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, మచిలీపట్నం ఎస్పీ, డీఎస్పీ తదితరులను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు బుధవారం విచారణ జరిపే అవకాశం ఉంది. ఎలాంటి సహేతుక కారణం లేకుండా, ఎలాంటి కేసు నమోదు చేయకుండా, నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా పోలీసులు తన భర్తను గృహ నిర్బంధంలో ఉంచారని నీలిమ తన పిటిషన్‌లో తెలిపారు.

బాబు, రామోజీపై సీబీఐ విచారణ జరపాలి

1,115వ రోజు రిలే దీక్షలో బహుజన నేతల డిమాండ్



తాడికొండ: అధికారం ముసుగులో రూ.లక్షల కోట్లు కొల్లగొట్టిన బాబు, చిట్‌ఫండ్ పేరుతో ప్రజల ఆస్తులను మింగేసిన రామోజీపై సీబీఐ విచారణ జరగాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,115వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. అవినీతి ధనంతో విలాసవంతమైన భవనాలు, వ్యాపార సామ్రాజ్యాలను విస్తరించిన బాబు, రామోజీలు ప్రజాధనం లూటీ చేసి వ్యవస్థలను సైతం తమ దారిలోకి తెచ్చుకునేందుకు యత్నిస్తున్నారన్నారు. అమరావతి రాజధాని పేరుతో గారడీ చేసిన బాబు అవినీతి దాహానికి సింగపూర్ మంత్రి ఈశ్వరన్ సైతం మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయ్యారంటే.. బాబు చేసిన అవినీతికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. కలాన్ని కులానికి అమ్మేసిన రాధాకృష్ణ, రామోజీలకు ఈ అవినీతి ఇసుమంతైనా కనిపించకపోవడం దారుణం కాదా అని ప్రశ్నించారు. బహుజన రాజ్యాధికారం దిశగా ఏపీలో అడుగులు పడుతున్నాయనేందుకు ఇక్కడ సామాజిక న్యాయం దిశగా పరిపాలన కొనసాగుతుండడమే నిదర్శనమన్నారు. వికేంద్రీకరణ ద్వారానే అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి సాధ్యమని నమ్మిన జగనన్న త్వరలో విశాఖ వేదికగా పాలన కొనసాగించేందుకు సిద్ధం చేయడం హర్షణీయమని, బహుజనుల మద్దతు తప్పక ఉంటుందని స్పష్టం చేశారు. నాయకులు పులి దాసు, ఈపూరి ఆదాం, పల్లె బాబు, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

సిఫారసులకు చెల్లుచీటీ!

- టికెట్ ఉంటేనే దుర్గమ్మ దర్శనం
- గంటన్నరలోపే పూర్తి
- అధికారుల చర్యలకు సత్ఫలితాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గమ్మ దర్శనంలో అధికారులు భారీ మార్పులు చేశారు. సిఫారసులు ఉన్నవారికే దుర్గమ్మ దర్శనం అనే భావన తొలగించి, ఎటువంటి సిఫారసులతో పనిలేకుండా కేవలం గంటన్నర వ్యవధి లోపే దర్శనం పూర్తయ్యేలా ఏర్పాట్లు చేశారు. దసరా ఉత్సవాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని దేవదాయశాఖ మంత్రితోపాటు అధికారులు, చైర్మన్ చెబుతూనే ఉన్నారు. ఏటా ఇలానే చెబుతారు కదా అని సాధారణ భక్తులు భావించినా, ఈసారి దాన్ని చేతల్లో అమలు చేసి చూపించారు. టికెట్ ఉంటేనే దర్శనం అనే రీతిలో ఏర్పాట్లు జరిగాయి. వినాయకుడి గుడి నుంచి అమ్మవారి దర్శనం పూర్తయి కొండ దిగేవరకూ కేవలం గంటన్నర వ్యవధిలోపే దర్శన సమయం పడుతుండటంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలోని ఏర్పాట్లను మంగళవారం విజయవాడ సీపీ టీకే రాణా తనిఖీ చేశారు. క్యూలైన్‌లో ఉన్న భక్తులతో మాట్లాడారు. దర్శనానికి ఎంత సమయం పడుతుందనే వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

ప్రొటోకాల్ వాహనాలపైనే కొండకు...

పాలకమండలి, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు ఎవరైనా దేవస్థానానికి చెందిన ప్రొటోకాల్ వాహనాలపైనే కొండపైకి చేరుకోవాలి. టికెట్ ఉంటేనే వాహనాల్లోకి ప్రవేశం అని ప్రకటించారు. వారితో వచ్చిన ఎవరైనా టికెట్ తీసుకోవాల్సిందే అని పేర్కొన్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లోనైనా, వీఐపీలైనా టికెట్ కొనుగోలు చేస్తున్నారు. ఇక టికెట్ కొనుగోలు చేసిన సామాన్య భక్తులు ఎవరైనా నేరుగా ఆలయానికి చేరుకునే వీలులేకుండా పక్కా ప్రణాళికతో కట్టడి చేశారు. ఘాట్ రోడ్డులోని ఓం టర్నింగ్ నుంచి అమ్మవారి ఆలయం చేరుకునే లోపు ఐదు చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. వాటికి ఎంఆర్‌వోలు, ఇతర రెవెన్యూ ముఖ్య అధికారులకు బాధ్యతలు అప్పజెప్పారు. గతంలో సీఎం గేట్, ఆలయ సిబ్బంది రాకపోకలు సాగించే మార్గాల్లో ఉన్న గేట్లకు సైతం తాళాలు వేశారు. ఎవరైనా సరే క్యూలైన్‌లోనే దర్శనానికి వెళ్లాలని అటు పోలీసులు, ఇటు రెవెన్యూ శాఖల అధికారులు చెబుతున్నారు. అలానే సిఫారసులు ఉన్నా, నేరుగా దర్శనానికి కాకుండా, క్యూలైన్‌లోనే అనుమతిస్తుండటంతో ఆలయ ప్రాంగణం ప్రశాంతంగా కనబడుతోంది. మరోవైపు డీసీపీ విశాల్‌గున్నీ ఆలయ ప్రాంగణంలోనే ఉంటూ భక్తులు ఎవ్వరూ అనధికార మార్గాల్లో అమ్మవారి దర్శనానికి వెళ్లకుండా కట్టడి చేస్తున్నారు. పోలీసు అధికారులు సిఫారసు చేసిన వారిని సైతం పోలీసులు నేరుగా దర్శనానికి కాకుండా రూ.500 టికెట్ క్యూలైన్‌లోనే పంపుతున్నారు.

క్లుప్తంగా...

2040 నాటికి జాబిల్లి పైకి భారతీయుడు

ఇస్రోకు లక్ష్యాలు నిర్దేశించిన ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)కు కీలక లక్ష్యాలను నిర్దేశించారు. 2040 నాటికి తొలి భారతీయుడిని చంద్రుడిపైకి పంపించాలని, 2035 నాటికి అంతరిక్షంలో ఇండియన్ స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతిష్టాత్మక గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా మొట్టమొదటి ఫ్లైట్ టెస్ట్ వెహికల్ అబార్ట్ మిషన్–1 (టీవీ–డీ1)ను ఈ నెల 21న పరీక్షించనున్నారు. ఉదయం 7 నుంచి 9 గంటలలోపు ఈ పరీక్ష జరుగుతుంది. టీవీ–డీ1 ప్రయోగ ఏర్పాట్లపై ప్రధాని మోదీ మంగళవారం ఇస్రో అధికారులతో సమీక్ష నిర్వహించారు. గగన్‌యాన్ గురించి ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ప్రధాని మోదీకి తెలియజేశారు. కొత్త లక్ష్యాలు ఏర్పర్చుకోవాలని, వాటిని సాధించేందుకు కృషి చేయాలని ఇండియన్ సైంటిస్టులకు మోదీ పిలుపునిచ్చారు. శుక్రగ్రహంపై ఆర్బిటార్ మిషన్, మార్స్ ల్యాండర్ వంటి ప్రయోగాలు చేయాలని చెప్పారు.

ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు గౌరవ డాక్టరేట్

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ ఎస్.సోమనాథ్‌కు బెంగళూరు యూనివర్సిటీ మంగళవారం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన సోమనాథ్ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తనకు ఇచ్చిన గౌరవ డాక్టరేట్‌ను ఇటీవల ప్రయోగించిన చంద్రయాన్–3, ఆదిత్య–ఎల్1 మిషన్లలో పని చేసిన బృంద సభ్యులకు అంకితం ఇస్తున్నట్లు చెప్పారు. అంతరిక్ష ప్రయోగాల వల్ల లభించే సాంకేతిక పరిజ్ఞానం సామాన్య ప్రజలకు మేలు చేకూర్చాలన్నదే తమ లక్ష్యమని, ఆ దిశగా కృషి చేస్తున్నామని వెల్లడించారు.

ఎంపీ మొయిత్రాపై ఆరోపణలు.. ఎథిక్స్ కమిటీకి

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రాపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే లంచం ఆరోపణల వ్యవహారాన్ని నైతిక విలువల కమిటీకి పంపినట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మంగళవారం వెల్లడించారు. లోక్‌సభ నైతిక విలువల కమిటీకి చైర్మన్‌గా బీజేపీ సభ్యుడు వినోద్ కుమార్ సోంకార్ ఉన్నారు. 'అదానీ గ్రూప్ లక్ష్యంగా ఇప్పటి వరకు ఆమె లోక్‌సభలో 50 నుంచి 61 వరకు ప్రశ్నలడిగారు. 12 డిసెంబర్ 2005 నాటి 'క్యాష్ ఫర్ క్వైరీ' వ్యవహారాన్ని గుర్తుచేసే విధంగా పార్లమెంట్‌లో ప్రశ్నలు అడగడం ద్వారా వ్యాపారవేత్త శ్రీ దర్శన్ హీరానందానీ వ్యాపార ప్రయోజనాలను కాపాడేందుకు మహువా మొయిత్రా పన్నిన నేరపూరిత కుట్ర ఇది అనేందుకు ఎలాంటి సందేహం లేదు'అని ఆదివారం ఎంపీ దుబే స్పీకర్‌కు లేఖ రాశారు. ఇది తీవ్రమైన నిబంధనల ఉల్లంఘన, సభా ధిక్కారం, నేరంగా పేర్కొన్నారు. మొయిత్రా, వ్యాపారవేత్త నుంచి లంచం తీసుకుంటున్నట్లు ఉన్న తిరుగులేని సాక్ష్యాలను ఒక న్యాయవాది తనతో పంచుకున్నారని దూబే చెప్పారు.

మోదీ 'ఆర్మీ'ని కూడా వాడుకుంటున్నారు

కాంగ్రెస్ చీఫ్ ఖర్గే విమర్శ

న్యూఢిల్లీ: ఎన్నికల్లో లబ్ధి కోసం మోదీ ప్రభుత్వం సైన్యాన్ని కూడా వాడుకుంటోందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. సైనికుల పట్ల ఉండే జనాదరణను పెట్టుబడిగా పెడుతూ వారి గౌరవాన్ని దెబ్బతీస్తోందని అధికార బీజేపీపై ఆయన మండిపడ్డారు. 'దేశవ్యాప్తంగా 822 సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలంటూ ఆర్మీని మోదీ ప్రభుత్వం కోరింది. ఈ పాయింట్ల వద్ద ప్రధాని మోదీ చిత్రాన్ని ఉంచుతున్నారు. తమ సాహసాలను చాటడానికి బదులుగా సైనిక జవాన్లతో మోదీ ప్రభుత్వం తమ పథకాలను ప్రచారం చేయిస్తోంది. ప్రధాని మోదీ దేశాన్ని కాపాడాల్సిన సైన్యాన్ని తనను తాను ప్రమోట్ చేసుకోవడానికి వాడుకుంటున్నారు'అని విమర్శించారు. గత 75 ఏళ్లలో ఇలాంటివి ఎవరూ చేయలేదని ఖర్గే మంగళవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'భారత జవాన్ల త్యాగాలు, సాహసాలను చూసి కాంగ్రెస్ పార్టీ గర్విస్తోంది. జాతీయతా భావం గురించి పాఠాలు చెప్పే బీజేపీ మాత్రం, సైనికుల గౌరవాన్ని దెబ్బతీస్తోంది'అని ఖర్గే ఆరోపించారు.

తమిళనాడులో బాణాసంచా పరిశ్రమల్లో పేలుళ్లు

14 మంది కార్మికులు మృతి

సాక్షి, చెన్నై: తమిళనాడులో మరోసారి బాణాసంచా పేలుళ్లు చోటు చేసుకున్నాయి. ఈ దుర్ఘటనలో 14 మంది మరణించారు. బాణాసంచా తయారీకి పేరుగాంచిన విరుదునగర్ జిల్లా శివకాశీలోని రెండు పరిశ్రమల్లో మంగళవారం పేలుళ్లు జరిగాయి. తొలుత కిచ్చనాయకన్ పట్టి గ్రామంలో జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు మృతిచెందాడు. మంగళం గ్రామంలోని ఓ బాణసంచా పరిశ్రమ గోడౌన్‌లో పేలుడు ధాటికి 13 మంది ప్రాణాలు కోల్పోయారు. వారి మృతదేహాలు గుర్తు పట్టలేనంతంగా కాలిపోయాయి. ఈ ప్రమాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడ్డవారికి రూ.లక్ష చొప్పున అందజేస్తామన్నారు. తమిళనాడులో అక్టోబరు నెలలోనే ఆరు చోట్ల బాణాసంచా పరిశ్రమల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. హోసూరు అత్తిపల్లి ప్రమాదంలో 14 మంది, అరియలూరులో ప్రమాదంలో 12 మంది మృతి చెందారు.

గాజా ఆస్పత్రిపై భీకర దాడి

500 మంది మృత్యువాత! ● వందల్లో క్షతగాత్రులు

- గాజా సిటీ ఆస్పత్రిపై ఇజ్రాయెల్ వైమానిక దాడి చేసిందన్న గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ
- దక్షిణ గాజాపైనా దాడులు
- ముందస్తు హెచ్చరికలు లేకుండానే దాడులు చేయడం పట్ల ఆగ్రహావేశాలు
- 11వ రోజుకు చేరిన ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణ
- ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దులో ఉద్రిక్తతలు



ఇజ్రాయెల్ దాడితో మంటల్లో చిక్కుకున్న గాజా సిటీలోని అల్ అహ్లీ ఆస్పత్రి


రఫా బోర్డర్ వద్ద ఈజిప్టులోకి ప్రవేశించేందుకు ఎదురుచూస్తున్న ఓ బాలిక

ఖాన్ యూనిస్/వాషింగ్టన్: హమాస్, ఇజ్రాయెల్ యుద్ధం మంగళవారం భీకరరూపం సంతరించుకుంది. సెంట్రల్ గాజాలోని అల్ అహ్లీ సిటీ ఆస్పత్రిపై ఇజ్రాయెల్ జరిపిన భారీ వైమానిక దాడిలో ఏకంగా 500 మంది ప్రాణాలు కోల్పోయారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అయితే దాడిని ఇజ్రాయెల్ ధృవీకరించలేదు. ఆస్పత్రిపై దాడి చేసింది తమ బలగాలేనా కాదా అనే దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఇజ్రాయెల్ తెలిపింది. దాడిలో ఆస్పత్రి పరిసరాలు భీతావహంగా మారాయి. ఆస్పత్రిలోని హాళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. రోగుల శరీరభాగాలు ఛిద్రమై చెల్లాచెదురుగా పడిన దృశ్యాలు మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. దాడి ఘటనపై పాలస్తీనా అధ్యక్షుడు మొహమ్మద్ అబ్బాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మూడు రోజుల సంతాప దినాలు ప్రకటించారు. దాడికి ముందు ఆ ఆస్పత్రిలో మూడువేల మంది శరణార్థులు ఆశ్రయంపొందుతున్నట్లు తెలుస్తోంది.

ఉత్తర గాజాను ఖాళీ చేయాలని, తక్షణమే దక్షిణ గాజాకు వెళ్లిపోవాలని పాలస్తీనియన్లను ఆదేశించిన ఇజ్రాయెల్ సైన్యం మంగళవారం అదే దక్షిణ గాజాపై భీకర స్థాయిలో వైమానిక దాడులు నిర్వహించింది. భారీగా రాకెట్లు ప్రయోగించింది. ఈ దాడుల్లో పదులు సంఖ్యలో జనం మరణించారు. దక్షిణ గాజాలోని రఫా, ఖాన్ యూనిస్ నగరాల్లో ఈ దాడులు జరిగాయి. పలు భవనాలు ధ్వంసమయ్యాయి. రఫాలో 27 మంది, ఖాన్ యూనిస్‌లో 30 మంది మృతి చెందారని గాజా ఆరోగ్య శాఖ మాజీ మంత్రి బసీమ్ నయీం చెప్పారు. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండానే ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు ఉత్తర గాజాపై భూతల దాడులకు సన్నాహాలు చేస్తూ, మరోవైపు దక్షిణ గాజాపై హఠాత్తుగా వైమానిక దాడులు చేయడం గమనార్హం. హమాస్ స్థావరాలను, మిలిటెంట్ల మౌలిక సదుపాయాలను, కమాండ్ సెంటర్లను ధ్వంసం చేయడానికే దక్షిణ గాజాపై రాకెట్లు దాడులు నిర్వహించినట్లు ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ రిచర్డ్ హెచ్ట్ చెప్పారు. హమాస్ కదలికలు ఎక్కడ కనిపించినా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఇంకా శిథిలాల కిందే మృతదేహాలు

ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం మంగళవారం 11వ రోజుకు చేరుకుంది. ఇరుపక్షాల నడుమ పరస్పర దాడుల్లో ఇప్పటిదాకా ఇజ్రాయెల్‌లో సైనికులు, మహిళలు, చిన్నారులతో సహా 1,400 మందికిపైగా జనం మరణించారు. మిలిటెంట్ల చేతికి దాదాపు 200 మంది ఇజ్రాయెల్ పౌరులు బందీలుగా చిక్కారు. గాజాలో 2,778 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 9,700 మందికి క్షతగాత్రులుగా మారారు. మృతుల్లో మూడింట రెండొంతుల మంది చిన్నపిల్లలేనని గాజా ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధి అబ్బాస్ తెలిపారు. గాజాలో మరో 1,200 మంది భవనాల శిథిలాల కింద చిక్కుకొని, మృతి చెందినట్లు భావిస్తున్నామని స్థానిక అధికారులు వెల్లడించారు. ఈ మరణాలు అధికారిక గణాంకాల్లో చేరలేదు. విద్యుత్, పెట్రోల్, డీజిల్ లేకపోవడంతో శిథిలాలను తొలగించడం సాధ్యం కావడం లేదు. ఇజ్రాయెల్ దళాలు భీకర స్థాయిలో దాడులు చేస్తున్నా హమాస్ మిలిటెంట్లు వెనక్కి తగ్గడం లేదు. గాజా నుంచి ఇజ్రాయెల్ భూభాగంపైకి రాకెట్లు ప్రయోగిస్తూనే ఉన్నారు. ఉత్తర గాజాపై భూతల దాడుల విషయంలో ఇజ్రాయెల్ ప్రభుత్వం ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదని లెఫ్టినెంట్ కల్నల్ రిచర్డ్ హెచ్ట్ వెల్లడించారు. ఉన్నత స్థాయిలో సమాలోచనలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే తమ పదాతి దళాలు అడుగు ముందుకేస్తాయని, తమ సైన్యం గాజా సరిహద్దుల్లో సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.


రఫాలో శిథిలాల్లో తమ వారి కోసం వెతుకుతూ రోదిస్తున్న స్థానికుడు

ఉత్తర గాజా సగం ఖాళీ!

ఉత్తర గాజా నుంచి జనం తరలింపు కొనసాగుతోంది. దక్షిణ గాజాకు పయనమవుతున్నారు. ఉత్తర గాజా సగానికి పైగా ఖాళీ అయినట్లు సమాచారం. ఆసుపత్రుల్లోని వేలాది మంది రోగులు, క్షతగాత్రులు ఇంకా అక్కడే ఉన్నారు. ఆహారం, నీరు, ఔషధాలు పూర్తిగా నిండుకున్నాయని, బాధితుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని స్వచ్ఛంద సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పాలస్తీనియన్ల కోసం ఇతర దేశాలు పంపించిన ఆహారం, నిత్యావసరాలు వారికి అందడం లేదు. రఫా సరిహద్దును ఈజిప్టు మూసివేసింది. నిత్యావసరాలతో కూడిన వాహనాలు గాజాలో ప్రవేశించడానికి ప్రస్తుతం ఈ సరిహద్దు వద్ద వేచి ఉన్నాయి. ఈజిప్టు అనుమతిస్తేనే గాజా ప్రజలకు ఆహారం అందుతుంది. రఫా సరిహద్దును తెరిపించేందుకు కొందరు మధ్యవర్తులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఇజ్రాయెల్ మంగళవారం మూడు గంటలపాటు గాజాకు నీరు సరఫరా చేసింది. ఈ నీరు గాజాలో కేవలం 14 శాతం మందికి సరిపోతుంది.

గాజాపై దాడులు ఆపండి: ఖమేనీ

గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ఖండించారు. దాడులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్ తీరు మార్చుకోకపోతే హింసాత్మక ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించారు. ఇజ్రాయెల్ వైఖరి పట్ల ఇస్లామిక్ దేశాలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయని స్పష్టం చేశారు.

రెచ్చిపోయిన లెబనాన్ హెజ్బొల్లా మిలిటెంట్లు

లెబనాన్–ఇజ్రాయెల్ సరిహద్దులో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఉదయం హెజ్బొల్లా మిలిటెంట్లు లెబనాన్ భూభాగం నుంచి ఉత్తర ఇజ్రాయెల్‌పైకి యాంటీ–ట్యాంక్ క్షిపణిని ప్రయోగించారు. దీంతో ఇజ్రాయెల్‌లో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటనతో ఇజ్రాయెల్ సైన్యం అప్రమత్తమైంది. సరిహద్దు నుంచి పౌరులను ఖాళీ చేయించాలని ఆదేశించింది. తమ భూభాగంపై జరిగిన దాడికి ప్రతిస్పందనగా దక్షిణ లెబనాన్‌పై వైట్ ఫాస్ఫరస్ బాంబులను ప్రయోగించింది. యుద్ధ ట్యాంకులతో బాంబుల వర్షం కురిపించింది. ఇంతలో లెబనాన్ వైపు నుంచి ఇజ్రాయెల్‌పై మరో రెండు యాంటీ–ట్యాంక్ క్షిపణి దాడులు జరిగాయి. ఈ దాడిలో ఎవరూ గాయపడలేదు. లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్లే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం రాకెట్ దాడులు నిర్వహించింది. నలుగురు మిలిటెంట్లు హతమయ్యారని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. గతవారం లెబనాన్‌లోని ఇస్లామిక్ జిహాద్ సభ్యులు ఇజ్రాయెల్‌పై దాడులు చేసిన సంగతి తెలిసిందే. హమాస్‌కు మద్దతుగా హెజ్బొల్లా మిలిటెంట్లు, ఇస్లామిక్ జిహాద్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌తో ఘర్షణకు దిగుతున్నారు. ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లో ఘర్షణలు మరింత ఉధృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. హెజ్బొల్లాకు ఇరాన్ అండగా నిలుస్తోంది. ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం ఇతర దేశాలకు విస్తరించకుండా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నామని తుర్కియే విదేశాంగ మంత్రి హక్కన్ ఫిదాన్ చెప్పారు.

నేడు ఇజ్రాయెల్‌లో జో బైడెన్ పర్యటన

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ బుధవారం ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. హమాస్ దాడులను ఖండించిన ఆయన ఇప్పటికే ఇజ్రాయెల్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. యూదులకు సంఘీభావం తెలియజేస్తూ ఇజ్రాయెల్‌లో పర్యటించబోతున్నానని బైడెన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. జోర్డాన్‌లోనూ పర్యటిస్తానని, ఇస్లామిక్ దేశాల అధినేతలతో భేటీ అవుతానని, గాజాలో తాజా పరిణామాలు, పాలస్తీనియన్లకు అందించాల్సిన మానవతా సాయంపై చర్చిస్తానని వెల్లడించారు. పాలస్తీనియన్లకు హమాస్ ప్రాతినిధ్యం వహించడం లేదన్నారు. గాజా ప్రజలకు మానవతా సాయం అందించడానికి వీలుగా ఒక ప్రణాళిక రూపొందించాలని అమెరికా, ఇజ్రాయెల్ నిర్ణయించాయని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ మంగళవారం చెప్పారు.

హమాస్ టాప్ కమాండర్ హతం

సెంట్రల్ గాజాలోని బురీజ్ శరణార్థుల శిబిరంపై జరిగిన ఇజ్రాయెల్ దాడుల్లో హమాస్ అగ్రశ్రేణి కమాండర్ అయమాన్ నౌఫాల్ హతమయ్యాడు. ఈ విషయాన్ని హమాస్ మిలటరీ విభాగం స్వయంగా వెల్లడించింది. నౌఫాల్ సెంట్రల్ గాజా స్ట్రిప్‌లో హమాస్ మిలిటెంట్ వ్యవహారాల ఇన్‌చార్జిగా పని చేస్తున్నాడు. ఇతర ఇస్లామిక్ దేశాల్లోని మిలిటెంట్ గ్రూప్‌లతో అతడికి సన్నిహిత సంబంధాలున్నాయి.

చట్టబద్ధత కల్పించలేం

స్వలింగ వివాహాలపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ

- అది పార్లమెంటు పరిధిలోని అంశం
- స్వలింగ సంపర్కులు సహజీవనంలో ఉండొచ్చు
- వారి హక్కులను ప్రభుత్వాలు కాపాడాలి
- దత్తత హక్కుండదంటూ 3:2తో తీర్పు
- దానితో విభేదించిన సీజేఐ, జస్టిస్ కౌల్

న్యూఢిల్లీ: స్వలింగ వివాహాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక వివాహాల చట్టం ప్రకారం అలాంటి వివాహాలకు చట్టబద్ధత కల్పించేందుకు నిరాకరించింది. ''అది న్యాయస్థానానికి సంబంధించింది కాదు. పార్లమెంటు పరిధిలోని అంశం. కోర్టులు చట్టాలు చేయవు. వాటిని మంచి చెడులను బేరీజు వేస్తాయంతే'' అని పేర్కొంది. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఏకగ్రీవ తీర్పు వెలువరించింది. అయితే స్వలింగ సంపర్కులకు పెళ్లాడే స్వేచ్ఛ, హక్కు ఉంటాయని స్పష్టం చేసింది. అంతేగాక ఇతరుల మాదిరిగానే వారికి అన్ని రకాల హక్కులూ సమానంగా ఉంటాయని, వారిపై వివక్ష చూపొద్దని పేర్కొంది. వారి హక్కులను కాపాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ విషయమై సాధారణ ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ప్రభుత్వాలకు సూచించింది. తద్వారా స్వలింగ సంపర్కులు వివక్ష ఎదుర్కోకుండా చూడాలని పేర్కొంది. అలాగే స్వలింగ బంధాలు పట్టణ, సంపన్న వర్గాలకు పరిమితమైన ధోరణి అన్న కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. ''స్వలింగ సంపర్కం అనాది కాలం నుంచీ ఉన్న సహజ ధోరణే. అది కేవలం పట్టణాలకో, సంపన్న వర్గాలకో సంబంధించింది కాదు. ఈ విషయంలో కుల, సామాజిక వర్గ భేదాలూ ఉండవు. కనుక ఆ అపోహను వదిలించుకోవాలి'' అని సూచించింది. కాకపోతే స్వలింగ జంటలకు పిల్లలను దత్తత తీసుకునే హక్కుండబోదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు 3:2తో మెజారిటీ తీర్పు వెలువరించింది. దత్తతతో పాటు పలు న్యాయపరమైన అంశాల విషయంలో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్‌తో న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.రవీంద్ర భట్, జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ పి.ఎస్.నరసింహ విభేదించారు.



నాలుగు తీర్పులు

స్వలింగ సంపర్కం నేరం కాదంటూ 2018లో సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కూడా కల్పించాలంటూ ఎల్‌జీబీటీక్యూఐఏ++ వర్గాల తరఫున 21 పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై సుదీర్ఘ విచారణ అనంతరం గత మే 11న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. తాజాగా దీనిపై మొత్తం 4 తీర్పులు వెలువరించింది. మొత్తం అంశంపై సీజేఐ 247 పేజీల తీర్పు వెలువరించారు. స్వలింగ జంటల దత్తత తదితర అంశాలపై సీజేఐ అభిప్రాయాలతో ఏకీభవిస్తూ జస్టిస్ కౌల్ విడిగా 17 పేజీల తీర్పు వెలువరించారు. కాగా వాటితో విభేదిస్తూ తనతో పాటు జస్టిస్ కోహ్లీ తరఫున జస్టిస్ భట్ 89 పేజీల తీర్పు వెలువరించారు. దానితో పూర్తిగా ఏకీభవిస్తూ జస్టిస్ నరసింహ 13 పేజీల తీర్పు రాశారు. స్వలింగ ప్రవృత్తి సహజమైనదే తప్ప మానసిక రుగ్మత కాదని సీజేఐ స్పష్టం చేశారు. లైంగిక గుర్తింపు, ప్రవృత్తుల గురించి విచారణ జరిపే నెపంతో స్వలింగ జంటలను పోలీసులు వేధించవద్దని ఆదేశించారు. ఈ నిమిత్తం వారిని పోలీస్ స్టేషన్లకు పిలిపించడం గానీ, వారి నివాసాలకు వెళ్లడం గానీ చేయొద్దని చెప్పారు.

ఎల్‌జీబీటీక్యూఐఏ++ అంటే

లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్, క్వీర్, క్వశ్చనింగ్, ఇంటర్‌సెక్స్, పాన్‌సెక్సువల్, టూ స్పిరిట్, అసెక్సువల్ తదితరులు

దత్తతపై...

అవివాహితులకు, స్వలింగ జంటలకు దత్తత హక్కుండదంటూ ధర్మాసనం 3:2 మెజారిటీతో తీర్పు వెలువరించింది. వారికి ఆ హక్కును నిషేధిస్తున్న దత్తత చట్ట నిబంధనలను సమర్థిస్తున్నట్టు పేర్కొంది. అయితే దీనిపై కూడా పార్లమెంటు సమగ్రంగా చర్చించి సరైన నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడింది.

సమస్యల పరిష్కారానికి కమిటీ

స్వలింగ సంపర్కులకు చట్టబద్ధ వివాహ హక్కు లేదని, రాజ్యాంగం ప్రకారం దాన్ని మౌలిక హక్కుగా పొందజాలరని పేర్కొంటూ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పు వెలువరించింది. అదే సమయంలో, స్వలింగ జంటల సమస్యలు, ఆందోళనల పరిష్కారానికి తీసుకోవాల్సిన పాలనాపరమైన చర్యలను పరిశీలించేందుకు కేబినెట్ కార్యదర్శి సారథ్యంలో ఉన్నత స్థాయి కమిటీ వేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఎల్‌జీబీటీ కమ్యూనిటీతో పాటు సామాజిక తదితర రంగాల నిపుణులకు అందులో చోటుండాలని సూచించింది. వీటికి సంబంధించి ఎలాంటి నిర్ణయానికైనా వచ్చే ముందు రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు అన్ని వర్గాల వారి వాదనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలియజేసింది. రేషన్‌కార్డు తదితరాల నిమిత్తం స్వలింగ జంటను ఒకే కుటుంబంగా పరిగణించడం, ఉమ్మడి బ్యాంకు ఖాతా తెరవడం, డెత్ బెనిఫిట్స్ తదితరాల నిమిత్తం తమలో ఒకరిని నామినీగా పేర్కొనడం వంటి సౌకర్యాలను కల్పించవచ్చేమో పరిశీలించాలని సూచించింది. దాంతో ఆ మేరకు చర్యలు తీసుకుంటామని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హామీ ఇచ్చారు. అన్ని అంశాలనూ సమగ్రంగా పరిశీలించిన మీదట కమిటీ ఇచ్చే తుది నివేదికను కేంద్ర, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల్లో పాలనపరంగా అన్ని స్థాయిల్లోనూ అమలు చేయాలని సీజేఐ స్పష్టం చేశారు. 'స్వలింగ జంటల బంధాన్ని చట్టపరంగా గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది. లేదంటే వారికి అన్యాయం చేసినట్టే అవుతుంది' అని సీజేఐ అభిప్రాయపడ్డారు.



కేవలం లైంగిక ప్రవృత్తి ఆధారంగా పెళ్లి చేసుకునే విషయంలో ఫలానా వారికి ఫలానా హక్కు వర్తించబోదని చెప్పబోవడం పొరపాటే అవుతుంది. స్వలింగ జంటలు పరస్పరం ప్రేమను వ్యక్తం చేసుకోవడాన్ని ఎవరూ నిషేధించలేరు. కానీ దానికి చట్టపరమైన గుర్తింపును మాత్రం ఇప్పటికైతే వారు కోరజాలరు. అలాగే దత్తత హక్కును కూడా! ఈ విషయంలో జస్టిస్ భట్ తీర్పుతో పూర్తిగా ఏకీభవిస్తున్నా

- జస్టిస్ నరసింహ

ఎవరేమన్నారు..



అవివాహితులు, స్వలింగ జంటలు దత్తత తీసుకోవడాన్ని నిషేధిస్తున్న సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్‌అథారిటీ (సీఏఆర్ఏ) నిబంధన 5(3) రాజ్యాంగవిరుద్ధం, చట్టవిరుద్ధం. స్త్రీ పురుష జంటలు మాత్రమే మంచి తల్లిదండ్రులు కాగలరన్న భావన సరికాదు. అది స్వలింగ జంటల పట్ల వివక్షే అవుతుంది. అసలు వివాహమనే బంధానికి సమానంగా వర్తించే సార్వత్రిక భావనంటూ ఏదీ లేనే లేదు

- సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్



స్వలింగ సంపర్కుల పట్ల జరుగుతున్న చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దేందుకు బహుశా ఇది సరైన సందర్భం. ఈ దిశగా రాజ్యాంగ వ్యవస్థలన్నీ సకారాత్మక చర్యలు చేపట్టాలి. ఈ విషయంలో జస్టిస్ చంద్రచూడ్ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నా

- జస్టిస్ ఎస్.కె.కౌల్



ఎల్‌జీబీటీక్యూఐఏ++ జంటల సమస్యలు మా దృష్టికి రాకపోలేదు. కానీ వారికి దత్తత హక్కు లేదన్న సీఏఆర్ఏలోని నిబంధన 5(3) చెల్లుబాటవుతుంది. అయితే స్వలింగ స్వభావులకు భాగస్వాములను ఎంచుకునేందుకు, సహజీవనం చేసేందుకు పూర్తి హక్కుంటుంది. అయితే ఆ బంధంతో వారికి దఖలు పడాల్సిన హక్కులను గుర్తించాల్సిన అనివార్యత మాత్రం ప్రభుత్వాలకు లేదు

జస్టిస్ రవీంద్ర భట్, జస్టిస్ హిమా కోహ్లీ

చైనాలో పుతిన్

బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టుకు మద్దతు

తాయ్ పీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చైనా పర్యటనకు బయల్దేరారు. మంగళవారం చైనా రాజధాని బీజింగ్ చేరుకున్నారు. ఆయనకు గార్డ్ ఆఫ్ ఆనర్‌తో ఘన స్వాగతం లభించింది. ద్వైపాక్షిక విషయాలతో పాటు పలు ఇతర అంశాల్లో ఇరు దేశాల బంధం ఎంత పటిష్టంగా ఉందో చెప్పేందుకు ఈ పర్యటన తాజా నిదర్శనమని అంటున్నారు. అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా అవి ఇప్పటికే పరోక్షంగా జట్టు కట్టడం తెలిసిందే. అందులో భాగంగా ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు చైనా మద్దతు పలుకుతోంది. విదేశాల్లో ఆర్థిక, భౌగోళిక, దౌత్యపరమైన ఆధిపత్యం సాధించేందుకు చైనా ప్రదర్శిస్తున్న దూకుడుకు రష్యా దన్నుగా నిలుస్తూ వస్తోంది. ముఖ్యంగా చైనా అధ్యక్షుడు తలపెట్టిన బెల్ట్ అండ్ రోడ్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టు (బీఆర్ఐ)కు కూడా రష్యా మద్దతు పలుకుతోంది. ఆ ప్రాజెక్టులో తనకేమీ తప్పుడు ఉద్దేశాలు కనిపించడం లేదని చైనా అధికార మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్ చెప్పారు కూడా. బీఆర్ఐ పదో వార్షికోత్సవానికి ఆయన హాజరవుతున్నారు. దీని ద్వారా మధ్య ఆసియాలోని మాజీ సోవియట్ యూనియన్ దేశాల మధ్య ఆర్థిక బంధం ఏర్పాటు చేయాలని ఆశాభావం వెలిబుచ్చారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి దిగేందుకు కొద్ది వారాల ముందు కూడా పుతిన్ చైనాలో పర్యటించారు. ఇక జిన్ పింగ్ కూడా మార్చిలో రష్యాలో పర్యటించారు. ఆ దేశంపై అమెరికా, పాశ్చాత్య దేశాల ఆంక్షలను దుయ్యబట్టారు.

ఆప్ ఎంపీ రాఘవ్ చద్దాకు ఊరట

న్యూఢిల్లీ: ఆప్ ఎంపీ రాఘవ్ చద్దాకు ఢిల్లీ హైకోర్టు ఊరట కల్పించింది. ప్రభుత్వ బంగ్లాను ప్రస్తుతానికి ఆయన ఖాళీ చేయాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఈ మేరకు దిగువ కోర్టు ఏప్రిల్‌లో ఇచ్చిన ఆదేశాలను పునరుద్ధరిస్తూ మంగళవారం జస్టిస్ అనూప్ ఆదేశాలిచ్చారు. తనకు కేటాయించిన టైప్–7 బంగ్లాను ఖాళీచేయాలంటూ రాజ్యసభ సెక్రటేరియట్ అధికారులు మార్చిలో నోటీసు పంపారు. దీనిపై ఆయన పటియాలా కోర్టుకెళ్లగా ఓసారి అనుకూలంగా, సెక్రటేరియట్ రివ్యూపిటిషన్ వేళ వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. దీంతో ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న న్యాయస్థానం రాఘవ్ చద్దా ప్రస్తుతానికి ఆ బంగ్లాను ఖాళీ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిజాపూర్ జిల్లాలో మంగళవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ మద్దేడు డివిజనల్ కమిటీ సభ్యుడు మృతి చెందాడు. మద్దేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొరంజెడ్–బందెపారా అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ ముఖ్య నేతలు సమావేశమయ్యారన్న నిఘా వర్గాల సమాచారంతో సోమవారం సాయంత్రం నుంచి డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్‌తో పాటు సీఆర్‌పీఎఫ్ 170వ బెటాలియన్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున మావోయిస్టులు కాల్పులు జరపగా పోలీసులు ఎదురు కాల్పులకు దిగారు. గంటపాటు హోరాహోరీగా కాల్పులు జరగగా మావోయిస్టులు తప్పించుకెళ్లారు. ఆ ప్రాంతంలో మావోయిస్టు డివిజనల్ కమిటీ మెంబర్, ఏరియా కమిటీ ఇన్‌చార్జ్ పొదం నగేశ్ మృతదేహం కనిపించింది. ఆ ప్రాంతంలో ఒక ఏకే 47 తుపాకీ, పేలుడు పదార్థాలు, మందులు, బ్యానర్లు, పోస్టర్లు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. 108 వరకు అరెస్ట్ వారెంట్లున్న నగేశ్ తలపై అధికారులు గతంలో రూ.8 లక్షల రివార్డు ప్రకటించారన్నారు. ఘటనాస్థలి నుంచి ఏరియా కమిటీ కార్యదర్శి బుచ్చన్న, ఏరియా కమిటీ సభ్యుడు విశ్వనాథ్‌తో పాటు మరో 20 మంది వరకు మావోలు తప్పించుకుని ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. వారి కోసం అదనపు బలగాలను రంగంలోకి దించి కూంబింగ్ ముమ్మరం చేశారు. మావోయిస్టు మృతదేహాన్ని బిజాపూర్ జిల్లా కేంద్రానికి తరలించామని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ చెప్పారు. నవంబర్ 7వ తేదీన మొదటి విడతలో ఎన్నికలు జరగనున్న బస్తర్ జిల్లాలో 20 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి.

క్లుప్తంగా...

నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఏపీఈఆర్‌సీ భవన నిర్మాణ పనులను పరిశీలించిన సంతోషరావు

కర్నూలు(రాజ్‌విహార్): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ప్రధాన కార్యాలయ భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఎస్‌పీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఆదేశించారు. కర్నూలు శివారులోని ఏపీ కార్బైడ్ ఫ్యాక్టరీ వద్ద నిర్మిస్తున్న ఏపీఈఆర్‌సీ భవన నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పనుల వివరాలను ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి, సివిల్ విభాగం ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ నెలాఖరుకు శ్లాబ్ వేసేలా పనుల్లో వేగం పెంచాలని, ముఖ్యంగా ప్రధాన భవన సముదాయంలో చైర్మన్, సభ్యుల చాంబర్‌లతోపాటు వెయిటింగ్ హాల్, కాన్ఫరెన్స్ హాల్, కోర్టు, పార్కింగ్, గెస్ట్ హౌస్ వంటి భవనాలను ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దాలని సంతోషరావు సూచించారు. సివిల్ ఇంజినీర్లు సుధాకర్‌బాబు, శ్రీనివాసులు, గురుప్రసాద్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ సైన్స్ కోర్స్ ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని లాంఫాంలో ఉన్న కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో బీఎస్సీ కోర్సుల ప్రవేశాలకు ఈనెల 20న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి. రామారావు మంగళవారం తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు నేరుగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ ను సంప్రదించాలన్నారు.

'సీఎం జగన్‌కు కృతజ్ఞతలు'



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ద్రావిడ దేశం అధ్యక్షుడు వి.కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నవంబర్ 15వ తేదీ నుంచి కులజనగణన చేపడతామన్న సీఎం వైఎస్ జగన్ ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో కులగణన కోసం విజయవాడ ధర్నాచౌక్‌లో తాను ఈ నెల 19న చేయాల్సిన నిరాహారదీక్షను వాయిదా వేసుకుంటున్నట్లు కృష్ణారావు ప్రకటించారు.

రొయ్య.. 100 కౌంట్ కిలో 240 రూ.



ఆక్వా సాధికారత కమిటీ స్పష్టీకరణ • ప్రభుత్వం నిర్దేశించిన ధరలకంటే తక్కువకు కొనే వారిపై చర్యలు

- రాష్ట్ర వ్యాప్తంగా 46,433 ఆక్వా కనెక్షన్ లకు విద్యుత్ సబ్సిడీ
- వచ్చే నెల నుంచి మరో 4230 కనెక్షన్లకు విద్యుత్ సబ్సిడీ
- స్థానికంగా ప్రతి నెలా వెయ్యి టన్నుల విక్రయాలు.. మరింత పెంచేందుకు చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వంద కౌంట్ రొయ్యలకు కిలో రూ. 240గా రేటు ఖరారు చేశామని, ఇంతకన్నా తక్కువకు కొనడానికి వీల్లేదని ఆక్వా సాధికారత కమిటీ స్పష్టం చేసింది. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకంటే తక్కువకు కొనే వారిపై ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. రాష్ట్రంలో ఆక్వా రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆక్వా సాధికారత కమిటీ మంగళవారం సచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, డాక్టర్ సీదిరి అప్పలరాజు, అప్సడా కో వైస్ చైర్మన్ వడ్డి రఘురాం, అధికారులు పాల్గొన్నారు. స్థానిక వినియోగం పెంచాలన్న సంకల్పంతో ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్స్‌ను పెద్ద ఎత్తున ప్రమోట్ చేస్తున్నట్లు మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు చెప్పారు. ఫలితంగా ప్రతి నెలా స్థానిక వినియోగం వెయ్యి టన్నులకు పెరిగిందన్నారు. దీనిని మరింత పెంచాలని చెప్పారు. అప్సడా ద్వారా 10 రోజులకోసారి రొయ్య రైతులు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులతో సమావేశాలు నిర్వహిస్తూ ధరల స్థిరీకరణకు కృషి చేస్తున్నట్లు వడ్డి రఘురాం మంత్రులకు వివరించారు. రాష్ట్రంలో రొయ్య రైతులందరితో కొత్తగా ఏర్పాటు చేసిన సమాఖ్యకు ఇటీవలే తాడేపల్లిలో కార్యాలయాన్ని కూడా ప్రారంభించామన్నారు. నగరాలు, ప్రధాన పట్టణాల్లో ప్రాన్స్ ఫెస్టివల్స్ నిర్వహిస్తూ స్థానిక వినియోగాన్ని పెంచుతున్నట్లు తెలిపారు.



ఆక్వా సాధికారిత కమిటీ భేటీలో మాట్లాడుతున్న మంత్రులు పెద్దిరెడ్డి, బొత్స, సీదిరి

నవంబర్ 1 నుంచి కొత్త కనెక్షన్లకు విద్యుత్ సబ్సిడీ

సీఎం వైఎస్ జగన్ నియమించిన సాధికారత కమిటీ కృషి ఫలితంగా ఇప్పటి వరకు 6 సార్లు ఆక్వా ఫీడ్, సీడ్ రేట్ల పెరుగుదలను నియంత్రించగలిగామని మంత్రులు చెప్పారు. గతంలో ఫీడ్, సీడ్ రేట్లను నియంత్రించే విధానం లేకపోవడం వల్ల ఆక్వా రైతులు నష్టపోయే వారని, రాష్ట్రంలో ఇప్పుడా పరిస్థితి లేదని తెలిపారు. ఆక్వా జోన్ పరిధిలో 4.65 లక్షల ఎకరాలు సాగవుతుండగా, దాంట్లో విద్యుత్ సబ్సిడీకి అర్హత పొందిన (10 ఎకరాల్లోపు) విస్తీర్ణం 3.26 లక్షల ఎకరాలుగా గుర్తించామన్నారు. తొలుత ఈ-ఫిష్ సర్వే ద్వారా 46,433 ఆక్వా విద్యుత్ కనెక్షన్లకు సబ్సిడీ ఇస్తున్నామని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు అండగా నిలవాలన్న సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు రైతుల దరఖాస్తులను పరిశీలించిన తర్వాత మరో 4,230 కనెక్షన్‌లకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించినట్టు చెప్పారు. కొత్తగా అర్హత పొందిన వారికి నవంబర్ 1 నుంచి సబ్సిడీ విద్యుత్ అందించాలని డిస్కంలను మంత్రులు ఆదేశించారు. ఈ సమావేశంలో మత్స్య శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, మత్స్య శాఖ కమిషనర్ కూనపురెడ్డి కన్నబాబు, అడిషనల్ డైరెక్టర్ అంజలి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణనకు సన్నాహం

- కార్యాచరణ కోసం శాఖల వారీగా కసరత్తు
- నవంబరు 15 తరువాత బీసీ కులగణన: మంత్రి వేణు

సాక్షి, అమరావతి/సాక్షిప్రతినిధి, కాకినాడ: జాతీయస్థాయిలో కులగణన ప్రక్రియను చేపట్టాలనే బీసీల న్యాయమైన డిమాండ్‌ను పెద్ద మనస్సుతో అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఆంధ్రప్రదేశ్‌లో అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. దీంతో కులగణనను వేగవంతం చేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకునే పనిలో ప్రభుత్వం నిమగ్నమయ్యింది. ఇందుకోసం సోమవారం సాంఘిక సంక్షేమ శాఖ, మంగళవారం బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశాల్లో శాఖల వారీగా కసరత్తు ముమ్మరం చేసింది. కులగణనకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించింది. ఇదిలా ఉంటే.. జనాభా లెక్కలు-2022 సేకరణలో బీసీ కులగణన జరపాలంటూ దేశవ్యాప్తంగా బీసీ సంఘాలు పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే జాతీయస్థాయిలో అన్ని రాష్ట్రాల్లోనూ బీసీ కులం కాలమ్ పెట్టి జనగణన చేపట్టడానికి కేంద్రం సమ్మతించకపోవడంతో రాష్ట్ర పరిధిలో నిర్వహించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ నేపథ్యంలోనే బీసీ కులం కాలం చేర్చి జనగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది. బీహార్‌లో చేపట్టిన కులగణనను అధ్యయనం చేసేందుకు ఏపీ ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో కులాల వారీగా వివరాలు సేకరించేందుకు (కులగణన) క్షేత్రస్థాయిలో సిబ్బందిని వినియోగించుకునేందుకు నిర్ణయించింది. వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులను ఇందుకోసం ఉపయోగించనుంది. సర్వే పారదర్శకంగా జరిగేలా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీవో స్థాయిలో పునఃపరిశీలన చేస్తారు. రాష్ట్రంలో సమర్థవంతంగా కులగణన నిర్వహించేందుకు అవసరమైన పటిష్ట కార్యాచరణతో ప్రభుత్వం ముందుకు సాగుతుండటం విశేషం.

బీసీల పక్షపాతి సీఎం జగన్ : మంత్రి వేణు



ఎన్నో ఏళ్లుగా బీసీలు ఎదురుచూస్తున్న కులగణన ప్రక్రియను చేపట్టడం ద్వారా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి బీసీల పక్షపాతినని నిరూపించుకున్నారని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం కాకినాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. నవంబర్ 15 తరువాత ఈ ప్రక్రియ రాష్ట్రంలో ప్రారంభమవుతుందన్నారు. ఈ చర్య రాష్ట్రంలోని బలహీన వర్గాలకు ఓ పెద్ద ఊరటని, వారి మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకుంటుందని చెప్పారు. వెనుకబడిన తరగతులతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు విద్య, సంక్షేమం, వంటి అంశాలలో ప్రాధాన్యత కల్పించే దిశగా కులగణన జరుగుతుందని తెలిపారు. సాధ్యం కాదనుకున్న బీసీల కోరిక సాకారం చేసే దిశగా ముఖ్యమంత్రి ఆ బాధ్యతను తనకు అప్పగించినందుకు రుణపడి ఉంటానన్నారు. కుల గణనను ప్రారంభించే ముందు వివిధ కుల సంఘాల నాయకులు, పెద్దలతో సమావేశాలు ఏర్పాటు చేసి అనుభవాలు, అభిప్రాయాలను తెలుసుకుంటామని మంత్రి వివరించారు.

విశాఖ అభివృద్ధికి 'ఈఈఎస్ఎల్' తోడ్పాటు

- విద్యుత్ సామర్థ్యం పెంచేందుకు విశాఖను ఎంపిక చేసుకున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ
- కొత్త ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉంటుందన్న సీఈఓ విశాల్ కపూర్

సాక్షి, అమరావతి: విశాఖ నగర అభివృద్ధిలో తాము సైతం భాగస్వాములు అవుతామని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సీఈఓ విశాల్ కపూర్ ప్రకటించారు. విశాఖలో విద్యుత్ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన వ్యూహాలను రూపొందించేందుకు ఈ కేంద్ర సంస్థ ముందుకు వచ్చింది. ఇందుకోసం అలయన్స్ ఫర్ ఎన్ ఎనర్జీ ఎఫిషియెంట్ ఎకానమీ(ఏఈఈఈ)తో ఢిల్లీలో తాజాగా ఒప్పందం కుదుర్చుకుంది. గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ, గుజరాత్ వంటి క్రియాశీల రాష్ట్రాలు, అండమాన్ నికోబార్, లడఖ్ వంటి కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ రెండు సంస్థల మధ్య సమాచార మార్పిడి, ఉమ్మడి పరిశోధన, సాంకేతిక నిపుణుల సహకారంతో విద్యుత్ రంగం అభివృద్ధికి ఉమ్మడి ప్రణాళిక రూపొందనుంది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఆఫ్ స్టేట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇండెక్స్ ప్రకటించిన టాప్-5 (ఏపీ, కర్నాటక, కేరళ, రాజస్తాన్,, తెలంగాణ) రాష్ట్రాల్లో ఏపీకి స్థానం లభించడం, ముంబై, సూరత్, వారణాసితో పాటు దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా విశాఖను నీతి ఆయోగ్ గుర్తించిన నేపథ్యంలో ఈఈఎస్ఎల్ కూడా తమ కార్యకలాపాలకు ఏపీలో విశాఖను ఎంపిక చేసుకున్నట్లు ఒప్పందం సందర్భంగా విశాల్ కపూర్ వెల్లడించారు. విద్యుత్ ఖర్చులను తగ్గించడం, ఉత్పత్తి, సరఫరాలో కొత్త టెక్నాలజీ అమలు చేయడం, భవిష్యత్ తరాలకు నాణ్యమైన నిరంతరం విద్యుత్ అందుబాటులో ఉండేలా ఇంధన భద్రత చర్యలు చేపట్టడం వంటి కార్యక్రమాలతో పాటు వాతావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ఈ ఒప్పందం ద్వారా ప్రయత్నం జరుగుతుందని ఆయన వివరించారు. తద్వారా కొత్త ఉద్యోగాల కల్పనకు అవకాశం ఏర్పడుతుందని సీఈఓ పేర్కొన్నారు.



దళితుల పేరుతో టీడీపీలో ముసుగు దొంగలు

- అర్థం లేని సమావేశాలతో దళితులను రెచ్చగొట్టే యత్నం
- సీఎం జగన్ హయాంలో తగ్గిన పేదరికంపై చర్చించేందుకు టీడీపీ సిద్ధమా!
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: దళితుల పేరుతో టీడీపీ ముసుగు దొంగలు అర్థంలేని సమావేశాలు నిర్వహిస్తూ దళితులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కాకినాడ సభలో టీడీపీ నేతలు చేసిన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు హయాంలోనే దళితులపై అమానవీయ ఘటనలు లెక్కలేనన్ని చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. దళితులు మురికి వాళ్లని టీడీపీ హయాంలో మంత్రులుగా పనిచేసిన వాళ్లే అన్నారన్నారు. వాటిపై మాట్లాడేందుకు మీ నోళ్లేమయ్యాయని ప్రశ్నించారు. అప్పట్లో దళితులకు జరిగిన అన్యాయాలపై చర్చించేందుకు టీడీపీ నేతలెవరైనా సిద్ధమా అని సవాల్ చేశారు. చంద్రబాబు హయాంలో దళితులపై జరిగిన ఘోర ఘటనలు కోకొల్లలు ఉన్నాయన్నారు.



టీడీపీలో నిజమైన అంబేద్కరిస్టులు లేరు

టీడీపీలో నిజమైన అంబేద్కరిస్టులు లేరని, ఆ పార్టీలోని దళిత నేతలకు ఆత్మగౌరవం లేదని మంత్రి మేరుగు ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో 45 ఏళ్ల పాటు చక్రం తిప్పినట్టు చెప్పుకునే చంద్రబాబు దళితుల్ని అవమానపర్చడంలో మొదటి స్థానంలో ఉన్నారన్నారు. కులగజ్జి ఉన్న నాయకుడు చంద్రబాబు అని.. అలాంటి వ్యక్తి నాయకత్వంలో దళితుల పేరిట కొందరు ముసుగు దొంగలు ఉన్నారని పేర్కొన్నారు. వాళ్లంతా అగ్రవర్ణాల అడుగులకు మడుగులొత్తుతూ దళితుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారన్నారు. రాష్ట్ర ఖజానా సొమ్మును పందికొక్కులా మెక్కిన చంద్రబాబు ఆధారాలతో సహా పట్టుబడ్డారనే విషయం ప్రజలందరికీ అర్థమైందని చెప్పారు.

జగన్‌ది దళితులతో రక్త సంబంధం

దళితులతో సీఎం జగన్‌ది రక్త సంబంధమని, బడుగుల పక్షాన నిలిచిన దళిత బంధు అని మంత్రి మేరుగ అన్నారు. దళితుల విషయంలో కుటిల కుల తత్వం చంద్రబాబుదని, దళితులకు మేలు జరగాలని చూసే వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. చంద్రబాబులా తాము రాజకీయాలను కలుషితం చేయబోమన్నారు. దళిత సంక్షేమాన్ని భుజాన వేసుకొని పనిచేస్తామని చెప్పారు. చంద్రబాబు 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పని చేసి రాష్ట్రంలోని పేదలకు ఒక పైసా కూడా విదల్చని చరిత్రను మూటగట్టుకున్నారని గుర్తు చేశారు. తన సామాజిక వర్గానికి పెద్దపీట వేసి పేదలు, రైతులు, దళితులను చులకనగా చూసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. సీఎం జగన్ మాత్రం ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణ పేదలంతా తన తోడబుట్టినవాళ్లే అని భావించారన్నారు. అందుకే డీబీటీ ద్వారా రూ.2.35 లక్షల కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. లబ్ధిదారుల్లో 60 శాతానికి పైగా దళితులున్నారని, ఇది చరిత్రలో లిఖించదగ్గ సంక్షేమమని స్పష్టం చేశారు.

జాతీయం / అంతర్జాతీయం

పంచతంత్రం

దిగ్విజయ్ సింగ్ బట్టలు చించేయండి

మధ్యప్రదేశ్‌లో టికెట్లు రాని కాంగ్రెస్ నేతలకు కమల్‌నాథ్ సూచన

భోపాల్: మధ్యప్రదేశ్‌లో విపక్ష కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేసింది. టికెట్లు రాని నేతలు భగ్గుమంటున్నారు. నాయకుల అనుచరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడికక్కడ రోడ్లపై బైఠాయించి నిరసన తెలుపుతున్నారు. పార్టీ అధిష్టానంపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ మాట్లాడిన వీడియో ఒకటి తెరపైకి వచ్చింది. 'టికెట్లు రాని నాయకులంతా వెళ్లి, దిగ్విజయ్ సింగ్, జైవర్ధన్ సింగ్ బట్టలు చించేయండి' అంటూ ఈ వీడియోలో ఆయన సూచించడం గమనార్హం. శివపురి నియోజకవర్గం నుంచి టికెట్ కోరుతున్న వీరేంద్ర రఘువంశీ సోమవారం కమల్‌నాథ్ నివాసానికి వెళ్లి నిలదీశారు. తనకు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయనతో కమల్‌నాథ్ మాట్లాడారు. టికెట్ కోసం నన్నెందుకు అడుగుతున్నారు? దిగ్విజయ్ సింగ్, జైవర్ధన్ సింగ్‌ల బట్టలు చించేయండి అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బీజేపీ కార్యకర్తలు కూడా ఈ వీడియోను షేర్ చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా విడిపోయింది. ఓ వర్గానికి కమల్‌నాథ్, మరో వర్గానికి మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ నేతృత్వం వహిస్తున్నారు.

పార్టీల గుండెల్లో రెబెల్స్...!

టికెట్లు దక్కని సీనియర్ల ఆగ్రహావేశాలు

ఇతర పార్టీల నుంచి, స్వతంత్రులుగా బరిలోకి

అన్ని రాష్ట్రాల్లోనూ పార్టీలకు తలనొప్పులు

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అన్ని పార్టీలూ రెబెల్స్ బెడదతో సతమతమవుతున్నాయి. టికెట్లు ఆశించి భంగపడ్డ పలువురు సీనియర్లు తిరుగుబాటు అభ్యర్థులుగా రంగంలోకి దిగిన ప్రధాన పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ద్విముఖ పోరు నెలకొని ఉంది. అయితే రెండు పార్టీలకూ మరో రకమైన పోటీ కూడా ఎదురవుతోంది. అది సొంత పార్టీల్లోని అసమ్మతుల రూపంలో! టికెట్లు దక్కలేదన్న అసంతృప్తితో వారు తిరుగుబావుటా ఎగరేస్తున్నారు. రెబెల్స్ అవతారమెత్తి తమ పార్టీ నాయకత్వాలకు సవాలు విసురుతున్నారు. అభ్యర్థుల జాబితాలు వెలువడుతున్న కొద్దీ రెండు పార్టీలకూ ఈ తలనొప్పి మరింత పెరుగుతోంది...

రాజస్తాన్: 12 చోట్ల తిరుగుబాట్లు

బీజేపీ తొలి జాబితాలో ప్రకటించిన 41 మంది అభ్యర్థుల్లో ఏకంగా డజను చోట్ల రెబెల్స్ గుబులు రేపుతున్నారు. ముఖ్యంగా విజయావకాశాలను పెంచుకునేందుకు సిట్టింగ్ ఎంపీలను అసెంబ్లీ బరిలో దింపాలని బీజేపీ తీసుకున్న నిర్ణయం బెడిసి కొడుతున్నట్టు కన్పిస్తోంది. వారిలో చాలామందికి రెబెల్స్ బెడద అధికంగా ఉంది. ఈ అభ్యర్థులకు వ్యతిరేకంగా స్థానిక ఆశావహులు, వారి మద్దతుదారులు నిరసనలు, ప్రదర్శనలతో హోరెత్తిస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి రాజ వర్ధన్‌సింగ్ రాథోడ్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. ఆదివారం ప్రచార బరిలో దిగిన ఆయనకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. రెబెల్స్ వర్గీయులు ఎక్కడికక్కడ రాథోడ్‌ను అడ్డుకుంటూ నిరసనలతో హోరెత్తించారు. నల్ల జెండాలతో ప్రదర్శనలకు దిగారు. అభ్యర్థుల మలి జాబితాలు వెలువడ్డాక పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని బీజేపీ ఆందోళన పడుతోంది.



ఛత్తీస్‌గఢ్: కాంగ్రెస్‌కు తలనొప్పి

రాష్ట్రంలో కాంగ్రెస్ తొలి జాబితాలో ప్రకటించిన 30 మంది పేర్లలో ఏకంగా 8 మంది సిట్టింగులకు టికెట్లు నిరాకరించింది. వారిపై కార్యకర్తల్లో అసంతృప్తి తదితరాలు కారణంగా చూపింది. కానీ వారంతా పార్టీ నిర్ణయంపై భగ్గుమంటున్నారు. స్వతంత్రులుగా బరిలో దిగి సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. మొత్తం 90 స్థానాలకు గాను ఇప్పటికే ఏకంగా 85 మంది పేర్లను ప్రకటించిన బీజేపీ మాత్రం తన 13 మంది సిట్టింగుల్లో ఒక్కరికి మాత్రమే టికెట్ నిరాకరించింది. అది కూడా అంతర్గత సర్వేల్లో ఆయన పట్ల తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైనందుకేనని పేర్కొంది. కానీ ఆ 85 స్థానాల్లో పలుచోట్ల అసమ్మతి స్వరాలు విన్పిస్తూనే ఉన్నాయి. ఇవన్నీ పెరిగి పెరిగి తిరుగుబాట్లకూ దారితీసే ఆస్కారముందని పార్టీ ఆందోళన చెందుతోంది.

మధ్యప్రదేశ్: ఇద్దరికీ ఇబ్బందే

ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు టికెట్ దక్కకపోవడంతో రాజీనామా చేయడమే గాక శరవేగంగా పార్టీలు కూడా మారిపోయారు. బీజేపీ నుంచి మమతా మీనా ఆప్‌లోకి, రక్ష్‌పాల్‌సింగ్, రాసల్‌సింగ్ బీఎస్పీలోకి దూకారు. కాంగ్రెస్ నుంచి ఛటాభుజ్ తోమర్ ఆప్ తీర్థం పుచ్చుకున్నారు. రానున్న కొద్ది రోజుల్లో ఈ ధోరణి మరింత వేగం పుంజుకుంటుందని రాజకీయ పరిశీలకులు జోస్యం చెబుతున్నారు.

అధికారమిస్తే కులగణన చేపడతాం

ఓబీసీలకు 27% రిజర్వేషన్ల కల్పన

రైతు రుణాల మాఫీ అమలు	రాష్ట్ర ప్రజలందరికీ రూ.25 లక్షల వైద్య బీమా	మధ్యప్రదేశ్ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీలు



మేనిఫెస్టోను విడుదల చేస్తున్న దిగ్విజయ్ సింగ్, కమల్‌నాథ్ తదితరులు

భోపాల్: కులగణన, ఓబీసీలకు 27% రిజర్వేషన్లు, రైతు రుణాల మాఫీ, ప్రజలందరికీ రూ.25 లక్షల వైద్య బీమా.. తదితర హామీలతో కాంగ్రెస్ పార్టీ మధ్యప్రదేశ్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసింది. రాష్ట్రంలో నవంబర్ 17వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. మొత్తం 59 వాగ్దానాలు, 101 ప్రధాన గ్యారంటీలతో కూడిన 106 పేజీల మేనిఫెస్టోను మంగళవారం భోపాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ కమల్‌నాథ్ విడుదల చేశారు. రూ.500కే ఎల్పీజీ సిలిండర్, రాష్ట్రానికి ప్రత్యేకంగా ఐపీఎల్ క్రికెట్ జట్టు ఏర్పాటు వంటివి కూడా ఇందులో ఉన్నాయి. రాష్ట్రాన్ని ఆనందంగా ఉంచేందుకు కాంగ్రెస్ పార్టీ 'కుషాలి మిషన్'ను ప్రారంభిస్తుందని కూడా కమల్‌నాథ్ ఈ సందర్భంగా ప్రకటించారు. కాంగ్రెస్ వస్తుంది, ఆనందం తెస్తుంది (కాంగ్రెస్ ఆయేగి, కుషాలి లాయేగి)అనేది తమ పార్టీ నినాదమని ఆయన చెప్పారు. 'పఢో-పఢావో యోజన'కింద ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున పంపిణీ. అదేవిధంగా, 9, 10 తరగతుల బాలలకు నెలకు రూ.వెయ్యి, 11,12వ తరగతుల వారికి రూ.1,500 చొప్పున సాయం అందజేత. రాష్ట్రంలో పాఠశాల విద్య ఉచితంగా అందజేస్తామని కూడా ఈ సందర్భంగా కమల్‌నాథ్ ప్రకటించారు.

- ఇతర వెనుక బడిన కులా(ఓబీసీ)ల వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, పథకాల్లో 27% రిజర్వేషన్లు.
- గిరిజనుల కోసం.. నోటిఫైడ్ ట్రైబల్ ఏరియాల్లో పంచాయతీల చట్టం అమలు. తునికాకు సేకరించేవారికి స్టాండర్డ్ బ్యాగ్‌కు రూ.4 వేల చొప్పున చెల్లింపు
- ఎస్సీల కోసం...సాగర్ జిల్లాలో సంత్ శిరోమణి రవిదాస్ కౌశల్ ఉన్నయాన్ యూనివర్సిటీ ఏర్పాటు. నర్మదా పరిక్రమ్ పరిషత్ ఏర్పాటు, నర్మదా పరిక్రమ్ యాత్ర చేపట్టడం కూడా ఉన్నాయి.
- యువతకు..రాష్ట్రంలోని యువతకు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, రూ.1,500 నుంచి రూ.3,000 వరకు రెండేళ్లపాటు నిరుద్యోగ భృతి అందజేత.సీనియర్ జర్నలిస్టులకు.. గౌరవ భృతి నెలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.20 వేలను రూ.25 వేలకు పెంపు. వారికోసం మెట్రో నగరాల్లో కాలనీల నిర్మాణం. ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం. క్రీడలు, క్రీడాకారులకు.. మధ్యప్రదేశ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) టీం ఏర్పాటు. ఒలంపిక్, వరల్డ్ కప్, ఆసియాడ్, కామన్ వెల్త్ క్రీడల్లో పతకాలు సాధించిన వారికి నేరుగా ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశం.
- సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు 600 చదరపు అడుగుల స్థలాన్ని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం.

కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలివీ..

- మహిళలకు నెలకు రూ.1,500 ఆర్థిక సాయం
- రైతులకు రూ.2 లక్షల వరకు రుణ మాఫీ
- గృహ వినియోగదారులకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 200 యూనిట్ల వరకు సగం ధరకే కరెంట్ సరఫరా
- సాగు అవసరాల కోసమైతే 5హెచ్‌పీ మోటారుకు ఉచిత కరెంటు
- రైతుల పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లుల మాఫీ
- రైతు ఆందోళనలు, విద్యుత్ సంబంధ తప్పుడు కేసులు ఎత్తివేత
- గోధుమ పంట క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.2,600
- వరి ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,500
- 2005 వరకు ఉన్న పాత పింఛను విధానం అమలు
- దివ్యాంగులకు నెలకు రూ.2 వేల పింఛను
- రూ.10 లక్షల ప్రమాద బీమాతో కలిపి రాష్ట్ర ప్రజలందరికీ రూ.25 లక్షల వరకు ఆరోగ్య బీమా కవరేజీ

60 శాతం దేశానికి 'ఇండియా' ప్రాతినిధ్యం

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్య

ఐజ్వాల్: బీజేపీ కంటే ఎక్కువగా, ప్రతిపక్ష పార్టీల ఇండియా కూటమి 60 శాతం దేశానికి ప్రాతినిధ్యం వహిస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం, తెలంగాణల్లో తమ పార్టీయే విజయం సాధిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రజల కోసం పనిచేస్తుందని చెప్పారు. సోమవారం నుంచి మిజోరంలో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ పార్టీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. మిజోరం రాజధాని ఐజ్వాల్‌లో మంగళవారం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. అనంతరం 'ఎక్స్'లో కాంగ్రెస్ పార్టీ విధానాలను వివరించారు. 'ప్రతిపక్ష ఇండియా కూటమి రాజ్యాంగాన్ని, విలువలను పరిరక్షిస్తూ, మతం, సంస్కృతులతో సంబంధం లేకుండా ప్రజలకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను, సామరస్యంగా జీవించే హక్కును పరిరక్షిస్తుంది. బీజేపీ కంటే కూడా ఎక్కువగా ఇండియా కూటమి దేశంలోని 60 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తోంది'అని బీజేపీయేతర పాలిత రాష్ట్రాలనుద్దేశించి వ్యాఖ్యానించారు. 'మన దేశం పట్ల ఇండియా కూటమి ఆలోచనలు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లతో పోలిస్తే భిన్నంగా ఉన్నాయి. మేం వికేంద్రీకరణపై దృష్టి పెడితే బీజేపీ మాత్రం ఢిల్లీ నుంచే అన్ని నిర్ణయాలూ జరిగిపోవాలని అంటోంది. మేం అధికారంలో ఉన్న రాజస్తాన్‌లో అత్యుత్తమమైన ఆరోగ్య విధానం, కర్ణాటకలో సామాజిక భద్రత కార్యక్రమాలు, ఛత్తీస్‌గఢ్‌లో వ్యాపార సానుకూల విధానాలు అమలవుతున్నాయి'అని రాహుల్ తెలిపారు. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వస్తే ఇటువంటి విజయవంతమవుతున్న విధానాలనే దేశవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు.

స్కూటరెక్కిన రాహుల్ గాంధీ

మిజోరంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న రాహుల్ గాంధీ ఐజ్వాల్‌లో స్కూటర్‌పై ప్రయాణించారు. మంగళవారం ఆయన సీనియర్ కాంగ్రెస్ నేత లాల్ తన్హావ్లాను ఇంటికెళ్లి కలుసుకున్నారు. తిరుగు ప్రయాణంలో స్కూటర్ ట్యాక్సీపై ప్రయాణించారు. నగరంలో ట్రాఫిక్ క్రమశిక్షణ ఎంతో బాగా ఉందని ప్రశంసలు కురిపించారు. ట్రాఫిక్ క్రమశిక్షణతో ఐజ్వాల్ 'సైలెంట్ సిటీ'గా పేరు తెచ్చుకుంది.



జగనన్న ఆరోగ్య సురక్ష



జగనన్న ఆరోగ్య సురక్ష	13వ రోజు
నిర్వహించిన మొత్తం శిబిరాలు 8,985	వైద్య సేవలు పొందిన ప్రజలు 35,11,552
నిర్వహించిన వైద్య పరీక్షలు 5,95,12,586	
మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రెఫర్ చేసినవారి సంఖ్య 61,971	


అన్నమయ్య జిల్లా కనసానివారిపల్లెలో శిబిరాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్


అనంతపురం జిల్లా ఆత్మకూరు శిబిరంలో వైద్యసేవలకు వచ్చిన ప్రజలు


తూర్పుగోదావరి జిల్లా తాడిపూడిలో రోగులకు మందులు అందజేస్తున్న సిబ్బంది


విజయనగరం జిల్లా దొంకినవలస శిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య బృందం


శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం గొల్లలవలసలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పెరమన గ్రామంలో వృద్ధురాలికి మందుల కిట్ అందిస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో ఖాదర్‌వలి


పశ్చిమగోదావరి జిల్లా అలంపురంలో వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం


గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తోటలో గ్రామస్తుడికి ఈసీజీ పరీక్ష చేస్తున్న సిబ్బంది


కర్నూలు జిల్లా కొక్కరచేడులో ప్రజలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


తిరుపతి జిల్లా పోతేగుంటలో శిబిరానికి హాజరైన ప్రజలు


ప్రకాశం జిల్లా జమ్ములపాలెంలో నిర్వహించిన వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

క్లుప్తంగా...

పురందేశ్వరి తీరుపై బీజేపీ నేతల్లోనే అయోమయం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



శ్రీశైలం టెంపుల్: పురందేశ్వరి ఏపీ బీజేపీ అధ్యక్షురాలా... లేక టీడీపీ అధ్యక్షురాలా... అనే విషయం బీజేపీ నాయకులకే అర్థంకావడం లేదని డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆయన మంగళవారం శ్రీశైలంలోని అతిథి గృహంలో మీడియాతో మాట్లాడుతూ పురందేశ్వరి తన చెల్లెలి కొడుకుని తీసుకుని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దగ్గరకు వెళ్లారని, అవినీతికి పాల్పడిన తన మరిదిని కాపాడుకునేందుకు ఆమె ప్రయత్నం చేస్తుండటం పట్ల బీజేపీ నేతల్లోనే అయోమయం నెలకొందన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా తప్పు చేసిన వారిని ఎవరూ రక్షించలేరన్నారు. అన్ని ఆధారాలను కోర్టు ముందు ఉంచడంతోనే ప్రజాధనాన్ని అక్రమ మార్గంలో మళ్లించినట్లు భావించి చంద్రబాబుకు రిమాండ్ విధించారని గుర్తుచేశారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో పటిష్ట భద్రత ఉందని, అయినా చంద్రబాబు ఆరోగ్యం, భద్రత గురించి అసత్య ప్రచారం చేస్తూ సానుభూతి పొందాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. 0+0 ఎంతవుతుందో.. జనసేన, టీడీపీ పొత్తు అంతేనని కొట్టు సత్యనారాయణ ఎద్దేవాచేశారు.

పరిపాలన రాజధాని విశాఖతో గిరిజనుల అభివృద్ధి

నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ లజపతిరాయ్


పరిపాలన రాజధాని విశాఖకు మద్దతుగా నాన్ జేఏసీ నాయకుల ప్రచారం

ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా): పరిపాలన రాజధానిగా విశాఖను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం వల్ల ఉత్తరాంధ్రలోని గిరిజన ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ పేర్కొన్నారు. ముంచంగిపుట్టులో మంగళవారం ఆయన మాట్లాడుతూ విశాఖ పరిపాలన కేంద్రమని ప్రకటన చేయడం ఆనందంగా ఉందన్నారు. ఉత్తరాంధ్రలోని గిరిజన ప్రాంతాలకు అభివృద్ధిపరంగా ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనంతరం జై విశాఖ నినాదాలు పెద్ద ఎత్తున చేశారు. పరిపాలన రాజధాని వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు ఆయన వివరించారు.

బెంగళూరుకు చెందిన కుస్తీ క్రీడాకారిణి ఆత్మహత్య

హుబ్లీ: బెంగళూరుకు చెందిన కుస్తీ క్రీడాకారిణి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్ణాటకలో దావణగెరె జిల్లా హరిహర పట్టణంలోని సిబార్ కుస్తీ శిక్షణా కేంద్రం (గరడీశాల)లో జరిగింది. హరిహరకు చెందిన కావ్య పూజార్ (13) చిన్ననాటి నుంచే కుస్తీని అభ్యసించి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలను సాధించింది. ఈమె దార్వాడలో కుస్తీ పహిల్వాన్ల హాస్టల్లో ఉంటూ అక్కడే చదువుకునేది. 2 రోజుల కిందట దార్వాడ నుంచి సొంతూరైన హరిహరకు వచ్చింది. స్థానిక గరడీశాలలో తర్ఫీదుకని సోమవారం వెళ్లింది. మంగళవారం ఉదయం ఉరి వేసుకుంది. స్థానికులు పోలీసులకు సమాచారమివ్వడంతో వారు వచ్చి పరిశీలించారు. అక్కడ డెత్ నోట్ ఏదీ దొరకలేదని తెలిపారు. బాలిక కుటుంబం కూడా కుస్తీ యోధులని, ఈ రంగంలో రాణించాలని బాలికపై ఒత్తిడి ఉండేదని సమాచారం.

గొప్ప ఫలితాలు ఇస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

వినుకొండ (నూజెండ్ల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా గొప్ప ఫలితాలను ఇస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి మంత్రి రజిని పాల్గొన్నారు. స్థానికులకు చేస్తున్న వైద్య పరీక్షలను, అందిస్తున్న మందులను ఆమె పరిశీలించారు. అనంతరం సభలో మంత్రి రజిని మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలకు స్పెషాలిటీ వైద్యసేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం విజయవంతంగా సాగుతోందన్నారు. కేవలం క్యాంప్‌లు నిర్వహించి చేతులు దులుపుకోకుండా వచ్చిన రోగులకు దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి ఆరోగ్యశ్రీ ద్వారా ఎలాంటి జబ్బులకైనా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో స్పెషలిస్ట్ వైద్యులు అందిస్తున్న సేవలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రకాల సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి పనులు, మరోవైపు ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు వినూత్నమైన కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు.


వైద్యశిబిరంలో మందుల పంపిణీని పరిశీలిస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్యే బొల్లా తదితరులు

జీవన ప్రమాణాలు పెంచేందుకే..

కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ సమీర్ శర్మ

అచ్యుతాపురం (అనకాపల్లి): ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ సమీర్ శర్మ అన్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం ఇరువాడ సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఆహారపు అలవాట్లపై చైతన్యం వచ్చేలా ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. బీపీ, షుగర్ వ్యాధుల తాకిడి, ఏ ఏ వయస్సుల వారికి ఏ విధంగా సంక్రమిస్తుందో తెలుసుకొని తీవ్రత తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎనీమియాపై ప్రత్యేక దృష్టి సారించి, 100 శాతం నివారణకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. శిబిరంలోని స్టాల్స్‌ని సందర్శించి వాటి వివరాలను తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలకు అందుతోన్న పౌష్టికాహారం నాణ్యతపై ఆరా తీశారు. రాష్ట్రంలో జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఆర్డీవో చిన్ని కృష్ణ పాల్గొన్నారు.


మందులను పరిశీలిస్తున్న సమీర్‌శర్మ

ఆరోగ్య సురక్ష విస్తరణ

▶ మొదటి పేజీ తరువాయి

మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రిఫర్ చేశారు. అలాగే, గ్రామాల్లోని 10,032 విలేజ్ క్లినిక్‌ల పరిధిలో చేయాలన్నది లక్ష్యం కాగా.. ఇప్పటివరకు 6,500కు పైగా క్యాంపులు పూర్తయ్యాయి. ఇప్పుడు వీటికి అదనంగా పట్టణాల్లో వార్డుల వారీగా విస్తరించారు. మరోవైపు.. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, నగరాల్లో 542 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 1,626 శిబిరాలు నిర్వహించాలన్నది ప్రణాళిక. దీంతో ఒక్కో కేంద్రం పరిధిలో ప్రస్తుతం మూడుచొప్పున ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ఒక్కో శిబిరం వద్దకు వెయ్యి మందికి పైగా జనాభా హాజరవుతున్నారు. ఇలా ప్రజల తాకిడి ఎక్కువగా ఉండడంతో వైద్యం పొందడంలో ఆలస్యం, ఇబ్బందులకు ఆస్కారం లేకుండా ఉండేందుకు వీలుగా వార్డు సచివాలయాల వారీగా సోమవారం నుంచి శిబిరాలను నిర్వహిస్తున్నారు. తాజా నిర్ణయంతో ఇప్పుడు ఈ క్యాంపులు మరింతగా పెరగనున్నాయి.

3,842 వార్డు సచివాలయాల పరిధిలో..

పట్టణ ప్రాంతాల్లో రాష్ట్రవ్యాప్తంగా 3,842 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో ఇప్పటికే శిబిరాలు పూర్తయినవి మినహాయించి మిగిలిన ప్రతి సచివాలయం పరిధిలో శిబిరాలు నిర్వహించేలా ప్రణాళిక రచించారు.

- సచివాలయం పరిధిలో శిబిరం నిర్వహించడానికి ముందే ప్రతి ఇంటిని వలంటీర్లు, గృహ సారథులు సందర్శిస్తున్నారు.
- ఆ తర్వాత.. వలంటీర్లు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ప్రతి ఇంటిని సందర్శించి ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు.
- బీపీ, షుగర్ పరీక్షలతో పాటు, అవసరం మేరకు డెంగీ, మలేరియా, వంటి ఇతర ఏడు పరీక్షలు చేపడుతున్నారు.
- గుర్తించిన వివిధ సమస్యల ఆధారంగా బాధితులు శిబిరాలకు వెళ్లేందుకు టోకెన్లు ఇస్తున్నారు.
- టోకెన్లతో సంబంధం లేకుండా నేరుగా శిబిరాలకు హాజరయ్యే వెసులుబాటు కూడా ఉంది.

ఇబ్బందులకు తావు లేకుండా..



పట్టణాల్లోని ప్రతి వార్డు సచివాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శిబిరాల నిర్వహణ ప్రారంభించాం. రాష్ట్రవ్యాప్తంగా వైద్య శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రిఫర్ చేసిన వారికి ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యం అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. స్థానిక మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలకు ఆ బాధ్యతలు అప్పగించాం.

– ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, సీఈవో, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

నిజాలకు పాతర.. అబద్ధాల జాతర

సీఎం వైఎస్ జగన్ చర్యలతో ఎన్నడూలేని రీతిలో అభివృద్ధిలో పురోగమిస్తున్న రాయలసీమ

- యుద్ధప్రాతిపదికన గాలేరు–నగరి, తెలుగుగంగ, హంద్రీ–నీవా తదితర ప్రాజెక్టులు పరుగులు
- సీమలో ఈ నాలుగేళ్లలో 71 పరిశ్రమల స్థాపన.. రూ.36,610 కోట్ల పెట్టుబడులు
- పవన, సౌర.. పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ విద్యుదుత్పత్తి కేంద్రాలకు నిలయంగా రాయలసీమ
- అన్ని రంగాల్లో సీమ పురోగమిస్తుండటాన్ని జీర్ణించుకోలేక విషం కక్కిన ఈనాడు



సాక్షి, అమరావతి: ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు చిత్రీకరిస్తూ తప్పుడు కథనాలు అచ్చేయడంలో తనకు తానే సాటి అని 'ఈనాడు' రామోజీరావు మరోసారి నిరూపించుకున్నారు. సీఎం వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రంలో మూడు ప్రాంతాల సమతుల అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే వెనుకబడిన రాయలసీమను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నారు. ఫలితంగా మునుపెన్నడూ లేని రీతిలో ఈ ప్రాంతం అభివృద్ధిలో పురోగమిస్తోంది. దీన్ని ఇప్పుడు రామోజీ జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే.. వైఎస్ జగన్ ప్రభుత్వ నిర్ణయాలను నిత్యం వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుని విషం కక్కుతున్నారు. వాటిని అపహాస్యం చేస్తూ.. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టడానికి కొన్ని రాజకీయ శక్తులతో కలిసి ఆయన చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే 'కరవు నేలపై కనికట్టు మాటలు' శీర్షికన మంగళవారం ఈనాడులో అచ్చోసిన అబద్ధాల సమాహారం.

సీమ పచ్చబడుతుంటే ఎందుకంత కడుపుమంట?..

- దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హంద్రీ–నీవా, గాలేరు–నగరి, తెలుగుగంగ తదితర ప్రాజెక్టులను చేపట్టారు. ఈ ప్రాజెక్టుల్లో మిగిలిన పనులను టీడీపీ సర్కార్ పూర్తిచేయలేదు. పైగా.. ఆ పనుల అంచనా వ్యయాన్ని అడ్డగోలుగా పెంచేసి.. నామినేషన్‌పై అస్మదీయ కాంట్రాక్టర్లకు కట్టబెట్టింది. ప్రభుత్వ ఖజానాను చంద్రబాబు ఇలా దోచుకోవడంపై రామోజీరావు పెన్ను ఎప్పుడూ కదల్లేదు.. నోరు పెగల్లేదు. ఎందుకంటే.. అలా దోచుకుని, పంచుకుని, తిన్న దాంట్లో ఆయనకూ వాటా వచ్చింది కాబట్టి. కానీ, జగన్ ఈ ప్రాజెక్టులన్నింటిని పెద్దపీట వేశారు.
- వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక తెలుగుగంగలో మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేశారు. ఇక తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ మట్టికట్టకూ సీఎం జగన్ డయాఫ్రమ్ వాల్ నిర్మించి లీకేజీలకు అడ్డుకట్ట వేయడం ద్వారా ఆ ప్రాజెక్టులో పూర్తి సామర్థ్యం మేరకు 17 టీఎంసీలు నిల్వచేస్తున్నారు. అలాగే, గాలేరు–నగరిలో అంతర్భాగమైన అవుకు రెండో టన్నెల్‌నూ పూర్తిచేశారు. అంతేకాక.. రూ.950 కోట్లు వెచ్చించి గండికోట, రూ.280 కోట్లు వెచ్చించి సీబీఆర్ నిర్వాసితులకు పునరావాసం కల్పించి.. ఆ రెండు ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయిలో అంటే గండికోటలో 26.85 టీఎంసీలు, సీబీఆర్‌లో పది టీఎంసీలు నిల్వచేస్తూ ఆయకట్టుకు నీళ్లందిస్తున్నారు. ఇలా సీమ పచ్చబడుతుంటే ఎందుకంత కడుపుమంట రామోజీ?
- ఇక రాయలసీమ సాగు, తాగునీటి కష్టాలు కడతేర్చాలనే లక్ష్యంతో రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టారు. దీనిపై ఎన్జీటీలో కేసులు వేయించి సైంధవునిలా చంద్రబాబు అడ్డుపడుతుంటే ఏనాడైనా నిలదీశారా రామోజీ?

శరవేగంగా పారిశ్రామిక ప్రగతి..

నిజానికి.. నాలుగేళ్లలో రాయలసీమ పారిశ్రామికంగా గణనీయమైన ప్రగతి సాధించింది. రవాణా, విద్యుత్ ఎలక్ట్రానిక్స్, ఉక్కు రంగాల్లో శరవేగంగా ముందుకు సాగుతోంది. రాయలసీమ ప్రగతికి ప్రకాశం జిల్లాలో నిర్మిస్తున్న రామాయపట్నం పోర్టు చుక్కానిలా నిలవనుంది. సీమలో ఉత్పత్తయ్యే వస్తువుల రవాణాకు.. ఎగుమతి, దిగుమతులు ఊపందుకోవడానికి ఈ పోర్టు ఉపయోగపడుతుంది. దీనిని రూ.2,365 కోట్లతో ప్రభుత్వం నిర్మిస్తోంది. ఈ పోర్టుకు సమీపంలోనే నాలుగైదు వేల ఎకరాల్లో పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధి కానుంది. ఏడాదికి 34 మిలియన్ టన్నుల సరుకులు ఈ పోర్టు నుంచి ఎగుమతి, దిగుమతులు జరగనున్నాయి.

- కడప స్టీల్ ప్లాంట్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.
- 2019–23 మధ్యకాలంలో రాయలసీమ ప్రాంతంలో 71 అతిపెద్ద–భారీ పరిశ్రమలు వచ్చాయి. రూ.36,610 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటి ద్వారా 55 వేల మందికి ఉద్యోగాలు లభించాయి.
- రాయలసీమ ప్రాంతం దేశంలోనే సంప్రదాయేతర ఇంధన వనరుల రంగానికి తలమానికం కానుంది. ప్రభుత్వ కృషివల్ల ఈ ఒక్క రంగంలోనే.. అదీ ఒక్క రాయలసీమ ప్రాంతంలోనే 16 ప్రాజెక్టులు రాబోతున్నాయి.
- శ్రీకాళహస్తి సమీపంలోని ఇంగలూరులో అడిడాస్ షూ తయారీ కంపెనీ అపాచీకి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ ఒక్క కార్యక్రమంతోనే ప్రారంభించిన, భూమి పూజ చేసుకున్న పరిశ్రమల పెట్టుబడుల విలువ దాదాపు రూ.4వేల కోట్లు కాగా.. సుమారు 20వేల మందికి ఉద్యోగాలు లభిస్తున్నాయి.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు..

రాయలసీమలో వైద్యారోగ్య పరంగా కూడా ఈ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చింది. కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 17 మెడికల్ కాలేజీలను నిర్మిస్తుండగా అందులో ఐదు కాలేజీల నిర్మాణాన్ని రాయలసీమలో చేపట్టింది. ఒక్కో మెడికల్ కాలేజీ కోసం సుమారుగా రూ.500 కోట్లను ప్రభుత్వం ఖర్చుచేస్తూ ప్రజారోగ్య రంగంలో పెట్టుబడి పెడుతోంది. రాయలసీమ చరిత్రలోనే ఇంత పెట్టుబడి ఏ ప్రభుత్వం కూడా పెట్టలేదు. ఇక తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర, కడప, అనంతపురం, కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల రూపురేఖలను సైతం మారుస్తోంది. ప్రజారోగ్యంపై టీడీపీ సర్కార్ ఎప్పుడైనా ఇంత శ్రద్ధ పెట్టిందా రామోజీ?

మరిన్ని స్కూళ్లు 'డిజిటల్'

- హైస్కూళ్లకు మరో 32 వేల ఐఎఫ్‌పీలు
- ప్రాథమిక పాఠశాలలకు 23 వేల స్మార్ట్ టీవీలు
- డిసెంబర్‌నాటికి అన్ని స్కూళ్లకు సరఫరా
- ఇప్పటికే 30 వేల ఐఎఫ్‌పీలు, 10 వేల స్మార్ట్ టీవీలతో బోధన
- మంచి ఫలితాలు ఇస్తున్న డిజిటల్ బోధన
- దేశంలోనే అతి పెద్ద డిజిటల్ ప్లాట్‌ఫారంగా పాఠశాల విద్య

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతి విద్యార్థికీ అత్యున్నత స్థాయి విద్య అందించాలని, వారు అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష. అందుకు అనుగుణంగా సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రాష్ట్రంలో విద్యా రంగంలో పలు సంస్కరణలు తెచ్చారు. పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్కూళ్లలో మాదిరిగా అత్యాధునిక పద్ధతుల్లో బోధన, వసతులు ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పులు తెస్తున్నారు. ఇందుకోసం గత నాలుగున్నరేళ్లలో రూ. 66 వేల కోట్లకు పైగా ఖర్చు చేశారు. 'నాడు – నేడు' కార్యక్రమం ద్వారా పాఠశాలలకు నూతన భవనాల నిర్మాణంతోపాటు అత్యాధునిక బోధన పద్ధతులను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో పాఠశాల విద్యను పూర్తిగా డిజిటలైజేషన్ చేస్తున్నారు. ఇందుకోసం ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీలు) ఏర్పాటు చేస్తున్నారు. డిసెంబర్ నాటికి అన్ని ఉన్నత పాఠశాలల్లో మరో 32 వేల ఐఎఫ్‌పీ స్క్రీన్లు, ప్రాథమిక పాఠశాలల్లో 23 వేల స్మార్ట్ టీవీలు అందించనున్నారు.

సామాన్యుల పిల్లలు చదువుకునే ప్రభుత్వ బడుల్లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన బోధనను ఈ (2023–24) విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రంలో పాఠశాల విద్యను దేశంలోనే అతి పెద్ద డిజిటల్ ప్లాట్‌ఫారంగా మారుస్తోంది. తొలివిడత నాడు–నేడులో ఆధునీకరించిన పాఠశాలల్లో నూతన తరగతి గదులు, డబుల్ డెస్క్ బెంచీలు, ద్విభాషా పాఠ్య పుస్తకాలతో పాటు కార్పొరేట్ పిల్లలకు మాత్రమే సాధ్యమైన బైజూస్ కంటెంట్ ఉన్న ట్యాబ్‌లను వైఎస్ జగన్ ప్రభుత్వం ఉచితంగా అందించింది. అనంతరం అమెరికా వంటి అగ్ర దేశాల్లో మాత్రమే విద్యా బోధనకు వినియోగించే అత్యాధునిక టెక్నాలజీ గల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లను, స్మార్ట్ టీవీలను 11,315 పాఠశాలల్లో ఈ ఏడాది జూన్ నెలలోనే అందుబాటులోకి తెచ్చింది. 4,800 ఉన్నత పాఠశాలల్లో 30,715 ఐఎఫ్‌పీ స్క్రీన్లను ఏర్పాటు చేయగా, 6,515 ప్రాథమిక పాఠశాలల్లో 10,038 స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసింది. ఈ డిసెంబరు మొదటి వారానికి మరో 32 వేల ఐఎఫ్‌పీలను హైస్కూళ్లకు అందించనుంది. గతంలో పాఠశాలలకు సరఫరా చేసిన ఐఎఫ్‌పీలనే ఇప్పుడూ తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈమేరకు అధికారులు టెండర్ ప్రక్రియ ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసే 23 వేల స్మార్ట్ టీవీల టెండర్ల జ్యుడిషియల్ ప్రివ్యూ పూర్తయింది. ఈ టెండర్లను ఖరారు చేసి వచ్చే నెలలోనే స్మార్ట్ టీవీల పంపిణీ ప్రారంభించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే దేశంలో పాఠశాల విద్యను పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేసిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవనుంది. ఈ ఏడాది టోఫెల్ కూడా ప్రవేశపెట్టడం, స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీల ద్వారా బోధన వల్ల కలిగే మంచి ఫలితాలు ఇటీవల ముగిసిన ఫార్మాటివ్ అసెస్‌మెంట్ 1, 2 పరీక్షల్లో కనపడటంతో అన్ని పాఠశాలల్లో కొత్త ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేస్తున్నారు.



ఐఎఫ్‌పీలతో అత్యాధునిక పద్ధతిలో బోధన

ఐఎఫ్‌పీలు అత్యాధునిక బోధనకు ప్రతీకగా నిలుస్తాయి. 165 సెంటీమీటర్ల వైశాల్యం ఉండే ఈ స్క్రీన్లపై ఓ పక్క వీడియోలో బోధన చేస్తూనే.., మరోపక్క విద్యార్థికి అర్థం కాని అంశాలను ఉపాధ్యాయులు బోర్డు మీద రాసి చూపించవచ్చు. అవసరమనుకుంటే అదే అంశాన్ని ప్రింట్ తీసుకోవచ్చు. మొత్తం పాఠాన్ని లింక్ రూపంలో ఆన్‌లైన్‌లో పెట్టొచ్చు. అంటే ఒకే బోర్డుపై అనేక విధాలుగా బోధన (మల్టీ టాస్కింగ్) చేయొచ్చు. ఈ ఐఎఫ్‌పీ ప్యానెళ్లలో పాఠ్యాంశాలు, బైజూస్ కంటెంట్‌ను తెలుగు, ఇంగ్లిష్, హిందీతో పాటు మొత్తం ఏడు భాషల్లో అందిస్తారు. గూగుల్ అసిస్టెంట్‌తో వచ్చే ఈ ఇంటరాక్టివ్ స్మార్ట్ ప్యానెళ్లు 6 నుంచి 10వ తరగతి వరకు సెక్షన్‌కు ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. తొలివిడత ఐఎఫ్‌పీ స్క్రీన్లు ఏర్పాటుచేసిన పాఠశాలల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించినట్టు గుర్తించారు.

క్లుప్తంగా...

డిస్టిలరీలపై సీబీఐ దర్యాప్తునకు సిద్ధమా?

పురందేశ్వరికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి సవాల్



శ్రీరంగరాజపురం(చిత్తూరు జిల్లా): మాజీ సీఎం చంద్రబాబు 14 ఏళ్ల పాలన నుంచి నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వరకు డిస్టిలరీలపై సీబీఐ దర్యాప్తునకు సిద్ధమా..? అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి సవాల్ విసిరారు. మండలంలోని 49 కొత్తపల్లిమిట్టలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు జైలుకు వెళ్లినప్పటి నుంచి పురందేశ్వరి టీడీపీ అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నట్టు అనుమానంగా ఉందని అన్నారు. లోకేశ్‌ను సీఎం చేసేందుకు టీడీపీ నాయకులు ఎంతటి ఘోరానికైనా పాల్పడతారని విమర్శించారు.

చంద్రబాబు చట్టానికి అతీతుడేమీ కాదు

శాసన సభాపతి తమ్మినేని సీతారాం



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): 'స్కిల్ స్కామ్‌లో ఆధారాలతో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు తిరిగి బుకాయిస్తానంటే చట్టం చూస్తూ ఊరుకోదు.. చంద్రబాబు చట్టానికి అతీతుడేమీ కాదు' అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. చంద్రబాబు అరెస్ట్‌పై టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో తప్ప సామాన్యుల్లో ఎలాంటి స్పందన లేదన్నారు. శ్రీకాకుళంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బాబు స్కిల్ స్కామ్ చేయలేదని ఆయన తరఫు న్యాయవాదులు మాట్లాడడం లేదని, సాంకేతిక అంశాలపై మాత్రమే మాట్లాడుతున్నారని చెప్పారు. ఆర్థిక నేరగాళ్లను ప్రజలు నమ్మబోరన్నారు. పవన్‌కు పవనం లేదని, 2024 ఎన్నికల్లో 175 సీట్లు సాధించి తీరుతామన్నారు.

టీడీపీ ఆందోళనలకు ప్రజా స్పందన కరువు

మంత్రి ఆదిమూలపు సురేష్



సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంద్రబాబుకు మద్దతుగా టీడీపీ నేతలు చేస్తున్న ఆందోళనలకు ప్రజా స్పందన కరువైందని మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. రాజమండ్రిలో మంగళవారం వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ప్రస్తుతం రిమాండ్ ఖైదీ అని, జైలు నిబంధనల ప్రకారం అన్ని వసతులు, భద్రత చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. బాబు తప్పు చేశాడన్న ఆధారాలు ఉన్న కారణంగానే ఆయన జైలులో ఉన్నారని, అది మరిచిపోయిన టీడీపీ నేతలు నానా హంగామా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

తప్పులు చేయడం చంద్రబాబుకు అలవాటే..

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి



నగరం : దుర్మార్గపు ఆలోచనలు, తప్పులు చేయడం చంద్రబాబుకు అలవాటని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. బాపట్ల జిల్లా పెదపల్లి గోల్లపాలెంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. స్కిల్ స్కాంలో 13 చోట్ల సంతకాలు చేసి చంద్రబాబు అడ్డంగా దొరకడంతో రిమాండ్ ఖైదీగా జైల్లో ఉన్నారని చెప్పారు. అవినీతి సొమ్ము చంద్రబాబు బ్యాంక్ ఖాతాలకు వచ్చినట్లు స్పష్టమైన ఆధారాలు లభించటంతో సీఐడీ అధికారులు అరెస్ట్ చేస్తే.. టీడీపీ నాయకులు అక్రమంగా అరెస్ట్ చేశారనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అవినీతికి పాల్పడినట్టు పక్కా ఆధారాలున్నాయని.. చంద్రబాబుకు శిక్ష తప్పదన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో తప్పు ఎవ్వరూ చేసినా శిక్ష తప్పదని స్పష్టం చేశారు. రైతులు, సాగునీటి గురించి మాట్లాడే అర్హత టీడీపీ నాయకులకు లేదన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, ఎంపీపీ శ్రీకృష్ణయ్య ఉన్నారు.

బాక్సైట్‌ను దోచుకోవాలని కుట్ర చేసింది బాబే

మేరాజోత్ హనుమంత్ నాయక్

సాక్షి,అమరావతి : టీడీపీ ప్రభుత్వ హయాంలో జీవో నంబర్ 97 తెచ్చి గిరిజన ప్రాంతాల్లోని బాక్సైట్ ఖనిజాలను దోచుకోవాలని కుట్ర చేసింది చంద్రబాబేనని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ విమర్శించారు. విశాఖపట్నం నుంచి టీడీపీ నేతలు చేసిన విమర్శలను ఆయన ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం వైఎస్ జగన్ గిరిజనులకు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే టీడీపీ నేతలు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులను అన్ని విధాలా అభివృద్ధి చేయడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుందని తెలిపారు. గిరిజనులకు ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసిన ఘనత దేశంలో సీఎం జగన్‌కే దక్కిందని పేర్కొన్నారు. గిరిజనులకు ఎవరి పాలనలో ఎంత మేలు జరిగిందనే దానిపై చర్చకు రావాలని సవాల్ చేశారు.

చంద్రబాబుకు నో రిలీఫ్

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బాబు క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో తీర్పు రిజర్వు

ఫైబర్‌నెట్ కుంభకోణం కేసు విచారణ శుక్రవారం చేపడతామన్న ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయి, రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబుకి మధ్యంతర బెయిలు మంజూరు చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది. ఫైబర్‌నెట్ కుంభకోణం కేసులోనూ మధ్యంతర బెయిలు ఇవ్వాలన్న చంద్రబాబు విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ కేసు విచారణ శుక్రవారం చేపడతామని పేర్కొంది. అప్పటి వరకూ చంద్రబాబును అరెస్టు చేయొద్దని చెప్పింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలంటూ చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం మంగళవారం మరోసారి విచారించింది. ఇరుపక్షాల వాదనలు పీసీ చట్టం సెక్షన్ 17ఏ పైనే జరిగాయి. సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, రంజిత్‌కుమార్, నిరంజన్‌రెడ్డి వాదించగా, చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు హరీశ్ సాల్వే, సిద్దార్థ లూథ్రా వాదనలు వినిపించారు. తొలుత సీఐడీ తరఫున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ సెక్షన్ 17ఏ ఈ కేసుకు వర్తించదని చెప్పారు. ఇది 2018 కన్నా ముందు జరిగిన నేరమని, ఆ సమయంలో ఉనికిలోనే లేని చట్టం ఎలా వర్తిస్తుందని ప్రశ్నించారు. 2018 జూన్‌లోనే విచారణ ప్రారంభించామని తెలిపారు. ఎఫ్ఐఆర్‌లో కాగ్నిజబుల్ నేరాలు ఉన్నాయా.. లేదా.. అనేది చూడాలని చెప్పారు. సెక్షన్ 17ఏ నిజాయితీపరులకే తప్ప అవినీతిపరులకు రక్షణ కవచం కాకూడదని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అవినీతి జరిగిందని స్పష్టంగా కనిపిస్తోందని, అటువంటప్పుడు సెక్షన్ 17ఏ అసలు వర్తించదని చెప్పారు. రూ. వందల కోట్ల కుంభకోణం దర్యాప్తును అడ్డుకోవడానికి ఈ సెక్షన్‌ను ఉపయోగించరాదని అన్నారు. 2015–16లో చట్టంలో లేనివి వర్తించవని చెప్పారు. సెక్షన్ 17ఏ భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. పీసీ చట్టానికి సంబంధం లేని అభియోగాలపై విచారించే పరిధి ప్రత్యేక కోర్టుకు ఉందని పలు కోర్టు తీర్పులను ప్రస్తావిస్తూ గట్టిగా వాదనలు వినిపించారు. ఒక వ్యక్తి పీసీ చట్టం, ఐపీసీ సెక్షన్ల ప్రకారం నిందితుడు అయితే.. ఏదైనా కారణాలతో పీసీ చట్టం నేరాలను దాని నుంచి తొలగించినప్పటికీ, ప్రత్యేక న్యాయమూర్తి మిగిలిన ఐపీసీ కింద సెక్షన్లపై చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం విచారణ చేయొచ్చని తెలిపారు. ఈ కేసులో ప్రత్యేక కోర్టు నిందితుడి విడుదలకు నిరాకరించిందని తెలిపారు. ప్రస్తుత కేసులో ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నామని, డిశ్చార్జి ఉందా లేదా అనేది పక్కనపెడితే.. పోలీసుల దర్యాప్తులో పీసీ లేదా పీసీయేతర అభియోగాల మధ్య తేడా లేనప్పుడు ఎఫ్ఐఆర్‌ను ఎలా క్వాష్ చేస్తారని ప్రశ్నించారు. ఇది రాజకీయ కక్ష కాదని, కేంద్ర దర్యాప్తు సంస్థల ఆరోపణలపైనా దర్యాప్తు జరిగిందని తెలిపారు. ఒకవేళ సెక్షన్ 482 విచక్షణ ప్రకారం రిలీఫ్ ఇవ్వాలంటే దానికి కొన్ని ప్రిన్సిపుల్స్ ఉన్నాయన్నారు. ఈ కేసుకు ఆ అర్హత కూడా లేదని కౌంటర్ అఫిడవిట్‌ను పరిశీలిస్తే అర్థం అవుతుందని తెలిపారు. సుప్రీంకోర్టే ప్రాథమిక విచారణ చేయాలనుకోవడం సరికాదన్నారు. ఈ సందర్భంగా తన వాదనలను సమర్థించే వేర్వేరు తీర్పులను ధర్మాసనం ముందుంచారు.

40 రోజులుగా జైల్లో ఉన్నారు బెయిల్ ఇవ్వండి

చంద్రబాబు తరఫు న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు వినిపిస్తూ.. రాజకీయ కక్ష సాధింపులు నిరోధించేందుకే 17ఏ ఉందని, ఇది చట్టం కల్పించిన రక్షణ అని చెప్పారు. రాష్ట్ర వాదన చూస్తుంటే.. సెక్షన్ 17ఏ అమాయకులైన వారికే వర్తిస్తుందన్నట్లుందని చెప్పారు. నిర్దోషులని నిర్ధారించడానికి నిర్దోషిత్వంపై ముందుగా విచారణ నిర్వహించాలంటూ ప్రొవిజన్ తలక్రిందులు చేస్తున్నారని ఆరోపించారు. జీఎస్టీ చెల్లింపులకు, ప్రభుత్వానికి ముడి పెడుతున్నారన్నారు. 2021లో విచారణ ప్రారంభించి ఆధారాల కోసం మళ్లీ వెదుకుతున్నారని ఆరోపించారు. ఈ కేసులో సెక్షన్ 17ఏ వర్తిస్తుందని చెప్పారు. 40 రోజులుగా చంద్రబాబు జైల్లో ఉన్నారని, మధ్యంతర బెయిలు ఇవ్వాలని సాల్వే అభ్యర్థించారు. సాల్వే వాదనలను లూథ్రా సమర్థించారు. ఇరుపక్షాల వాదనల అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

చంద్రబాబు బెయిల్ పిటిషన్ విచారణను 19కి వాయిదా వేసిన హైకోర్టు

చంద్రబాబు న్యాయవాదుల అభ్యర్థన మేరకు హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌లో తదుపరి విచారణను నెల 19వ తేదీకి వాయిదా పడింది. చంద్రబాబు తరఫు న్యాయవాదుల అభ్యర్థన మేరకు హైకోర్టు విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ ఏసీబీ కోర్టు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా, చంద్రబాబు తరఫు న్యాయవాదులు వాయిదా వేయాలని కోరారు. దీంతో న్యాయమూర్తి తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కుట్రకోణంపై కౌంటర్ దాఖలు చేయండి

- జగన్‌పై హత్యాయత్నం కేసులో ఎన్ఐఏకు హైకోర్టు ఆదేశం
- విశాఖ ఎన్ఐఏ కోర్టులో తదుపరి చర్యలన్నీ 8 వారాలపాటు నిలిపివేత
- తదుపరి విచారణ 6 వారాలకు వాయిదా



సాక్షి, అమరావతి: విశాఖ విమానాశ్రయంలో తనపై జరిగిన హత్యాయత్నం వెనుక గల కుట్ర కోణంపై లోతుగా దర్యాప్తు చేసేలా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)ను ఆదేశించాలని కోరుతూ వైఎస్ జగన్ దాఖలు చేసిన పిటిషన్‌ను విజయవాడలోని ఎన్ఐఏ కోర్టు కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ... సీఎం వైఎస్ జగన్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఎన్ఐఏను ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. ఇదే కేసుకు సంబంధించి విశాఖలోని ఎన్ఐఏ కోర్టులో జరుగుతున్న తదుపరి చర్యలన్నింటినీ 8 వారాలపాటు నిలిపివేసిన హైకోర్టు, విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

దర్యాప్తు లోపాలను ప్రత్యేక కోర్టు దృష్టికి తీసుకెళ్లిన జగన్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో 2018 అక్టోబర్ 25న విశాఖ విమానాశ్రయంలో ఆయనపై జనుపల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తి హత్యాయత్నం చేశారు. పదునైన కత్తితో జగన్ మెడపై దాడికి ప్రయత్నించారు. జగన్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ఆయన ఎడమ చేతికి గాయమైంది. ఈ ఘటనను తేలిక చేస్తూ అప్పటి సీఎం చంద్రబాబు, డీజీపీ ఠాకూర్ మీడియా సమావేశాలు నిర్వహించారు. కాగా.. ఈ ఘటనపై హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్ఐఏ దర్యాప్తు చేపట్టి చార్జిషీట్ దాఖలు చేసింది. జగన్‌ను చంపడమే శ్రీనివాసరావు ఉద్దేశమని, అందుకే మెడపై కత్తితో దాడికి ప్రయత్నించాడని ఎన్ఐఏ చార్జిషీట్‌లో పేర్కొంది. ముందస్తు పథకంలో భాగంగానే శ్రీనివాసరావు కోడి కత్తి సంపాదించాడని, అదును చూసి జగన్‌పై దాడి చేశాడని వివరించింది. దీని వెనుక ఉన్న కుట్ర, ప్రేరణ వ్యవహారాన్ని కూడా తదుపరి దర్యాప్తులో తేలుస్తామని ప్రత్యేక కోర్టుకు ఎన్ఐఏ వివరించింది. కానీ.. ఎన్ఐఏ కుట్ర కోణంపై దృష్టి సారించలేదు. ఎవరి ప్రేరణతో శ్రీనివాసరావు హత్యాయత్నానికి పాల్పడ్డారో తేల్చలేదు. ఈ నేపథ్యంలో తనపై హత్యాయత్నం ఘటన వెనుక ఉన్న కుట్రపై లోతైన దర్యాప్తు జరిపేలా ఎన్ఐఏను ఆదేశించాలని కోరుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఏడాది ఏప్రిల్‌లో విజయవాడలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్ఐఏ దర్యాప్తులో లోపాలను కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. శ్రీనివాసరావు వెనుక ఎవరు ఉన్నారన్న విషయాన్ని కూడా ఎన్ఐఏ తేల్చలేదని కోర్టుకు వివరించారు. దీనిపై విచారణ జరిపిన విజయవాడ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు పిటిషన్‌ను కొట్టేస్తూ ఈ ఏడాది జూలై 25న తీర్పు వెలువరించింది. దీనిని సవాల్ చేస్తూ వైఎస్ జగన్ తరఫున న్యాయవాది టి.నాగార్జునరెడ్డి గత వారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. దీనిపై జస్టిస్ శ్రీనివాసరెడ్డి మంగళవారం విచారణ జరిపారు.

పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తాం: ఎన్ఐఏ

వాదనలు విన్న న్యాయమూర్తి దీనిపై ఎన్ఐఏ వైఖరి ఏమిటని ప్రశ్నించారు. ఎన్ఐఏ తరఫున హాజరైన డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) ఎస్.హరినాథ్ వాదనలు వినిపిస్తూ.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పారు. దీంతో న్యాయమూర్తి ఎన్ఐఏ, నిందితుడు శ్రీనివాసరావుకు నోటీసులు జారీ చేశారు. కౌంటర్ దాఖలు చేయాలని ఎన్ఐఏను ఆదేశించారు. కాగా.. న్యాయవాది నిరంజన్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ.. విశాఖపట్నం ఎన్ఐఏ కోర్టు జగన్‌మోహన్‌రెడ్డిని సాక్ష్యం చెప్పాలని ఒత్తిడి చేస్తోందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో న్యాయమూర్తి విశాఖ ప్రత్యేక కోర్టులో జరుగుతున్న సెషన్స్ కేసు (ఎస్‌జీ) 5/2023కు సంబంధించి తదుపరి చర్యలన్నింటినీ 8 వారాల పాటు నిలుపుదల చేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పరిధి లేకున్నా విజయవాడ కోర్టు ఉత్తర్వులిచ్చింది

సీఎం వైఎస్ జగన్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రత్యేక కోర్టులో ఎన్ఐఏ చార్జిషీట్ దాఖలు చేసిందన్నారు. తదుపరి దర్యాప్తులో అన్ని విషయాలు తేలుస్తామని చార్జిషీట్‌లో పేర్కొన్న ఎన్ఐఏ ఆ తరువాత ఎలాంటి దర్యాప్తు చేయలేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కుట్ర కోణం గురించి అసలు పట్టించుకోలేదన్నారు. ఈ దృష్ట్యా కుట్ర కోణంపై లోతైన దర్యాప్తు జరిపేలా ఎన్ఐఏను ఆదేశించాలని కోరుతూ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలోని ఎన్ఐఏ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారని వివరించారు. అయితే, ప్రత్యేక కోర్టు ఈ పిటిషన్‌ను కొట్టేస్తూ ఈ ఏడాది జూన్ 25న ఉత్తర్వులిచ్చిందన్నారు. వాస్తవానికి రాష్ట్రంలో ఎన్ఐఏ కోర్టు పరిధిని నిర్ణయిస్తూ కేంద్ర హోంశాఖ ఈ ఏడాది జూలై 21న నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. దీని ప్రకారం ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలు విశాఖపట్నం ఎన్ఐఏ కోర్టు పరిధిలోకి వస్తాయన్నారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసును విచారించే పరిధి విశాఖపట్నం ఎన్ఐఏ కోర్టుకు మాత్రమే ఉందని వివరించారు. విచారణ పరిధి లేకపోయినప్పటికీ విజయవాడ కోర్టు ఈ పిటిషన్‌పై విచారణ జరిపిందని, అందువల్ల విజయవాడ కోర్టు ఉత్తర్వులు చెల్లవన్నారు. చట్ట ప్రకారం పరిధి ఉన్న ప్రత్యేక కోర్టు మాత్రమే విచారణ జరపాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

బాబుకు రోజుకు ఒక లీగల్ ములాఖత్

సాధారణ ఖైదీలకు ఇబ్బందుల దృష్ట్యా ఒకటి తగ్గించిన జైలు అధికారులు

సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంద్రబాబుకు లీగల్ ములాఖత్‌లు తగ్గిస్తూ జైలు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు రోజుకు రెండు లీగల్ ములాఖత్‌లు ఉండేవి. వాటిని ఒకటికి కుదించారు. 'రోజుకు రెండు ములాఖత్‌ల వల్ల సాధారణ ఖైదీలు ఇబ్బందులు పడుతున్నారు. చంద్రబాబు వీఐపీ ఖైదీ కావడంతో స్నేహ బ్లాక్ నుంచి అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌కు తీసుకువచ్చి, తిరిగి బ్యారక్‌కు తీసుకువెళ్లే వరకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో మిగిలిన ఖైదీలను ఆస్పత్రికి, కోర్టులకు తీసుకువెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కోర్టులో ఖైదీలను హాజరుపరిచేందుకు ఆలస్యమవుతోంది. అందువల్లే ఒక ములాఖత్ రద్దు చేస్తున్నాము.' అని జైలు అధికారులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వారానికి రెండుసార్లు కుటుంబ సభ్యుల ములాఖత్‌లు, రోజూ ఒక లీగల్ ములాఖత్ యథావిధిగా అనుమతించనున్నట్లు వెల్లడించారు. అయితే, చంద్రబాబు లీగల్ ములాఖత్‌లకు ఎప్పటిలాగే అనుమతివ్వాలని జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్‌ను టీడీపీ నేతలు కలిసి వినతిపత్రం సమర్పించారు. బాబు భద్రత, వైద్య నివేదికలు కుటుంబ సభ్యులకు ఇవ్వాలని కోరారు. కాగా, 'స్కిల్' కేసును సీబీఐతో విచారణ జరిపించాలని హైకోర్టును ఆశ్రయించిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌పై టీడీపీ నాయకుడు పట్టాభి పలు ఆరోపణలు చేశారు.

'కిలారు' డుమ్మా

రెండో రోజు విచారణకు లోకేశ్ ఆదేశాలతోనే గైర్హాజరు

దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు 'దసరా' వేషాలు!



సాక్షి, అమరావతి: ఊహించిందే జరుగుతోంది! స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు కుట్రలకు తెర తీసిన టీడీపీ.. కీలక సాక్షులను ప్రభావితం చేస్తోంది. ఈ స్కామ్‌లో అక్రమ నిధుల తరలింపులో కీలక పాత్రధారిగా ఉన్న లోకేశ్ సన్నిహితుడు కిలారు రాజేశ్ సీఐడీ దర్యాప్తునకు డుమ్మా కొట్టడమే దీనికి నిదర్శనం. తాడేపల్లిలో సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కార్యాలయంలో సోమవారం విచారణకు హాజరైన ఆయన రెండో రోజు మంగళవారం మాత్రం ముఖం చాటేశారు. సిట్ అధికారులు తనను ఎన్నిసార్లు పిలిచినా విచారణకు వస్తానంటూ నమ్మబలికిన కిలారు రాజేశ్ రెండో రోజు మాత్రం గైర్హాజరయ్యాడు. తాను ప్రస్తుతం విచారణకు రాలేనని, దసరా తరువాత వస్తానంటూ ఈ మెయిల్ పంపడం గమనార్హం.

తొలుత పరారై..

టీడీపీ హయాంలో జరిగిన కుంభకోణాల్లో నారా లోకేశ్, కిలారు రాజేశ్ ప్రధాన పాత్ర పోషించినట్లు సీఐడీ ఇప్పటికే గుర్తించింది. అదే విషయాన్ని సీఐడీ అదనపు డీజీ సంజయ్ ప్రకటించడంతో ఆందోళనకు గురైన మాజీ సీఎం చంద్రబాబు వెంటనే అజ్ఞాతంలోకి వెళ్లాలని కిలారు రాజేశ్‌ను ఆదేశించారు. దీంతో ఆయన చాలా రోజులు అదృశ్యమయ్యారు. చంద్రబాబు మాజీ పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షెల్ కంపెనీల ప్రతినిధి మనోజ్ పార్థసాని అప్పటికే విదేశాలకు పరారు కావడం గమనార్హం. చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ సీఐడీ తరఫు న్యాయవాదులు ఇదే వ్యవహారాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. కేసు దర్యాప్తును చంద్రబాబు ప్రభావితం చేస్తున్నారని, సాక్షులను బెదిరిస్తున్నారని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు.

అనివార్యంగా హాజరు..

అనివార్యంగా హాజరు కావాల్సి రావడంతో సోమవారం సిట్ కార్యాలయానికి వచ్చిన కిలారు రాజేష్ విచారణకు ఏమాత్రం సహకరించలేదు. కీలక ఆధారాలను ప్రదర్శిస్తూ సిట్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించడంతో బెంబేలెత్తారు. ప్రధానంగా బ్యాంకు లావాదేవీలు, కాంట్రాక్టులకు సంబంధించిన పత్రాల గురించి సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ప్రస్తుతం అవి తనవద్ద లేవని, ఇంట్లో ఉన్నాయని, సమయం ఇస్తే వాటిని తెస్తానని చెప్పిన కిలారు రాజేశ్ మర్నాడు పత్తా లేకుండా పోవడం గమనార్హం.

లోకేశ్ వార్నింగ్‌తో మళ్లీ అజ్ఞాతంలోకి

స్కిల్ స్కామ్‌లో నిధుల మళ్లింపుపై సిట్ కీలక ఆధారాలను సేకరించినట్లు గుర్తించిన లోకేశ్, ఆయన న్యాయ నిపుణుల బృందం కిలారు రాజేశ్ వరుసగా రెండో రోజు విచారణకు హాజరైతే మరిన్ని ఆధారాలు వెలుగు చూడటం ఖాయమని ఆందోళన చెందింది. సిట్ అధికారులు అడిగిన పత్రాలను ఇవ్వొద్దని, రెండో రోజు విచారణకు హాజరుకావొద్దని అతడిని లోకేశ్ ఆదేశించినట్లు సమాచారం. కేసు విచారణకు ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించవద్దని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని లోకేష్ హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో దసరా తరువాత మాత్రమే విచారణకు వస్తానంటూ మెయిల్ పంపిన కిలారు మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉంటూనే సాక్షులను ఈ స్థాయిలో బెదిరిస్తున్న చంద్రబాబు బెయిల్‌పై బయటకు వస్తే ఈ కేసులో కీలక సాక్షులను మరింత ఒత్తిడికి గురి చేసిదర్యాప్తును పూర్తిగా పక్కదారి పట్టించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. కిలారు రాజేశ్ గైర్హాజరును న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తున్నారు.

మాపై సీఐడీ కేసు కొట్టేయండి

- మార్గదర్శి షేర్లు అక్రమంగా బదలాయించారని సీఐడీ నమోదు చేసిన కేసులో హైకోర్టును ఆశ్రయించిన రామోజీ, శైలజాకిరణ్
- వేర్వేరుగా పిటిషన్‌ల దాఖలు
- విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి : తమపై సీఐడీ తాజాగా నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ ఈనాడు అధినేత చెరుకూరి రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్సియర్స్ ఎండీ చెరుకూరి శైలజా కిరణ్ హైకోర్టును ఆశ్రయించారు. రామోజీరావు తమను తుపాకీతో బెదిరించి, సంతకాలు ఫోర్జరీ చేసి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో తమకున్న షేర్లను ఆయన కోడలు, మార్గదర్శి ఎండీ అయిన శైలజా కిరణ్ పేరు మీద అక్రమంగా బదలాయించుకున్నారని మార్గదర్శి ఫైనాన్సియర్స్‌లో వాటాదారు అయిన జీజే రెడ్డి కుమారుడు యూరి రెడ్డి సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. యూరి రెడ్డి ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు ఉండటంతో సీఐడీ అధికారులు రామోజీరావు ఏ1గా, శైలజా కిరణ్ ఏ2గా కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలంటూ రామోజీరావు, శైలజా కిరణ్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం విచారణ జరిపారు. రామోజీరావు, శైలజా కిరణ్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, నాగముత్తు, హైకోర్టు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు హాజరయ్యారు. సీఐడీ తరఫున స్పెషల్ పీపీ వై.శివకల్పనారెడ్డి వాదనలు వినిపించారు. ఈ వ్యాజ్యాలు మొదటిసారి విచారణకు వస్తున్నందున కేసు పూర్తి వివరాలను తెలుసుకుని, వాటిని కోర్టు ముందుంచాల్సి ఉందని, అందువల్ల విచారణను గురువారానికి వాయిదా వేయాలని శివకల్పనారెడ్డి కోరారు. లూథ్రా జోక్యం చేసుకుంటూ.. ఈలోపు పిటిషనర్లను అరెస్టు చేసే అవకాశం ఉందన్నారు. ఈలోపు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వాలని పోసాని వెంకటేశ్వర్లు కోరారు. ఇందుకు న్యాయమూర్తి స్పందిస్తూ.. ఈలోపు పిటిషనర్ల విషయంలో కఠిన చర్యలేవైనా తీసుకోబోతున్నారా.. అని శివకల్పనారెడ్డిని ప్రశ్నించారు. ఈలోపు ఎలాంటి కోర్టు ఉత్తర్వులు అవసరం లేదని, పూర్తి వివరాలు కోర్టు ముందుంచుతామని శివకల్పనారెడ్డి చెప్పారు. బుధవారం వరకు కఠిన చర్యలు తీసుకోబోమంటే విచారణను వాయిదా వేస్తానని న్యాయమూర్తి తెలిపారు. దీంతో అప్పటి వరకు పిటిషనర్లపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోబోమని శివకల్పనారెడ్డి చెప్పారు. దీనిని రికార్డ్ చేసిన న్యాయమూర్తి తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

రామోజీ మా సంతకాలు ఫోర్జరీ చేశారు..

▶ మొదటి పేజీ తరువాయి

మాకున్న 288 షేర్లను ఆయన కోడలు, మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్‌కు బదలాయించుకున్నారు' అని మార్గదర్శి చిట్‌ఫండ్స్ సహ వ్యవస్థాపకుడు జీజే రెడ్డి కుమారుడు యూరి రెడ్డి చెప్పారు. తమ షేర్లను అక్రమంగా బదిలీ చేసి రామోజీ మోసానికి పాల్పడ్డారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని సీఐడీని, న్యాయస్థానాన్ని కోరారు. యూరిరెడ్డి మంగళవారం తన న్యాయవాది శివరామిరెడ్డితో కలిసి విజయవాడలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రామోజీరావు ఏ విధంగా తమ షేర్లను అక్రమంగా బదలాయించుకున్నదీ వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

తుపాకితో బెదిరించి..

మా తండ్రి జీజే రెడ్డి చనిపోయిన తరువాత మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో మా అన్నయ్య మార్టిన్ రెడ్డి, నేను మా వాటా షేర్ల కోసం ఎన్నో ఏళ్లు రామోజీరావును సంప్రదించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరికి 2016లో హైదరాబాద్‌లో ఆయన్ని కలిశాము. మాకు డివిడెండ్ కింద చెక్ ఇచ్చారు. ఆ తరువాత మా షేర్లపై సర్టిఫికెట్ అడిగితే ఓ ప్రత్యేక గదిలోకి తీసుకెళ్లారు. మమ్మల్ని లోపల ఉంచి తలుపులు వేసేశారు. చాలాసేపటి తరువాత రామోజీరావు వచ్చి ఖాళీ స్టాంపు పేపర్లు ముందు పెట్టారు. వాటిపై సంతకాలు చేయమన్నారు. మేము నిరాకరించడంతో మా తలలకు తుపాకి గురిపెట్టి 'సంతకాలు పెడతారా లేదా.. మిమ్మల్ని కాపాడేవారు ఎవరూ లేరు ఇక్కడ' అని బెదిరించారు. అది ఆయన సామ్రాజ్యం. అంతా ఆయన మనుషులే. మా బాధ చెప్పుకునేందుకు కూడా ఎవరూ లేరు. ఆ సమయంలో అక్కడి నుంచి ప్రాణాలతో బయట పడతామనుకోలేదు. కేవలం ప్రాణాలు కాపాడుకునేందుకే ఆ ఖాళీ స్టాంపు పేపర్లపై సంతకాలు చేసి బయటకు వచ్చాం. షేర్ల బదిలీకి మేము అంగీకరించలేదు. షేర్ల బదిలీ ప్రక్రియ పూర్తి చేయలేదు. రామోజీరావు మాకు ఇచ్చిన చెక్‌ను కూడా నగదుగా మార్చుకోలేదు.

చట్ట ప్రకారం ఇది చెల్లదు

కంపెనీల చట్టం ప్రకారం ఏదైనా షేర్ల బదిలీ ప్రక్రియ పూర్తి కావాలంటే మూడు అంశాలు తప్పనిసరి. ప్రతిపాదన (ఆఫర్), ఆమోదం (యాక్సెప్టెన్సీ), ప్రతిఫలం బదిలీ (కన్సిడరేషన్) తప్పనిసరి. మా షేర్ల బదిలీ విషయంలో ఆ మూడూ జరగలేదు. షేర్లు బదిలీ చేస్తామని మేము చెప్పలేదు. అందువల్ల ప్రతిపాదనే లేదు. రామోజీరావు కోరినా మేము ఆమోదించలేదు. అందువల్ల యాక్సెప్టెన్సీ లేదు. మా షేర్ల బదిలీకి ప్రతిఫలంగా మాకు ఎలాంటి ఆర్థిక ప్రతిఫలమూ దక్కలేదు. కాబట్టి మేము షేర్లు విక్రయించామన్న రామోజీరావు వాదన చెల్లదు. ఆయన వాదన పూర్తిగా అబద్ధం, మోసపూరితం. మా తండ్రికి చేతి అప్పుగా ఇచ్చిన దానికి ప్రతిఫలంగానే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో పెట్టుబడి నిధిని సమకూర్చారని రామోజీరావు ముందుగా బుకాయించారు. చేతి అప్పు తీర్చాలి అంటే నగదు ఇస్తారు గానీ కంపెనీలో పెట్టుబడి పెడతారా.. అని మేము ప్రశ్నిస్తే రామోజీరావు సరైన సమాధానం ఇవ్వలేదు.

మూలధన నిధి ఏపీ నుంచే వచ్చింది కాబట్టి..

మా తండ్రి జీజే రెడ్డి కృష్ణా జిల్లాలోని తన వ్యవసాయ భూమి ద్వారా వచ్చిన ఆదాయాన్నే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో పెట్టుబడిగా పెట్టారు. అంటే మూలధన నిధిని ఏపీ నుంచే సమీకరించారు. ఆ పెట్టుబడితోనే మా పేరిట 288 షేర్లు వచ్చాయి. ఆ షేర్లనే రామోజీరావు ఆయన కోడలు శైలజాకిరణ్ పేరిట అక్రమంగా బదిలీ చేశారు. అందుకే ఈ కేసు ఏపీకి సంబంధించినదని న్యాయ నిపుణులు చెప్పారు. దాంతోనే ఏపీ సీఐడీకి ఫిర్యాదు చేశాం. మాకు జరిగిన అన్యాయంపై సీఐడీని సంప్రదించాం. సీఐడీ, న్యాయస్థానం మా ఆవేదనను గుర్తించి న్యాయం చేస్తాయని విశ్వసిస్తున్నాం.

శైలజ పేరిట అప్పుడు 100 షేర్లే..

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజాకిరణ్ పేరిట 2017 వరకు 100 షేర్లే ఉన్నాయి. జీజే రెడ్డి పేరిట మాత్రం 288 షేర్లు ఉన్నాయి. జీజే రెడ్డి షేర్లను అక్రమంగా బదిలీ చేసిన తరువాత ప్రస్తుతం శైలజా కిరణ్ పేరిట 388 షేర్లు ఉన్నాయి.

ఆరుగురిలో ఐదుగురు రామోజీ కుటుంబ సభ్యులే

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో ఆరుగురు షేర్ హోల్డర్లే ఉన్నారు. ఎందుకంటే ఆ సంస్థ ఏనాడూ పబ్లిక్ ఇష్యూ జారీ చేయలేదు. ఉన్న ఆరుగురు షేర్ హోల్డర్లలో అయిదుగురు రామోజీరావు కుటుంబ సభ్యులే. జీజే రెడ్డి ఒక్కరే బయట వ్యక్తి. ఆయన పేరిట ఉన్న షేర్లను కూడా అక్రమంగా శైలజాకిరణ్ పేరిట బదిలీ చేశారు. ఆ అక్రమ వ్యవహారానికి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లోని ఇతర షేర్ హోల్డర్లు.. అంటే రామోజీ కుటుంబ సభ్యులు సహకరించారు.

ఫోర్జరీ సంతకాలతో షేర్ల బదిలీ.. ఆర్‌వోసీకి ఫిర్యాదు

మేము సమ్మతించకపోయినా, చెక్‌ను నగదుగా మార్చుకోకపోయినా మా వాటా 288 షేర్లను రామోజీరావు ఆయన కోడలు శైలజాకిరణ్ పేరిట అక్రమంగా బదిలీ చేశారని 2017లో గుర్తించాం. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌వోసీ)కి వెళ్లి సంబంధిత పత్రాలను పరిశీలిస్తే అసలు విషయం తెలిసింది. పలు పత్రాల్లో మా సంతకాలను ఫోర్జరీ చేశారు. దీనిపై అప్పట్లోనే ఆర్‌వోసీకి ఫిర్యాదు చేశాను.

సీఐడీ దర్యాప్తుతో ధైర్యం వచ్చి..

రామోజీరావు తుపాకీతో బెదిరించారని కొందరికి మా ఆవేదన చెప్పుకున్నా అప్పట్లో ఫలితం లేకపోయింది. దాంతో ఫిర్యాదు చేసేందుకు ధైర్యం సరిపోలేదు. ఆయన రాజకీయ పరపతి ఎలాంటిదో అందరికీ తెలిసిందే. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల సొమ్ము అక్రమ పెట్టుబడులకు మళ్లించిన వ్యవహారంలో ఏపీ సీఐడీ రామోజీ, ఇతరులపై కేసు నమోదు చేసింది. సోదాలు నిర్వహిస్తోంది. దాంతో మాకు ధైర్యం వచ్చింది. అందుకే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో మా షేర్లను అక్రమంగా బదిలీ చేసుకున్నారని సీఐడీకి కొన్ని నెలల క్రితం ఫిర్యాదు చేశాము. సీఐడీ అధికారులు నాలుగైదు నెలలపాటు మా ఫిర్యాదును పరిశీలించారు. ఆధారాలు తెమ్మన్నారు. మేము ఇచ్చిన ఆధారాలను పరిశీలించారు. మా ఫిర్యాదు సరైనదే అని నిర్ధారించుకున్న తరువాతే కేసు నమోదు చేశారు.



జ్వరం బారిన పాక్ జట్టు!

భారత్ చేతిలో భారీ ఓటమినుంచి కోలుకొని తర్వాతి మ్యాచ్‌కు సిద్ధమవుతున్న పాకిస్తాన్ జట్టుకు కొత్త సమస్య వచ్చి పడింది. ఆ జట్టులోని పలువురు ఆటగాళ్లు వైరల్ ఫీవర్ బారిన పడ్డారు. ఆదివారం బెంగళూరుకు చేరుకున్న రోజునుంచే ఆటగాళ్లు అనారోగ్యానికి గురయ్యారు. వీరిలో బాబర్ ఆజమ్, షాహీన్ అఫ్రిది పరిస్థితి మెరుగు పడగా...సౌద్ షకీల్, జమాన్ ఖాన్, ఉసామా మీర్ పూర్తిగా కోలుకోలేదు. అన్నింటికి మించి కీలక బ్యాటర్, ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ జ్వరం, ఫ్లూతో ఇంకా తన గదిలోనే క్వారంటైన్‌లో ఉండటం పాక్‌ను ఆందోళనకు గురి చేస్తోంది. ఆటగాళ్లందరూ వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నారని పీసీబీ వెల్లడించింది. బెంగళూరులో గత కొంత కాలంగా వైరల్ ఫీవర్ తీవ్రత చాలా ఎక్కువగా ఉండగా... పాక్ క్రికెటర్లలో ఎవరికీ డెంగీ లక్షణాలు లేకపోవడం ఆ జట్టుకు కాస్త ఊరట. శుక్రవారం జరిగే పోరులో ఆస్ట్రేలియాతో పాకిస్తాన్ తలపడుతుంది.

'సఫారీ'కి డచ్ దెబ్బ


మిల్లర్‌ను బౌల్డ్ చేసిన వాన్ బీక్ ఉద్వేగం



- సంచలన విజయం సాధించిన నెదర్లాండ్స్
- 38 పరుగులతో ఓడిన దక్షిణాఫ్రికా
- ఎడ్వర్డ్స్ మెరుపు బ్యాటింగ్
- బౌలర్ల సమష్టి ప్రదర్శన

దాదాపు ఏడాది క్రితం...టి20 ప్రపంచకప్‌లో ఈ రెండు జట్ల మధ్యే మ్యాచ్...అనూహ్య ప్రదర్శనతో దక్షిణాఫ్రికాను నెదర్లాండ్స్ కంగుతినిపించింది. దీంతో ఈ మ్యాచ్‌పై ఆసక్తి నెలకొన్నప్పటికీ దక్షిణాఫ్రికా సూపర్ ఫామ్‌తో వార్ వన్‌సైడ్‌గా భావించారు.. నెదర్లాండ్స్ 27 ఓవర్లలో 112/6 స్కోరు చేయడం చూస్తే అందరూ అనుకున్నట్లే జరుగుతున్నట్లే అనిపించింది. అయితే ఇక్కడే సీన్ మారింది. మరో సంచలనానికి నాంది పలికే ఇన్నింగ్స్‌తో నాయకుడు ఎడ్వర్డ్స్ నడిపించాడు. తర్వాతి 16 ఓవర్లలో మరో 133 పరుగులు జోడించాడు. సారథి పడిన కష్టానికి, చేసిన పోరాటానికి న్యాయం చేసేందుకు బౌలర్లంతా శ్రమించడం పెను సంచలనానికి దారి తీసింది.

ధర్మశాల: ప్రపంచ కప్‌లో నెదర్లాండ్స్ సంచలన విజయాన్ని అందుకుంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో 38 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. వర్షం కారణంగా ఆట ఆలస్యంగా ప్రారంభం కావడంతో మ్యాచ్‌ను 43 ఓవర్లకు కుదించారు. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన నెదర్లాండ్స్ 43 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 245 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (69 బంతుల్లో 78 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటం చేశాడు. అనంతరం సులువైన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా 42.5 ఓవర్లలో 207 పరుగులకే ఆలౌటైంది. డేవిడ్ మిల్లర్ (52 బంతుల్లో 43; 4 ఫోర్లు, 1 సిక్స్), కేశవ్ మహరాజ్ (37 బంతుల్లో 40; 5 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు.

ఎడ్వర్డ్స్ కెప్టెన్ ఇన్నింగ్స్

రబడ, జాన్సెన్, ఇన్‌గిడిల బౌలింగ్‌కు నెదర్లాండ్స్ టాపార్డర్ బదులివ్వలేకపోయింది. విక్రమ్‌జీత్ (2), ఒడౌడ్ (18), అకెర్మన్ (12), బస్ డి లీడ్ (2), సైబ్రాండ్ (19), తేజ (20)... ఇలా ఎవరూ ఎక్కువ సేపు నిలబడలేదు. అయితే కెప్టెన్ ఎడ్వర్డ్స్ కనబరిచిన పోరాటం సంచలనానికి ఓ మెట్టు వేసింది. వాన్‌డెర్ మెర్వ్ (29)తో 8వ వికెట్‌కు 64 పరుగులు, ఆర్యన్ దత్ (23 నాటౌట్)తో అబేధ్యమైన 9వ వికెట్‌కు 41 పరుగులు ఎడ్వర్డ్స్ జతచేశాడు.

సఫారీ విలవిల

ఆడేది సులువైన ప్రత్యర్థితో, ఎదురుగా ఉన్నది స్వల్ప లక్ష్యమే కానీ సఫారీ వల్ల అసాధ్యమైంది. నెదర్లాండ్ బౌలర్లు వాన్ డెర్ మెర్వ్, అకెర్మన్, మెకెరన్, వాన్ బీక్, డి లీడే కలిసికట్టుగా పిడికిలి బిగించడంతో...డి కాక్ (20), కెప్టెన్ బవుమా (16), హిట్టర్లు డసెన్ (4), మార్క్‌రమ్ (1) చేతులెత్తేశారు. 89 పరుగులకే 5 వికెట్లు కోల్పోయాక మిల్లర్ కొద్దిగా పోరాడాడు. చివర్లో కేశవ్ దూకుడుగా ఆడినా అప్పటికే ఆలస్యమైంది.

స్కోరు వివరాలు

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జీత్ (సి) క్లాసెన్ (బి) రబడ 2; మ్యాక్స్ ఒడౌడ్ (సి) డికాక్ (బి) జాన్సెన్ 18; అకెర్మన్ (బి) కొయెట్జీ 12; బస్ డి లీడ్ (ఎల్బీ) (బి) రబడ 2; సైబ్రాండ్ (సి) జాన్సెన్ (బి) ఎన్‌గిడి 19; తేజ (ఎల్బీ) (బి) జాన్సెన్ 20; ఎడ్వర్డ్స్ నాటౌట్ 78; వాన్ బీక్ (స్టంప్డ్) డికాక్ (బి) కేశవ్ 10; వాన్‌డర్ మెర్వ్ (సి) డికాక్ (బి) ఎన్‌గిడి 29; ఆర్యన్ దత్ నాటౌట్ 23; ఎక్స్‌ట్రాలు 32; **మొత్తం (43 ఓవర్లలో 8 వికెట్లకు) 245. వికెట్ల పతనం:** 1-22, 2-24, 3-40, 4-50, 5-82, 6-112, 7-140, 8-204. **బౌలింగ్:** ఎన్‌గిడి 9-1-57-2, జాన్సెన్ 8-1-27-2, రబడ 9-1-56-2, కొయెట్జీ 8-0-57-1, కేశవ్ 9-0-38-1. **దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్:** బవుమా (బి) వాన్ డెర్ మెర్వ్ 16; డికాక్ (సి) ఎడ్వర్డ్స్ (బి) అకెర్మన్ 20; వాన్‌డెర్ డసెన్ (సి) ఆర్యన్ (బి) వాన్ డెర్ మెర్వ్ 4; మార్క్‌రమ్ (బి) వాన్ మెకెరన్ 1; క్లాసెన్ (సి) విక్రమ్‌జీత్ (బి) వాన్ బీక్ 28; మిల్లర్ (బి) వాన్ బీక్ 43; జాన్సెన్ (బి) వాన్ మెకెరన్ 9; కొయెట్జీ (సి) ఎడ్వర్డ్స్ (బి) డి లీడ్ 22; కేశవ్ (సి) ఎడ్వర్డ్స్ (బి) వాన్ బీక్ 40; రబడ (సి) సైబ్రాండ్ (బి) డి లీడ్ 9; ఎన్‌గిడి నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (42.5 ఓవర్లలో ఆలౌట్) 207. వికెట్ల పతనం:** 1-36, 2-39, 3-42, 4-44, 5-89, 6-109, 7-145, 8-147, 9-166, 10-207. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 5-1-19-0, వాన్ బీక్ 8.5-0-60-3, అకెర్మన్ 3-0-16-1, పాల్ మెకెరన్ 9-0-40-2, వాన్ డెర్ మెర్వ్ 9-0-34-2, బాస్ డి లీడ్ 8-0-36-2.

11 బంతుల్లో అర్ధ సెంచరీ!

- రైల్వేస్ ఆటగాడు అశుతోష్ రికార్డు
- ముస్తాక్ అలీ టి20 ట్రోఫీ


అశుతోష్

రాంచీ: దేశవాళీ టి20 టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలో మంగళవారం కొత్త రికార్డు నమోదైంది. రైల్వేస్ బ్యాటర్ అశుతోష్ శర్మ 11 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించి టి20 క్రికెట్‌లో భారత్ తరఫున కొత్త రికార్డు నమోదు చేశాడు. 2007 టి20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై యువరాజ్ సింగ్ 12 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన రికార్డు దీంతో కనుమరుగైంది. బలహీన జట్టయిన అరుణాచల్‌ప్రదేశ్‌తో జరిగిన పోరులో అశుతోష్ 8 సిక్సర్లు, 1 ఫోర్‌తో అర్ధ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. 11వ బంతికి బౌండరీతో 53 పరుగులకు చేరుకున్న అతను తర్వాతి బంతికే నిష్క్రమించాడు. 25 ఏళ్ల అశుతోష్ కెరీర్‌లో రైల్వేస్ తరఫున ఇది రెండో టి20 మ్యాచ్ కాగా, నాలుగేళ్ల క్రితం వరకు అతను 8 టి20ల్లో మధ్యప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. కెరీర్‌లో ఒకే ఒక్క దేశవాళీ వన్డే ఆడిన అతను ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇంకా అరంగేట్రం చేయలేదు. ఈ మ్యాచ్‌లో రైల్వేస్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 246 పరుగులు చేయగా, అరుణాచల్ ప్రదేశ్ 18.1 ఓవర్లలో119 పరుగులకు ఆలౌటై 127 పరుగుల తేడాతో చిత్తయింది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డు గత నెల 27న నేపాల్ బ్యాటర్ దీపేంద్ర సింగ్ నమోదు చేశాడు. అతను 9 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు.

హైదరాబాద్ విజయం

జైపూర్: టోర్నీలో హైదరాబాద్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 8 వికెట్ల తేడాతో జమ్ము కశ్మీర్‌ను ఓడించింది. ముందుగా కశ్మీర్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. శుభమ్ పండిర్ (47 బంతుల్లో 58; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్‌స్కోరర్. అనంతరం హైదరాబాద్ 18.3 ఓవర్లలో 2 వికెట్లకు 160 పరుగులు చేసింది. కెప్టెన్ తిలక్‌వర్మ (43 బంతుల్లో 58 నాటౌట్) అర్ధ సెంచరీ చేయగా...రోహిత్ రాయుడు (28 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాహుల్ సింగ్ (27 బంతుల్లో 35 నాటౌట్; 2 ఫోర్లు) రాణించారు.

పంజాబ్ 'రికార్డు' విజయం

ఆంధ్రకు మరో ఓటమి


రికీ భుయ్

రాంచీ: రికీ భుయ్ (52 బంతుల్లో 104 నాటౌట్; 6 ఫోర్లు, 9 సిక్స్‌లు) దూకుడుగా ఆడి సెంచరీ సాధించినా...ఇతర బ్యాటర్ల వైఫల్యంతో ఆంధ్ర జట్టుకు ఓటమి తప్పలేదు. ఈ మ్యాచ్‌లో పంజాబ్ 105 పరుగుల తేడాతో ఆంధ్రపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 275 పరుగులు చేసింది. ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో ఇదే అత్యధిక స్కోరు కాగా...ఓవరాల్‌గా టి20 క్రికెట్‌లో ఇది నాలుగో అత్యధిక స్కోరు. అభిషేక్ శర్మ (51 బంతుల్లో 112; 9 ఫోర్లు, 9 సిక్స్‌లు), అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (26 బంతుల్లో 87; 6 ఫోర్లు, 9 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చారు. ఆంధ్ర 20 ఓవర్లలో 7 వికెట్లకు 170 పరుగులే చేయగలిగింది. మ్యాచ్‌లో టాప్ స్కోరర్లుగా నిలిచిన ముగ్గురు బ్యాటర్లూ తలా 9 సిక్సర్ల చొప్పున బాదడం విశేషం!

ప్రపంచకప్‌లో నేడు

న్యూజిలాండ్ X అఫ్గానిస్తాన్
వేదిక: చెన్నై

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	3	3	0	6	1.821
న్యూజిలాండ్	3	3	0	6	1.604
దక్షిణాఫ్రికా	3	2	1	4	1.385
పాకిస్తాన్	3	2	1	4	-0.137
ఇంగ్లండ్	3	1	2	2	-0.084
అఫ్గానిస్తాన్	3	1	2	2	-0.652
బంగ్లాదేశ్	3	1	2	2	-0.699
ఆస్ట్రేలియా	3	1	2	2	-0.734
నెదర్లాండ్స్	3	1	2	2	-0.993
శ్రీలంక	3	0	3	0	-1.532

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రిక్వార్టర్స్‌లో సింధు



- వాకోవర్ ఇచ్చిన సాత్విక్-చిరాగ్
- డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్

ఒడెన్స్: బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 750 టోర్నీ డెన్మార్క్ ఓపెన్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు శుభారంభం చేసింది. ప్రత్యర్థినుంచి కొంత ప్రతిఘటన ఎదురైనా చివరకు తొలి రౌండ్ అడ్డంకిని అధిగమించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు 21-14, 18-21, 21-10 స్కోరుతో కిర్‌స్టీ గిల్మర్ (స్కాట్లండ్)పై విజయం సాధించింది. 56 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో తొలి గేమ్‌ను సునాయాసంగా గెలుచుకున్న తర్వాత సింధుకు ఆ తర్వాత గిల్మర్ గట్టి పోటీనిచ్చి పోరును 1-1తో సమం చేసింది. అయితే నిర్ణాయక మూడో గేమ్‌లో సింధు తన స్థాయికి తగినట్లుగా చెలరేగింది. ఒక దశలో వరుసగా 7 పాయింట్లు సాధించి దూసుకుపోయిన భారత షట్లర్ చివరి వరకు దానిని కొనసాగించింది. మహిళల సింగిల్స్‌లో మరో భారత క్రీడాకారిణి ఆకర్షి కశ్యప్ కూడా ముందంజ వేసింది. తొలి రౌండ్‌లో ఆకర్షి 10-21, 22-20, 21-12 తేడాతో లి వైహోన్ (జర్మనీ)పై సంచలన విజయం సాధించింది. అయితే పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాడు కిడాంబి శ్రీకాంత్‌ను నిరాశ ఎదురైంది. తొలి పోరులో శ్రీకాంత్ 21-19, 10-21, 16-21తో వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా) చేతిలో ఓడి నిష్క్రమించాడు. లక్ష్య సేన్ కూడా తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. థాయిలాండ్‌కు చెందిన కంటఫాన్ వాంగ్ చరన్ 21-16, 21-18తో లక్ష్యసేన్‌పై విజయం సాధించాడు. మరో వైపు ఆసియా క్రీడల స్వర్ణపతక జోడి సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి చివరి నిమిషంలో టోర్నీనుంచి నిష్క్రమించింది. ఈ జంట వాకోవర్ ఇవ్వడంతో మలేసియా ద్వయం ఆంగ్ యు సిన్ - టియో యీ యి రెండో రౌండ్‌కు చేరింది.

సినిమా


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి పురస్కారం అందుకుంటున్న వహీదా రెహమాన్


అనురాగ్ ఠాకూర్‌తో అల్లు అర్జున్ కరచాలనం


రాజమౌళి


మాధవన్


కృతీ సనన్


ఆలియా భట్


జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో కృతీ సనన్, వహీదా రెహమాన్, పల్లవీ జోషి, ఆలియా భట్

సినిమాలు... కళాకారులు సమాజంలో మార్పుకి సారథులు

- దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకున్న వహీదా రెహమాన్
- జాతీయ అవార్డు అందుకున్న తొలి తెలుగు నటుడు అల్లు అర్జున్
- ఉత్తమ నటీమణులుగా కృతీ సనన్, ఆలియా భట్
- ఆరు జాతీయ అవార్డులు అందుకున్న 'ఆర్ఆర్ఆర్'
- ఉత్తమ తెలుగు చిత్రం అవార్డు అందుకున్న 'ఉప్పెన' దర్శక-నిర్మాతలు


దేవిశ్రీ ప్రసాద్

69వ జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము


ముర్ము నుంచి పురస్కారం అందుకుంటున్న కీరవాణి


దాసరి కల్యాణ్


కాలభైరవ


శ్రీనివాస్ మోహన్


ప్రేమ్ రక్షిత్


కింగ్ సాల్మన్


చంద్రబోస్


బుచ్చిబాబు


నవీన్ యెర్నేని


పురుషోత్తమాచార్యులు

''జాతీయ అవార్డుల ప్రదానం భారతదేశంలోని భిన్నత్వాన్నీ, అందులో అంతర్లీనంగా ఉన్న ఏకత్వాన్నీ సూచిస్తోంది. సినిమా అనేది కేవలం వ్యాపారమో, వినోదమో కాదు... శక్తిమంతమైన మాధ్యమం. ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ఉపయోగపడుతుంది. సమస్యల పట్ల సున్నితత్వాన్ని పెంచుతుంది. అర్థవంతమైన సినిమాలు సమాజంలోని, దేశంలోని సమస్యలను, విజయాలను ఆవిష్కరిస్తాయి. సినిమాలు, కళాకారులు సమాజంలో మార్పుకు సారథులు. దేశం గురించి సమాచారం అందించడంతో పాటు ప్రజల మధ్య అనుబంధం పెరగడానికి సినిమా కారణం అవుతుంది. సమాజానికి ప్రతిబింబం, మెరుగుపరిచే మాధ్యమం సినిమాయే. ప్రతిభ ఉన్న ఈ దేశంలో సినిమాతో అనుబంధం ఉన్న ప్రతిభావంతులు ప్రపంచ స్థాయిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పి, దేశ అభివృద్ధికి ముఖ్య కారణం అవుతారు'' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం జరిగిన 69వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో విజేతలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ అవార్డులు అందించారు. 2021 సంవత్సరానికిగాను దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును నటి వహీదా రెహమాన్, ఉత్తమ నటుడి అవార్డును అల్లు అర్జున్ (పుష్ప), ఉత్తమ నటి అవార్డును ఆలియా భట్ (గంగూబాయి కతియావాడి), కృతీ సనన్ (మిమి) అందుకున్నారు. ఉత్తమ చిత్రం (రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్ – హిందీ) అవార్డును దర్శకుడు ఆర్. మాధవన్, ఉత్తమ దర్శకుడిగా నిఖిల్ మహాజన్ (మరాఠీ ఫిల్మ్ – గోదావరి) అవార్డు అందుకున్నారు.

ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపికైన 'ఉప్పెన'కు దర్శకుడు బుచ్చిబాబు సన, నిర్మాత నవీన్ యెర్నేని పురస్కారాలు స్వీకరించారు. పూర్తి స్థాయి వినోదం అందించిన ఉత్తమ చిత్రం విభాగంలో 'ఆర్ఆర్ఆర్'కు నిర్మాత డీవీవీ దానయ్య తనయుడు దాసరి కల్యాణ్, దర్శకుడు రాజమౌళి అవార్డులు అందుకున్నారు. ఇదే చిత్రానికి ఉత్తమ బ్యాగ్రౌండ్ స్కోర్‌కి ఎంఎం కీరవాణి, నేపథ్య గాయకుడుగా 'కొమురం భీముడో..' పాటకు కాలభైరవ, యాక్షన్ డైరెక్షన్‌కి కింగ్ సాల్మన్, కొరియోగ్రఫీకి ప్రేమ్ రక్షిత్, స్పెషల్ ఎఫెక్ట్స్‌కి వి. శ్రీనివాస మోహన్ పురస్కారాలు అందుకున్నారు. ఇంకా ఉత్తమ సంగీతదర్శకుడిగా 'పుష్ప: ది రైజ్'కి దేవిశ్రీ ప్రసాద్, 'కొండపొలం' చిత్రంలో 'ధంధం ధం..' పాటకు గాను ఉత్తమ రచయిత అవార్డును చంద్రబోస్, ఉత్తమ సినీ విమర్శకుడిగా పురుషోత్తమాచార్యులు (తెలుగు), ఇంకా పలు భాషలకు చెందిన కళాకారులు పురస్కారాలను స్వీకరించారు. ఈ వేదికపై వహీదా గురించి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ – ''వహీదా చక్కని నటనా నైపుణ్యం, మంచి వ్యక్తిత్వంతో చిత్ర పరిశ్రమలో శిఖరాగ్రానికి చేరుకున్నారు. వ్యక్తిగత జీవితంలోనూ ఒక మహిళగా హుందాతనం, ఆత్మవిశ్వాసంతో తనదైన ముద్ర వేసుకున్నారు. మహిళా సాధికారత కోసం మహిళలే చొరవ తీసుకోవాలని సూచించేలా వహీదా ఉదాహరణగా నిలిచారు'' అన్నారు. ''ప్రపంచంలో మంచి కంటెంట్ హబ్‌గా భారత శక్తి సామర్థ్యాలను నిరూపించడానికి ఏవీజీసీ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ అండ్ కామిక్) రంగం ఉపయోగపడుతుంది'' అన్నారు అనురాగ్ ఠాకూర్.

సినిమా అనేది సమష్టి కృషి - వహీదా రెహమాన్

స్టాండింగ్ ఒవేషన్ మధ్య ఒకింత భావోద్వేగానికి గురవుతూ పురస్కారం అందుకున్న వహీదా రెహమాన్ మాట్లాడుతూ– "దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకోవడం గౌరవంగా భావిస్తున్నాను. నేనిక్కడ ఉన్నానంటే దానికి కారణం నేను భాగమైన ఈ అద్భుతమైన ఇండస్ట్రీ. అగ్రదర్శకులతో, నిర్మాతలతో, సాంకేతిక నిపుణులతో పని చేసే అవకాశం రావడం నా అదృష్టం. మేకప్ ఆర్టిస్ట్స్, హెయిర్ అండ్ కాస్ట్యూమ్ డిజైనర్స్, డైలాగ్ రైటర్స్... ఇలా అందరి గురించి ప్రస్తావించాలి. ఈ అవార్డు తాలూకు ఆనందాన్ని అన్ని సినీ శాఖలవారితో పంచుకోవాలనుకుంటున్నాను. ఏ ఒక్కరో సినిమా మొత్తాన్ని రూపొందించలేరు. సినిమా సమష్టి కృషి. ఇది పరిశ్రమ మొత్తానికి దక్కిన పురస్కారం" అన్నారు.

జాతీయ స్థాయిలో అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. కమర్షియల్ సినిమా అయిన పుష్పకు అవార్డు దక్కడం మాకు నిజంగా డబుల్ అచీవ్‌మెంట్. – అల్లు అర్జున్

* * *

ప్రేక్షకులకు నచ్చే విధంగా సినిమా తీయడం నా మొదటి లక్ష్యం. అలాంటి సినిమాలకు అవార్డులు రావడం బోనస్ లాంటిది. ముగ్గురు.. నలుగురు.. ఎంతో మంది టెక్నీషియన్లతో కలిసి చేసిన కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం... మా సినిమాకు ఆరు అవార్డులు రావడం ఆనందదాయకం. 'ఆర్ఆర్ఆర్' విడుదలైన తొలి రోజు ఎంతో ఉత్కంఠతో ఉన్న మాకు ప్రశంసలు రావడం మరచిపోలేని ఘటన. – దర్శకుడు రాజమౌళి

'ఉప్పెన' సినిమాకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం హ్యాపీగా ఉంది. నిర్మాతలు నవీన్, రవి, మా గురువు సుకుమార్ వల్లే సాధ్యమైంది. వైష్ణవ్, కృతీ, విజయ్ సేతుపతి, దేవిశ్రీ ప్రసాద్‌లకు ధన్యవాదాలు. – దర్శకుడు బుచ్చిబాబు సన

* * *


'ఆర్ఆర్ఆర్'లో పని చేయడం నాకో మంచి అవకాశం. ఇది దేవుడు ఇచ్చిన బహుమతి. రాజమౌళి నాకు గురువు. నాకింత గొప్ప అవకాశం ఇచ్చిన ఆయనకు ధన్యవాదాలు – స్టంట్ కొరియోగ్రాఫర్ కింగ్ సాల్మన్

లియో విడుదలలో మార్పు ఉండదు - సూర్యదేవర నాగవంశీ



'లియో' టైటిల్‌ని తెలుగులో ఒకరు రిజిస్టర్ చేసుకున్నారు. వారు మమ్మల్ని సంప్రదించకుండా 'లియో' టైటిల్ నాది.. సినిమా రిలీజ్ ఆపాలంటూ నేరుగా కోర్టుని ఆశ్రయించారు. టైటిల్ రిజిస్టర్ చేసుకున్నవారితో మాట్లాడుతున్నాం.. సమస్య పరిష్కారం అవుతుంది. 'లియో' సినిమా విడుదలలో ఎలాంటి మార్పు ఉండదు.. ఈ నెల 19నే తమిళంతో పాటు తెలుగులోనూ ఈ సినిమా రిలీజవుతుంది'' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు. విజయ్, త్రిష జంటగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'లియో'. లలిత్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 19న పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానుంది. ఈ చిత్రం తెలుగు హక్కులను సితార ఎంటర్‌టైన్మెంట్స్ సూర్యదేవర నాగవంశీ సొంతం చేసుకున్నారు. కాగా, ఈ చిత్రం టైటిల్‌పై వివాదం జరుగుతున్న నేపథ్యంలో విడుదల వాయిదా పడే అవకాశం ఉందనే వార్తలు ఉన్నాయి. ఈ సందర్భంగా సూర్యదేవర నాగవంశీ విలేకరులతో మాట్లాడుతూ– ''లియో' తెలుగు టైటిల్‌ని కూడా తమిళ నిర్మాతలే రిజిస్టర్ చేయించారు. సెన్సార్ కూడా పూర్తయింది కాబట్టి విడుదలకు ఎలాంటి ఆటంకం ఉండదు. ఈ సినిమా బాగుంటుందనే నమ్మకంతోనే తెలుగు హక్కులు తీసుకున్నాను'' అన్నారు.

ఆయన మాట థ్రిల్లింగ్‌గా అనిపించింది - వంశీ కృష్ణ



'టైగర్ నాగేశ్వరరావు' కథని రవితేజగారు మొదట సగం విని, 'షూటింగ్ ఉంది.. మిగతాది రేపు వింటాను' అన్నారు. కథ ఆయనకు నచ్చలేదేమో? నాకు ఫోన్ రాదేమో? అనుకున్నాను. మరుసటి రోజు ఆయన ఫోన్ చేయడంతో వెళ్లి మిగిలిన సగం కథ చెప్పాను. క్లయిమాక్స్ చెబుతున్నప్పుడే... 'జుట్టు పెద్దగా పెంచితే బాగుంటుందా? కళ్లకి లెన్స్‌పెట్టుకోనా?' అని ఆయన అన్నారు. నాకు అదొక భావోద్వేగమైన సందర్భం'' అన్నారు డైరెక్టర్ వంశీ కృష్ణ. రవితేజ హీరోగా, తెరకెక్కిన చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వంశీ కృష్ణ మాట్లాడుతూ– ''టైగర్ నాగేశ్వరరావు ఒక దొంగ అని అందరికీ తెలుసు. మరో కోణంలో మంచి మనసున్న మనిషి. ఈ రెండు కోణాలను సినిమాలో చూపించాను. 1980 నేపథ్యంలో నడిచే కథ ఇది. నా కెరీర్‌లో బడ్జెట్, స్టార్స్ పరంగా ఇది చాలా భారీ సినిమా. ఈ సినిమాలో గోదావరి బ్రిడ్జ్‌ని రీ క్రియేట్ చేసి, ట్రైన్ సీక్వెన్స్ చేయడం సవాల్‌గా అనిపించింది. ఇక షారుక్ ఖాన్'' అన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
18-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
261	80
66,428	19,812

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	13,538	▽	28
డోజోన్స్	33,981	▽	4
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,675	▲	45
డాక్స్	15,252	▲	14
షాంఘై	3,084	▲	10
నికాయ్	31,659	▲	381

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	59,283
బంగారం (99.5 స్వచ్ఛత)	59,046
వెండి (కేజీ)	70,846

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	[illegible]	99.99	103.36
€	యూరో	[illegible]	86.39	89.43
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	54.87	56.57
AUS	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	51.87	54.16
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.91	61.84
SAR	సౌదీ రియాల్	[illegible]	21.25	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.77	23.56
¥	చైనా యువాన్	[illegible]	10.26	12.34

ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌లో ఐడీఎఫ్‌సీ విలీనానికి సీసీఐ అనుమతి



న్యూఢిల్లీ: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనానికి కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తన ఆమోదాన్ని తెలియజేసింది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ హోల్డింగ్ కంపెనీగా ఐడీఎఫ్‌సీ సబ్సిడరీ అయిన ఐడీఎఫ్‌సీ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ ప్రస్తుతం వ్యవహరిస్తోంది. ఇది ఆర్‌బీఐ నమోదిత ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ. విలీనానికి అనుకూలంగా ఐడీఎఫ్ సీ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ నిర్ణయించడం తెలిసిందే. డీల్‌లో భాగంగా ముందుగా ఐడీఎఫ్‌సీ లిమిటెడ్‌లో ఐడీఎఫ్‌సీ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ విలీనం అవుతుంది. అనంతరం ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ వెళ్లి ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో విలీనం కానుంది. విలీన ప్రక్రియలో భాగంగా ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ షేర్ల రద్దుకు సీసీఐ అనుమతించింది. అనంతరం ఐడీఎఫ్‌సీ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ వాటాదారులకు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ వాటాలను జారీ చేస్తారు. గ్రీన్ చానల్ రూట్‌లో ఈ విలీనానికి అనుమతించినట్లు సీసీఐ తెలిపింది. పోటీకి విఘాతం కలగదని భావించినప్పుడు గ్రీన్‌చానల్ కింద సీసీఐ అనుమతిస్తుంటుంది.

హ్యాపీ మొబైల్స్ ఫెస్టివల్ క్యాష్‌బ్యాక్ ధమాకా



హైదరాబాద్: హ్యాపీ మొబైల్స్ ఫెస్టివ్ క్యాష్‌బ్యాక్ ధమాకా ఆఫర్లు అందుబాటులోకి తెచ్చింది. మొబైల్స్, స్మార్ట్ ఎల్‌ఈడీ టీవీలు, ల్యాప్‌టాప్‌ల కొనుగోళ్లపై ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ ద్వారా 10% వరకు క్యాష్‌బ్యాక్ పొందవచ్చు. ప్రతి మొబైల్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతి, అన్ని మొబైల్ యాక్సెసరీలపై 65% వరకు తగ్గింపు ఉంది. ఆన్ లైన్‌లో కంటే తక్కువ ధరలకే విక్రయిస్తున్నామని, రెండు గంటల్లో ప్రొడక్టులు డెలివరీ చేస్తున్నట్టు హ్యాపీ మొబైల్స్ తెలిపింది. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు వ్యాపార దక్షతకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నామని సంస్థ సీఎండీ కృష్ణ పవన్, ఈడీ కోట సంతోష్ తెలిపారు.

హడ్కో ఓఎఫ్ఎస్ @ రూ.79

బుధ, గురువారాల్లో ఆఫర్ షురూ

న్యూఢిల్లీ: పీఎస్‌యూ సంస్థ హడ్కో తాజాగా ఆఫర్ సేల్‌కు తెరతీయనుంది. తద్వారా ప్రభుత్వం 7 శాతం వాటాను విక్రయించనుంది. ఇందుకు షేరుకి రూ. 79 చొప్పున ఫ్లోర్ ధరను నిర్ణయించింది. ఆఫర్‌లో భాగంగా ప్రభుత్వం 14 కోట్లకుపైగా షేర్లను విక్రయించనుంది. తొలుత బుధవారం సంస్థాగత ఇన్వెస్టర్లకు విండో ఓపెన్ కానుండగా.. రిటైల్ ఇన్వెస్టర్లు గురువారం బిడ్ చేసుకునేందుకు వీలుంటుంది. వెరసి 7 శాతం వాటా ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రూ. 1,000 కోట్లు సమకూరే అవకాశముంది. బీఎస్‌ఈలో మంగళవారం ముగింపు ధర రూ. 90తో పోలిస్తే హడ్కో ఫ్లోర్ ధర 12 శాతం డిస్కౌంట్‌కావడం గమనార్హం!

కరూర్ వైశ్యా బ్యాంక్ లాభం ప్లస్

క్యూ2లో రూ. 378 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ కరూర్ వైశ్యా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 51 శాతం జంప్‌చేసి రూ. 378 కోట్లను అధిగమించింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 250 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,821 కోట్ల నుంచి రూ. 2,336 కోట్లకు ఎగసింది. స్థూల మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) 2.28 శాతం తగ్గి 1.73 శాతానికి చేరాయి. నికర ఎన్‌పీఏలు 0.47 శాతానికి పరిమితమయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో కరూర్ వైశ్యా బ్యాంక్ షేరు 5.3% జంప్‌చేసి రూ. 145 వద్ద ముగిసింది.

ఐపీవో బాటలో సెల్లో, ఆస్క్, ఇసాఫ్

- సెబీ నుంచి తాజాగా గ్రీన్ సిగ్నల్
- రూ. 2,500 కోట్లకుపైగా సమీకరణ



న్యూఢిల్లీ: ఇటీవల కళకళలాడుతున్న ప్రైమరీ మార్కెట్ మరింత జోరు చూపనుంది. తాజాగా మూడు కంపెనీలకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ జాబితాలో హోమ్‌వేర్ బ్రాండ్ ముంబై కంపెనీ సెల్లో వరల్డ్, ఇసాఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌తో పాటు అడ్వాన్స్‌డ్ బ్రేకింగ్ సిస్టమ్ తయారీ కంపెనీ ఆస్క్(ఏఎస్‌కే) ఆటోమోటివ్ చేరాయి. ఈ ఏడాది జూన్-ఆగస్ట్ మధ్యలో సెబీకి ఇవి ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. వెరసి ఈ మూడు కంపెనీలూ పబ్లిక్ ఇష్యూల ద్వారా నిధుల సమీకరణ చేపట్టనున్నాయి. తద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కానున్నాయి.

సెల్లో వరల్డ్

హౌస్‌హోల్డ్ ప్రొడక్టులు, స్టేషనరీ తయారీ కంపెనీ సెల్లో వరల్డ్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. దీనిలో భాగంగా రూ. 1,750 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. అర్హతగల కంపెనీ ఉద్యోగులకు రూ. 10 కోట్ల విలువైన షేర్లను రిజర్వ్ చేయనుంది. కంపెనీ ప్రధానంగా మూడు విభాగాలలో కార్యకలాపాలు కలిగి ఉంది. కన్జూమర్ హౌస్‌వేర్, రైటింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్- స్టేషనరీ, మౌల్డెడ్ ఫర్నిచర్, సంబంధిత ఉత్పత్తులను విక్రయిస్తోంది.

ఇసాఫ్ బ్యాంక్

ప్రైవేట్ రంగ సంస్థ ఇసాఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐపీవో ద్వారా రూ. 629 కోట్లు సమకూర్చుకునే ప్రణాళికల్లో ఉంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 487 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా వీటికి జతగా మరో రూ. 142 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ సంస్థ ఎసాఫ్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్, ఇతర వాటాదారులు(పీఎన్‌బీ మెట్‌లైఫ్, బజాజ్ అలయెంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆఫర్ చేయనున్నాయి. ప్రస్తుతం కంపెనీలో ఎసాఫ్ ఫైనాన్షియల్‌కు 62.46 శాతం వాటా ఉంది. ఈక్విటీ జారీ నిధులను టైర్-1 మూలధన పటిష్టతకు వినియోగించనుంది.

ఆస్క్ ఆటో

బ్రేక్ షూ, అడ్వాన్స్‌డ్ బ్రేకింగ్ సిస్టమ్స్ తయారీకి దేశీయంగా అతిపెద్ద కంపెనీలలో ఒకటైన ఆస్క్ ఆటోమోటివ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు అనుగుణంగా ప్రమోటర్లు కుల్‌దీప్ సింగ్ రాఠీ, విజయ్ రాఠీ 2,95,71,390 ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. కంపెనీలో ప్రస్తుతం కుల్‌దీప్‌కు 41.33 శాతం, విజయ్‌కు 32.3 శాతం చొప్పున వాటా ఉంది. కంపెనీ ప్రధానంగా ద్విచక్ర వాహనాలకు బ్రేకింగ్ వ్యవస్థలను సమకూర్చుతోంది. 2022కల్లా 50 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది.

3 రోజుల నష్టాలకు చెక్

- ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ
- క్రూడాయిల్ ధరల తగ్గుదల ప్రభావం
- సెన్సెక్స్ లాభం 261 పాయింట్లు
- 19,800 పైకి నిఫ్టీ



ముంబై: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల రికవరీ, క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో దేశీయ ఈక్విటీ మార్కెట్ 3 రోజుల నష్టాల నుంచి గట్టెక్కింది. సెన్సెక్స్ 261 పాయింట్లు పెరిగి 66,428 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 80 పాయింట్లు పెరిగి 19,812 వద్ద నిలిచింది. ఉదయం సూచీలు లాభాలతో మొదలయ్యాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో రోజంతా లాభాల్లోనే కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 393 పాయింట్లు పెరిగి 66,560 వద్ద, నిఫ్టీ 118 పాయింట్లు బలపడి 19,850 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. అయితే చివర్లో పలు రంగాల్లో లాభాల స్వీకరణతో స్వల్పంగా లాభాలు కోల్పోయాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 0.70%, 0.40% చొప్పున పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.264 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.113 కోట్ల షేర్లు కొన్నారు. సెప్టెంబర్ క్వార్టర్ ఫలితాలు, అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఆశావహన అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి

- సెప్టెంబర్ క్వార్టర్‌లో మెరుగైన ఫలితాలను ప్రకటించడంతో సియట్ లిమిటెడ్ షేరు 4.50% లాభపడి రూ.2,197 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 11% దూసుకెళ్లి రూ.2,334 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. గతేడాది క్యూ2 సంస్థ నికర లాభం రూ.6.4 కోట్లుగా ఉంది. షేరు భారీ ర్యాలీతో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.388 కోట్లు పెరిగి రూ. 8,887 కోట్లకు చేరింది.
- కల్యాణ్ జ్యువెల్లర్స్ కంపెనీ షేరు 4.09% లాభపడి రూ.295 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 5% పెరిగి రూ.298 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. ఈ క్రమంలో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.30,000 కోట్ల మైలురాయిని అధిగమించి రూ.30,422 కోట్లకు చేరింది. కాగా ఈ ఏడాది ఇప్పటివరకు కంపెనీ షేరు 133% దూసుకెళ్లింది.
- రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర పనితీరు కనబరచడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 1% పెరిగి రూ.1,541 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 2% ర్యాలీ చేసి రూ.1,558 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- ఎలక్ట్రానిక్ సేవల తయారీ సంస్థ సైయెంట్ డీఎల్ఎం షేరు 3% ఎగసి రూ.709 వద్ద స్థిరపడింది. క్యూ2 లో కంపెనీ నికర లాభం 106% వృద్ధి చెందడం షేరు ర్యాలీకి కారణమైంది. ట్రేడింగ్‌లో 8.50% ఎగసి రూ.748 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

బజాజ్ ఫైనాన్స్ లాభం జూమ్

- క్యూ2లో రూ. 3,551 కోట్లు
- పర్మనెంట్‌లో 26 శాతం వాటా



న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం బజాజ్ ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్ (క్యూ2)లో నికర లాభం 28 శాతం ఎగసి రూ. 3,551 కోట్లను తాకింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 2,781 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,974 కోట్ల నుంచి రూ. 13,382 కోట్లకు జంప్ చేసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 6,222 కోట్ల నుంచి రూ. 8,624 కోట్లకు పెరిగాయి. నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 33 శాతం మెరుగుపడి రూ. 2,90,264 కోట్లకు చేరాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 23.19 శాతంగా నమోదైంది. కాగా.. అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) ద్వారా రూ. 8,800 కోట్ల పెట్టుబడుల సమీకరణకు ఈ నెల 5న బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ప్రమోటర్ సంస్థ బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్‌కు ఈక్విటీగా మార్పుచెందే 15,50,000 వారంట్ల ప్రిఫరెన్షియల్ జారీకి సైతం బోర్డు అనుమతించింది. తద్వారా రూ. 1,200 కోట్ల వరకూ సమకూర్చుకోనుంది.

వాటా కొనుగోలు

టెక్నాలజీ కంపెనీ పర్మనెంట్ టెక్నాలజీస్‌లో 26 శాతం వాటాను కొనుగోలు చేయనున్నట్లు బజాజ్ ఫైనాన్స్ తాజాగా పేర్కొంది. ఇందుకు దాదాపు రూ. 268 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. వాటా కొనుగోలుకి పర్మనెంట్‌తో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. టెక్నాలజీ విభాగంలో పటిష్టమయ్యే బాటలో వ్యూహాత్మకంగా వాటా కొనుగోలుకి తెరతీస్తున్నట్లు వివరించింది. డిసెంబర్ 30కల్లా లావాదేవీ పూర్తికానున్నట్లు అంచనా వేసింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసుల పరిశ్రమకు అవసరమయ్యే బిజినెస్ ఆధారిత టెక్నాలజీ సర్వీసులు, సాఫ్ట్‌వేర్ ప్రొడక్టులను పర్మనెంట్ రూపొందిస్తోంది.

ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఫైనాన్స్ షేరు ఎన్ఎస్‌ఈలో 0.8 శాతం బలపడి రూ. 8,098 వద్ద ముగిసింది.

జాబ్ పాయింట్

నిట్ ఏపీలో 24 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ.. ఆంధ్రప్రదేశ్ వివిధ విభాగాల్లో ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 24
» **విభాగాలు:** బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, హ్యుమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్, సైన్సెస్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఫస్ట్ క్లాస్ బ్యాచిలర్ డిగ్రీ,మాస్టర్స్ డిగ్రీ,పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు బోధన/పరిశోధన అనుభవం ఉండాలి.
» **ఎంట్రీ బేసిక్ పే:** రూ.70,900.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, ఇంటర్వ్యూ, ప్రజెంటేషన్ ఆధారంగా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.11.2023
» **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 20.11.2023.
» **వెబ్‌సైట్:** nitandhra.ac.in

ఎన్‌టీపీసీలో 495 ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టులు

న్యూఢిల్లీలోని ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌టీపీసీ లిమిటెడ్.. ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 495
» **విభాగాలు:** ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, మైనింగ్.
» **అర్హత:** కనీసం 65 శాతం మార్కులతో (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు 55 శాతం) బ్యాచిలర్ డిగ్రీ (ఇంజనీరింగ్/టెక్నాలజీ) ఉత్తీర్ణతతో పాటు గ్రాడ్యుయేట్ అప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్)-2023కి హాజరై ఉండాలి.
» **వయసు:** ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేది నాటికి 27 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000 ఉంటుంది.
» **ఎంపిక విధానం:**గేట్-2023 స్కోరు,ధ్రువపత్రాల పరిశీలన,వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 20.10.2023
» **వెబ్‌సైట్:** www.ntpc.co.in

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ, న్యూఢిల్లీలో 496 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా.. దేశ వ్యాప్తంగా ఉన్న ఏఏఐ కార్యాలయాల్లో జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 496
» **అర్హత:** బీఎస్సీ ఫిజిక్స్ లేదా ఏదైనా విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 30.11.2023 నాటికి 27 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు లభిస్తుంది.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, అప్లికేషన్ వెరిఫికేషన్, వాయిస్‌టెస్ట్, సైకోయాక్టివ్ సబ్‌స్టాన్సెస్ టెస్ట్, సైకలాజికల్ అసెస్‌మెంట్ టెస్ట్, మెడికల్ టెస్ట్, బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.11.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.11.2023
» **వెబ్‌సైట్:** www.aai.aero

ఇంటెలిజెన్స్ బ్యూరోలో 677 సెక్యూరిటీ అసిస్టెంట్/ఎంటీఎస్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇంటెలిజెన్స్ బ్యూరో.. దేశవ్యాప్తంగా ఐబీ పరిధిలోని సబ్సిడియరీ ఇంటెలిజెన్స్ బ్యూరోల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన సెక్యూరిటీ అసిస్టెంట్, ఎంటీఎస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 677
» **పోస్టుల వివరాలు:** సెక్యూరిటీ అసిస్టెంట్/మోటార్ ట్రాన్స్‌పోర్ట్-362, మల్టీ -టాస్కింగ్ స్టాఫ్ (జనరల్)-315.
» **అర్హత:** ఎంటీఎస్ ఖాళీలకు మెట్రిక్యులేషన్ (పదో తరగతి) ఉత్తీర్ణులవ్వాలి. ఎస్ఏ/ఎంటీ పోస్టులకు డ్రైవింగ్ లైసెన్స్‌తో ఏడాది పని అనుభవంతోపాటు మోటార్ మెకానిజం పరిజ్ఞానం కలిగి ఉండాలి. **వయసు:** ఎస్ఏ/ఎంటీ పోస్టులకు 27 ఏళ్లు మించకూడదు. ఎంటీఎస్ ఖాళీలకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు ఎస్ఏ/ఎంటీ పోస్టులకు రూ.21,700 నుంచి రూ.69,100, ఎంటీఎస్ పోస్టులకు రూ.18,000 నుంచి రూ.56,900.
» **ఎంపిక విధానం:** టైర్-1 రాతపరీక్ష (ఆబ్జెక్టివ్), టైర్-2 రాతపరీక్ష (డిస్క్రిప్టివ్) -ఎంటీఎస్ పోస్టులకు మాత్రమే, డ్రైవింగ్ స్కిల్ టెస్ట్(ఎస్ఏ/ఎంటీ పోస్టులకు మాత్రమే), ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్,మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, చీరాల, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.11.2023
» **వెబ్‌సైట్:** www.mha.gov.in

గేట్‌తో పీఎస్‌యూ కొలువు

» గేట్ స్కోర్‌తో పీఎస్‌యూల్లో నియామకాలు
» నవరత్న,మహారత్న,మినీరత్న సంస్థల్లో ఉద్యోగాలు
» నోటిఫికేషన్లు విడుదల చేస్తున్న పీఎస్‌యూలు
» మలి దశ ప్రక్రియపై అవగాహనతో కొలువు
» 2024 ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో గేట్ పరీక్ష

బీటెక్ ఉత్తీర్ణుల్లో ఎక్కువ మంది సర్కారీ కొలువు సొంతం చేసుకోవాలనే తపనతో ఉంటారు. అందుకోసం బీటెక్ అర్హతగా నిర్వహించే అన్ని నియామక పరీక్షలకు పోటీ పడుతుంటారు. గేట్ స్కోర్‌తో ఉన్నత విద్య కోర్సుల్లో ప్రవేశాలతోపాటు మరో వైపు ప్రభుత్వ రంగ సంస్థల్లో కొలువును దక్కించుకునే అవకాశముంది. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు గేట్ స్కోర్ ఆధారంగా ఎంట్రీ లెవల్‌లో ఇంజనీర్స్ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాయి. కాబట్టి అభ్యర్థులు తమ డొమైన్ నాలెడ్జ్‌ను పెంచుకుంటే.. గేట్‌లో ఉత్తమ స్కోర్ సాధించి.. పీఎస్‌యూల్లో ఉద్యోగావకాశాలను మెరుగుపరచుకోవచ్చు.

మలి దశ ఎంపిక ఇలా

ప్రభుత్వ రంగ సంస్థలు గేట్ స్కోర్ ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక నోటిఫికేషన్లను విడుదల చేస్తున్నాయి. ఇలా గేట్ స్కోర్ ఆధారంగా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి.. మలి దశలో గ్రూప్ డిస్కషన్/గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయి. తుది జాబితా ఖరారులో వీటికి వెయిటేజీని కేటాయిస్తున్నాయి. దానికి అనుగుణంగా నిర్దిష్ట కటాఫ్ జాబితాలో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తున్నాయి.

గేట్‌కు 75 శాతం వెయిటేజీ

తుది జాబితా రూపకల్పనలో పీఎస్‌యూలు గేట్ స్కోర్‌కు 75 శాతం వెయిటేజీ; గ్రూప్ డిస్కషన్/గ్రూప్ టాస్క్‌లకు గరిష్టంగా పది శాతం; పర్సనల్ ఇంటర్వ్యూకు పదిహేను శాతం చొప్పున వెయిటేజీ ఇస్తున్నాయి. మరికొన్ని పీఎస్‌యూలు గేట్ స్కోర్‌కు 60నుంచి 65శాతం వెయిటేజీ ఇస్తూ.. మిగతా మొత్తాన్ని జీడీ/పీఐలకు కేటాయిస్తున్నాయి.

గ్రూప్ డిస్కషన్

మలిదశ ఎంపిక ప్రక్రియలో ముందుగా గ్రూప్ డిస్కషన్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో అభ్యర్థుల భావ వ్యక్తీకరణ, సమకాలీన, సాంకేతిక అంశాలపై పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్నారు. గ్రూప్ డిస్కషన్‌లో నిర్దిష్ట సంఖ్యలో అభ్యర్థులను వేర్వేరు బృందాలు (టీమ్స్)గా ఏర్పరుస్తాయి. ఒక్కో టీమ్‌లో అయిదు నుంచి పది మంది అభ్యర్థులు ఉంటున్నారు. ప్రతి టీమ్‌కు ఏదైనా ఒక అంశం ఇచ్చి.. ప్రతి అభ్యర్థిని మాట్లాడాలని సూచిస్తారు. ఈ గ్రూప్ డిస్కషన్ ఇరవై నిమిషాల నుంచి 30 నిమిషాల వ్యవధిలో ఉంటుంది. ప్రతి అభ్యర్థికి సగటున అయిదు నుంచి ఆరు నిమిషాల సమయం లభిస్తుంది.

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్.. సంక్షిప్తంగా గేట్! ఐఐటీలు, ఎన్ఐటీలు వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్+పీహెచ్‌డీలో ప్రవేశానికి గేట్ స్కోర్ తప్పనిసరి!! గేట్ స్కోర్‌తో కేంద్ర ప్రభుత్వ కొలువులు సైతం సొంతం చేసుకోవచ్చు. మహారత్న, నవరత్న, మినీరత్న హోదా పొందిన ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ) గేట్ స్కోర్ ద్వారా ట్రైనీ ఇంజనీర్స్, ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టులను భర్తీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో..గేట్-2024తో పీఎస్‌యూ కొలువులకు ఎంపిక ప్రక్రియ, ఇందులో విజయానికి మార్గాలు తదితర వివరాలు..

గ్రూప్ టాస్క్

పలు పీఎస్‌యూలు గ్రూప్ డిస్కషన్‌కు బదులుగా గ్రూప్ టాస్క్‌ను నిర్వహిస్తున్నాయి. గ్రూప్ టాస్క్ అంటే.. నిర్దిష్టంగా ఒక వాస్తవ సమస్యను అభ్యర్థుల ముందుంచి.. సమస్యకు పరిష్కారం కనుక్కోవాలని సూచిస్తారు. వీటిని కూడా అభ్యర్థులు టీమ్‌లుగా ఏర్పడి పరిష్కరించాల్సి ఉంటుంది. గ్రూప్ టాస్క్ అభ్యర్థుల డొమైన్ టాపిక్స్‌కు సంబంధించి ఉంటుంది. దీనిద్వారా అభ్యర్థుల ప్రాక్టికల్ నైపుణ్యాలు తెలుసుకోవడమే కాకుండా.. సమస్య పరిష్కార సామర్థ్యాన్ని సైతం అంచనా వేస్తారు.

చివరగా.. ఇంటర్వ్యూ

గేట్ స్కోర్ ఆధారంగా నియామక ప్రక్రియలో చివరి దశ పర్సనల్ ఇంటర్వ్యూ. గ్రూప్ డిస్కషన్ లేదా గ్రూప్ టాస్క్‌లో విజయం సాధించిన అభ్యర్థులకు వీటిని నిర్వహిస్తారు. ఈ ఇంటర్వ్యూల్లో అభ్యర్థుల వ్యక్తిగత నేపథ్యం, టెక్నికల్ నాలెడ్జ్‌లను పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. బీటెక్‌లో చేసిన ప్రాజెక్ట్ వర్క్స్, మినీ ప్రాజెక్ట్స్, ఇంటర్న్‌షిప్స్.. వాటి వల్ల సదరు అభ్యర్థులకు లభించిన నైపుణ్యాలు పరిశీలిస్తారు. దీంతో పాటు వ్యక్తిగతంగా సదరు పోస్ట్‌లకు సరిపడే అప్టిట్యూడ్, ఆటిట్యూడ్ అభ్యర్థికి ఉందా అనే కోణంలో కూడా పరిశీలిస్తారు.

కటాఫ్ నిబంధన

సంస్థలు నిర్దిష్ట కటాఫ్ నిబంధనలను అమలు చేస్తున్నాయి. ఈ కటాఫ్‌లు.. అందుబాటులో ఉన్న ఖాళీలు, వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఉంటున్నాయి. గత రెండేళ్లుగా పీఎస్‌యూలకు దరఖాస్తుల సంఖ్య పెరుగుతోంది. దీనికి అనుగుణంగానే గేట్ స్కోర్ కటాఫ్ కూడా పెరుగుతూ వస్తోంది. జనరల్ కేటగిరీలో 750 నుంచి 800 మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీలో 500 నుంచి 600 మార్కులు సాధిస్తేనే మలి దశకు అవకాశం లభిస్తుంది.



గేట్-2024 విధానం

గేట్ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. వంద మార్కులకు రెండు విభాగాల్లో పరీక్ష ఉంటుంది. మొత్తం 65 ప్రశ్నలు అడుగుతారు. పార్ట్-1లో జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగానికి 15 మార్కులు కేటాయిస్తారు. ఒక మార్కు ప్రశ్నలు అయిదు, రెండు మార్కుల ప్రశ్నలు అయిదు ఉంటాయి. ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్ నుంచి 13 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌పై పార్ట్-బి ఉంటుంది. ఈ విభాగంలో 72 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ఇలా మొత్తం 100 మార్కులకు గేట్ పరీక్ష జరుగుతుంది.

మూడు రకాల ప్రశ్నలు

గేట్ పరీక్షలో ప్రశ్నలు మూడు విధాలుగా ఉంటాయి. అవి.. మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్, మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్(ఎంఎస్‌క్యూ), న్యూమరికల్ ఆన్సర్ టైప్(ఎన్ఏటీ) కొశ్చన్స్. ఎంసీక్యూ విధానంలో నాలుగు లేదా అయిదు ఆప్షన్లలో ఏదో ఒక దాన్ని సమాధానంగా గుర్తించాల్సి ఉంటుంది. మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్‌లో ఒకటి కంటే ఎక్కువ ఆప్షన్లు సమాధానంగా ఉండే ప్రశ్నలు అడుగుతారు. ఇలాంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. సదరు ప్రశ్నకు సంబంధించిన టాపిక్‌పై సంపూర్ణ అవగాహన కలిగుండాలి. న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు కొంత కాలిక్యులేషన్స్‌తో కూడినవిగా ఉంటాయి.

మంచి స్కోర్‌కు మార్గాలివే

గేట్‌లో బెస్ట్ స్కోర్ కోసం అభ్యర్థులు ప్రస్తుత సమయంలో వ్యూహాత్మకంగా ప్రిపరేషన్ సాగించాలి. ఇందుకోసం తాము ఎంచుకున్న సబ్జెక్ట్‌లో బేసిక్స్ నుంచి అడ్వాన్స్‌డ్ టెక్నిక్స్ వరకు పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ప్రతి టాపిక్‌ను చదివేటప్పుడు అందులోని ప్రశ్నార్హమైన వాటిని గుర్తించాలి. దానికి సంబంధించి ప్రాథమిక భావనలపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలి. ఒక టాపిక్ నుంచి ఎన్ని రకాలుగా ప్రశ్నలు అడిగే అవకాశం ఉందో గుర్తించాలి. దానికి అనుగుణంగా సాధన చేయాలి. గేట్ అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో అనుసంధాన విధానాన్ని అలవర్చుకోవాలి. గేట్ సిలబస్‌ను అకడమిక్ సిలబస్‌తో అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. వీక్లీ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావాలి.

వెయిటేజీని పరిశీలిస్తూ

గేట్‌లో ఆయా టాపిక్స్‌కు గత అయిదారేళ్లుగా లభిస్తున్న వెయిటేజీ, అకడమిక్‌గా ఉన్న ప్రాధాన్యాన్ని అనుసరిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. డిసెంబర్ చివరి వారం లేదా జనవరి మొదటి వారానికి ప్రిపరేషన్ పూర్తి చేసుకునేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ఆ తర్వాత మిగిలి ఉన్న వ్యవధిలో ఆన్‌లైన్ మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లకు హాజరయ్యేలా ప్లాన్ చేసుకోవాలి.

పీఎస్‌యూ నోటిఫికేషన్లు

గేట్ స్కోర్ ఆధారంగా నియామకాలకు ఇప్పటికే పలు పీఎస్‌యూలు నోటిఫికేషన్‌లు విడుదల చేశాయి. మరికొద్ది రోజుల్లో మరిన్ని సంస్థలు నోటిఫికేషన్‌లను విడుదల చేసే అవకాశం ఉంది. ఓఎన్‌జీసీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, కోల్ ఇండియా లిమిటెడ్, గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలు నోటిఫికేషన్ల విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

గేట్-2024 ముఖ్య సమాచారం

- మొత్తం 30 పేపర్లలో గేట్-2024.
- ఆలస్య రుసుముతో ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: అక్టోబర్ 20, 2023.
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: నవంబర్ 7 - 11, 2023.
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: జనవరి 3, 2024.
- గేట్-2024 తేదీలు: 2024 ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో పరీక్ష.
- ఫలితాల వెల్లడి: మార్చి 16, 2024.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://gate2024.iisc.ac.in

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న విజయ ప్రతాప్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ నిత్యావసరాలను సక్రమంగా సరఫరా చేయాలని ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆహార భద్రత చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకం, సంక్షేమ శాఖ హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందించడంపై దృష్టి పెట్టాలన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, బాలామృతం, ప్రధాన మంత్రి మాతృ వందన యోజనపై అవగాహన కల్పించడంతో పాటు అర్హులకు అందించాలన్నారు. చౌక దుకాణాలు, ఎండీయూ వాహనాల వద్ద స్టాకు, ధరల పట్టికను ప్రదర్శించకుంటే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిత్యావసరాల విషయంలో గడువు తేదీలను చూసుకుని ఇవ్వాలన్నారు. సభ్యులు గంజిమాల దేవి, లక్ష్మి రెడ్డి, జి.దేవి, డెప్యూటీ డైరెక్టర్ పి.సురేష్ పాల్గొన్నారు.

రూ.40 లక్షల బంగారం స్వాధీనం

గన్నవరం విమానాశ్రయంలో గుర్తించిన కస్టమ్స్ అధికారులు

సాక్షి, అమరావతి: విదేశాల నుంచి స్మగ్లర్లు పెద్ద ఎత్తున అక్రమ బంగారాన్ని తీసుకొస్తున్నారు. ఇందుకు వారు వివిధ మార్గాలు ఎంచుకుంటున్నారు. తాజాగా సోమవారం గన్నవరం విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులకు సందేహం వచ్చి తనిఖీలు చేయగా స్మగ్లర్ల గుట్టు రట్టు అయ్యింది. ముంబాయిలోని థానేకు చెందిన ముగ్గురు వ్యక్తులు షార్జా నుంచి అక్రమంగా బంగారం తీసుకు వచ్చేందుకు గన్నవరం విమానాశ్రయాన్ని ఎంచుకున్నారు. 800 గ్రాముల బంగారం చూర్ణం చేసి ఆ రజనను మైనపు ముద్దల్లో పెట్టి తమ మలద్వారాల్లో అమర్చుకుని సోమవారం సాయంత్రం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. వారిలో ఓ వ్యక్తి నడక అసహజంగా కనబడటంతో కస్టమ్స్ అధికారులకు సందేహం వచ్చి తనిఖీ చేశారు. అతని మలద్వారంలో మైనపు ముద్దల్లో చుట్టిన బంగారాన్ని గుర్తించారు. అతడి సమాచారంతో మరో ఇద్దరు వ్యక్తుల వద్ద కూడా అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితుల నుంచి మొత్తం రూ.40లక్షల విలువైన 800 గ్రాముల బంగారాన్ని జప్తు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నామని విజయవాడ కస్టమ్స్(ప్రివెన్షన్) కమిషనర్ సాధు నర్సింహారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గన్నవరం విమానాశ్రయంలో కేవలం రెండు రోజుల వ్యవధిలో విదేశాల నుంచి తీసుకువచ్చిన 2.2 కేజీల అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు.

మైనర్‌పై జనసేన కార్యకర్త లైంగిక దాడి

వీరవాసరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు


పంజా నాగేంద్ర

వీరవాసరం: మైనర్ బాలికపై జనసేన కార్యకర్త లైంగిక దాడికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి వీరవాసరం పోలీసులు తెలిపిన వివరాలు.. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం పంజా వేమవరానికి చెందిన జనసేన కార్యకర్త పంజా నాగేంద్ర అదే గ్రామానికి చెందిన 14 ఏళ్ల మైనర్ బాలికపై సోమవారం రాత్రి లైంగిక దాడి చేశాడు. ఇంటి సమీపంలో ఆడుకుంటున్న మైనర్ బాలికను కాళ్లు, చేతులు కట్టేసి వాటర్ ట్యాంక్ సమీపంలోకి తీసుకువెళ్లి ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. తనపై జరిగిన దారుణాన్ని బాధిత బాలిక కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పి.రమేష్ తెలిపారు.

ఆన్‌లైన్‌లోనే ప్రైవేటు పాఠశాలలకు అనుమతి

- ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరి
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ ఆదేశం


నాగజ్యోతిని అభినందిస్తున్న కమిషనర్ సురేష్ కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలలకు ఆన్‌లైన్‌లో మాత్రమే అనుమతి మంజూరు చేస్తామని, ప్రభుత్వం సూచించిన నిబంధనలు తప్పకుండా పాటించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ ఆదేశించారు. దీనికి సంబంధించి సాంకేతిక సమస్యలు, సూచనలు, సలహాలపై మంగళవారం ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. విజయవాడ సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రైవేటు పాఠశాలలకు అనుమతి, గుర్తింపునకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా సకాలంలో చలానా చెల్లింపులు, పోర్టల్‌లో సమస్యలు, ప్రైవేట్ ఉపాధ్యాయులు–సిబ్బంది సమస్యలు, పీఎఫ్, ఆరోగ్య బీమా, ఈఎస్ఐ కార్డు, ఉద్యోగుల జీతాల చెల్లింపు, గుర్తింపు పొడిగింపు, వార్షిక పరిపాలన నివేదిక, ఫీజులు, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాల నిర్వహణపై చర్చించారు. ఇతర సంస్థల ఎన్ఓసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) వంటివి అప్‌లోడ్ చేసేందుకు వీలుగా విద్యాశాఖ పోర్టల్‌ను పునరుద్ధరిస్తామని కమిషనర్ తెలిపారు. ప్రతి ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలకు చెందిన వార్షిక పరిపాలన నివేదికను సంబంధిత విద్యాశాఖాధికారులకు సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పి.పార్వతి, ప్రైవేట్, అన్ ఎయిడెడ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయినికి అభినందన

అనకాపల్లి జిల్లా రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న పీవీఎం నాగజ్యోతి ఈనెల 5 నుంచి 9 వరకు నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ పోటీల్లో పాల్గొని నాలుగు పతకాలు సాధించారు. ఆమెను ఈ సందర్భంగా సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో కమిషనర్ సురేష్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల విద్య డైరెక్టర్ పి.పార్వతి, ఏపీ టెట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మేరీ చంద్రిక, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు పాల్గొన్నారు.

బాలికను మోసగించిన వ్యక్తికి 25 ఏళ్లు జైలు

విశాఖ లీగల్: ప్రేమ, పెళ్లి పేరుతో బాలికను గర్భవతిని చేసి, ఆమెకు కుమారుడు కలగడానికి కారకుడైన వ్యక్తికి 25 ఏళ్ల జైలు శిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. బాధితురాలికి ప్రభుత్వం తరపున రూ.7 లక్షలు ఇవ్వాలని న్యాయమూర్తి ఆ తీర్పులో స్పష్టం చేశారు. ముద్దాయి జాత రాంబాబు(21)ది అల్లూరి జిల్లా, చింతపల్లి మండలం లంబసింగి పంచాయతీ పరిధిలోని తోటరాజు బంద గ్రామం. బాధితురాలు(15)ది అదే మండలం పేదలపుట్టు గ్రామం. దీంతో ఇద్దరికి పరిచయం ఏర్పడింది. మాయ మాటలతో బాలికను తన వైపు తిప్పుకొని లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భం దాల్చి, మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో నిందితుడు బాలికపై పలు రకాలుగా నిందలు వేశాడు. దీంతో 2018 ఫిబ్రవరి 14వ తేదీన బాలిక చింతపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు ప్రాథమిక విచారణ జరిపిన పోలీసులు నిందితునిపై పోక్సో చట్టం సెక్షన్5(1) కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
బుధవారం । 18 । అక్టోబర్ । 2023



పేర్ని నానితో డీఆర్వో భేటీ

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)ని కృష్ణా డీఆర్వో పెద్ది రోజా మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.



నందిగామలో భారీ చోరీ

ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి రూ.61 లక్షల సొత్తు దోచుకెళ్లారు. ఈ ఘటన నందిగామ పట్టణంలో మంగళవారం వెలుగు చూసింది. -IIలో▸



చిత్ర కళాప్రదర్శన ప్రారంభం

ఏఎన్‌యూ: చిత్ర కళాప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది. వీసీ పి.రాజశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్, కల్చరల్ కమిషన్ సీఈఓ మల్లికార్జునరావు ప్రదర్శనను తిలకించారు.

న్యూస్‌రీల్

బొమ్ములూరు రామాలయానికి రూ.2 లక్షల విరాళం



హనుమాన్‌జంక్షన్ రూరల్(గన్నవరం): బాపులపాడు మండలం బొమ్ములూరులోని సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి గ్రామానికి చెందిన కంభంపాటి వీర రాఘవేంద్ర, విజయ దంపతులు మంగళవారం రూ.2 లక్షల విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులు బొట్ల హనుమంతరావు, పాలగాని మాణిక్యాలరావు, మట్టా వీరబాబుకు అందజేశారు. ఆలయ మండపం చుట్టూ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేసేందుకు ఈ మొత్తాన్ని వినియోగిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కొండపైకి వాహనాలకు నో ఎంట్రీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో మూలానక్షత్రం పర్వదినం రోజున పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మూలానక్షత్రం ఏర్పాట్లకు సంబంధించి ఆలయంలోని కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో ఆలయ అధికారులతో సమీక్షించారు. ఈ నెల 20వ తేదీ శుక్రవారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారన్నారు. మూలానక్షత్రంతో పాటుగా శుక్రవారం కావటం ఆ రోజున అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశముందన్నారు. ఆ క్రమంలో ఎక్కడా ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని క్యూలైన్లను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముందు జాగ్రత్తగా ఆ రోజున ఎటువంటి వాహనాలను ఇంద్రకీలాద్రిపైకి అనుమతించకూడదని నిర్ణయించినట్లు తెలిపారు. అదే విధంగా వృద్ధులు, వికలాంగుల ప్రత్యేక దర్శన స్లాట్లను, కొండపైకి తీసుకొచ్చే వాహనాలను రద్దు చేసినట్లు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

సబ్సిడీ పథకాలతో ఉపాధి పొందాలి



మచిలీపట్నంటౌన్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అమలు చేసే సబ్సిడీ పథకాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని, ఉపాధి పొందాలని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ సూచించారు. సంక్షేమ పథకాల అమలుపై మంగళవారం జిల్లా స్థాయి అవగాహన సదస్సు సిరి కల్యాణమండపంలో జరిగింది. జేసీ అపరాజిత సింగ్ మాట్లాడుతూ.. జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా ఔత్సాహికులకు గొర్రెల, మేకల పెంపకం యూనిట్, కోళ్ల అభివృద్ధి పథకం, పందుల పెంపకం, పశుగ్రాస పథకాన్ని సబ్సిడీతో అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాలకు అవసరమైన నిధుల్లో సగం ప్రభుత్వ సబ్సిడీ, మరో సగం బ్యాంకు రుణంగా అందుతాయని వివరించారు. ఈ పథకాలను ఔత్సాహికులు సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రత్నకుమారి, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్ పాల్గొన్నారు.

'చంద్రబాబుకు సొంత వారే చేటు చేస్తున్నారు!'



హనుమాన్‌జంక్షన్ రూరల్: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై ఆ పార్టీ నేతలే కుట్ర చేస్తున్నారనే అనుమానంగా ఉందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని ఆక్వా నెక్స్ ఫ్యాక్టరీలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మీడియాతో మాట్లాడారు. రాజమండ్రి జైలులో ఉన్న చంద్రబాబుపై టీడీపీ నేతలు అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు కలిసి కుట్ర పన్నుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు జైలుకు వెళ్లే ముందు వరకు నిర్వహించిన పలు యాత్రల్లో ఆయనకు వయస్సు కేవలం ఒక నంబర్ మాత్రమేనని, తాను ముసలి వాడిని కాదని, ఇంకా కుర్రాడినేనని ప్రజలకు పదేపదే చెప్పారని మంత్రి అప్పలరాజు గుర్తు చేశారు. కానీ చంద్రబాబు భార్య భువనేశ్వరి, కొడుకు నారా లోకేష్, టీడీపీ నాయకులు ఇప్పుడు మాట్లాడుతూ చంద్రబాబు వృద్ధాప్యంలో ఉన్నాడని, ఈ వయస్సులో ఆయన్ను జైలులో పెట్టడం ఏంటి? అంటూ ముసలి కన్నీరు కార్చటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ వ్యాఖ్యలతో చంద్రబాబుకు పని చేసే ఓపిక లేదని, వయస్సు అయిపోయిందనే అభిప్రాయాన్ని ప్రజలకు టీడీపీ నాయకులే కలిగిస్తున్నారని మంత్రి అప్పలరాజు చెప్పారు.



ఇంద్ర ప్రకాశం.. విద్యుత్ దీప కాంతులతో దేదీప్యంగా దుర్గమ్మ కొండ (ఇన్‌సెట్) అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ

మాం పాహి..

మాతాన్నపూర్ణేశ్వరి

అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు పెద్దలు. ఎవరు ఆకలితో అలమటిస్తున్నా వారికి సాయం చేయమని చెబుతుంటారు. అయితే సాక్షాత్తూ ఆ పరమేశ్వరుడికే భిక్షను ప్రసాదించిన అమృతమూర్తి అన్నపూర్ణాదేవి. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో మూడో రోజు అమ్మవారు ఆ ఆది దేవత రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. చేతిలో అక్షయపాత్ర ధరించి, ఆదిభిక్షువుకు అన్నాన్ని ప్రసాదిస్తున్న అవతారంలో కొలువైన అమ్మ దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించి భక్తులు ఆనందంతో అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఇది అమ్మ ముద్ద కాదురా.. అన్నపూర్ణమ్మే పెట్టే ముద్దరా.. అంటూ పలువురు తల్లిదండ్రులు తమ బిడ్డలకు అన్న ప్రసాదాన్ని తినిపించారు.



నాట్య నీరాజనం.. సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న కళాకారిణి

దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభం
- ఉదయం 5 గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన
- ఉదయం 7, 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- ఉదయం 8 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన
- సాయంత్రం 6 గంటలకు మహా మండపం నుంచి నగరోత్సవ సేవ
- సాయంత్రం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు మహా నివేదన, పంచహారతుల సేవ, చతుర్వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

సాయంవేళ.. నగర విహారం

దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు మంగళవారం సాయంత్రం నిర్వహించిన నగరోత్సవ సేవ వైభవంగా సాగింది. ఉత్సవ మూర్తులు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై కొలువుదీరగా.. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాలు, కేరళ వాయిద్యాల నడుమ ఊరేగింపు ఆద్యంతం ఎంతో వైభవంగా సాగింది. మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల వద్ద నుంచి ప్రారంభమైన నగరోత్సవం కనకదుర్గ నగర్, రథం సెంటర్, వినాయకుడి గుడి, టోల్‌గేట్ మీదగా అమ్మవారి ఆలయానికి చేరింది. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట ఆది దంపతులకు పూజా కార్యక్రమాలను నిర్వహించగా, ఆలయ అధికారులతో పాటు పలువురు భక్తులు సేవని వీక్షించి తరించారు.



నిండు పరవశం.. అమ్మవారిని దర్శించుకొని కిందికి వస్తున్న భక్తులు



కుంకుమార్చన.. కుంకుమ పూజ చేస్తున్న యువతి

- మూడో రోజు అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ దర్శనం
- ఆనంద తన్మయత్వంతో అన్నప్రసాదం స్వీకరించిన భక్తులు
- పెరుగుతున్న భవానీల రద్దీ
- దుర్గాఘాట్‌లో సిద్ధమవుతున్న హంసవాహనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై మంగళవారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రారంభమైన అమ్మవారి దర్శనం రాత్రి 11 గంటల వరకు కొనసాగింది. తెల్లవారుజామున అమ్మవారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అన్నపూర్ణాదేవిగా అమ్మవారిని మంగళవారం పలువురు మంత్రులు, ప్రముఖులు దర్శించుకున్నారు. దేవస్థానం పంపిణీ చేసే ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించేందుకు పెద్ద ఎత్తున భక్తులు క్యూలైన్‌లో వేచి ఉండటం కనిపించింది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు దేవస్థానం అన్నప్రసాదంతో పాటు ఉచితంగా దద్దోజనం, సాంబారన్నం పంపిణీ చేసింది. ఇక సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు లడ్డూ ప్రసాదాలను కొనుగోలు చేస్తున్నారు.



కనులపండువగా.. నగరోత్సవంలో ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

భవానీల రాక..

భవానీ దీక్షలు స్వీకరించిన వారు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. దర్శన అనంతరం దేవస్థానం పంపిణీ చేసే అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మరో వైపు దసరా ఉత్సవాల చివరి రోజు నుంచి భవానీల సంఖ్య అధికంగా ఉండే అవకాశాలు ఉండటంతో మహా మండపం దిగువన ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇరుముడులను సమర్పించేందుకు కౌంటర్ల కోసం ఇనుప గ్రిల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.

శరవేగంగా హంసవాహనం పనులు

దసరా ఉత్సవాల చివరి రోజున హంస వాహనంపై శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి కృష్ణానదిలో విహరించడం ఆనవాయితీ. కృష్ణానదిలో విహరించేందుకు అవసరమైన హంసవాహనాన్ని దుర్గాఘాట్‌లో సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే హంస వాహనం ఒక రూపానికి రాగా, శుక్రవారం నాటికి పనులు పూర్తవుతాయని ఆలయ ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. శనివారం హంసవాహనం నదిలో ట్రయల్ రన్ నిర్వహిస్తామని పేర్కొంటున్నారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం కృష్ణానదిలో హంసవాహనంపై ఆది దంపతులు విహరిస్తారు.

మూడో రోజు ఆదాయం రూ.28.80 లక్షలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో దుర్గమ్మకు మూడో రోజు మంగళవారం రూ.28,80,302 ఆదాయం లభించినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఈ ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు. అందులో రూ.500, రూ.300, రూ.100 టికెట్ల విక్రయాలు ద్వారా రూ.3,40,000 ఆదాయం లభించిందన్నారు. అదేవిధంగా లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.6.30 లక్షలు, వివిధ పూజలకు సంబంధించిన టికెట్ల విక్రయాల ద్వారా మిగిలిన ఆదాయం లభించినట్లు వివరించారు.



అన్నవరం నుంచి పట్టువస్త్రాలు..

దుర్గమ్మకు అన్నవరం శ్రీవీర వెంకట సత్యనారాయణస్వామి వారి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను సమర్పించారు. అన్నవరం దేవస్థాన ఈవో, దుర్గగుడి దసరా ఉత్సవాల అధికారి ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్, ఇతర దేవస్థాన అధికారులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించేందుకు విచ్చేసిన ఆజాద్‌ను దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ ఈవో కేఎస్ రామారావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.



దర్శన భాగ్యం.. అమ్మవారి సన్నిధిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



అన్నదాతా సుఖీభవ.. భోజనశాలలో భక్తులకు వడ్డిస్తున్న సిబ్బంది

జగనన్న ఆర్థిక చేదోడు

- నాయీబ్రాహ్మణులు, రజకులు, టైలర్లకు ఆర్థిక సాయం
- కృష్ణా జిల్లాలో 9,803 మంది లబ్ధిదారులకు రూ.9.80 కోట్లు
- ఎన్టీఆర్ జిల్లాలో 15,176 మంది లబ్ధిదారులకు రూ.15.18 కోట్లు
- 19న కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో సీఎం చేతుల మీదుగా పంపిణీ



జగనన్న చేదోడు చెక్కు అందుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

చిలకలపూడి(మచిలీపట్నం): వృత్తిదారులకు జగనన్న చేదోడు పథకం ఆర్థిక భరోసా ఇస్తోంది. ఈ పథకం కింద లబ్ధిదారులకు ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందుతోంది. నాయీబ్రాహ్మణులు, రజకులు, టైలర్లు వంటి వృత్తిదారులకు ఆర్థిక చేయూతను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ జగనన్న చేదోడు పథకాన్ని ప్రవేశ పెట్టింది. 2020 జూన్ 10వ తేదీన మొదటి విడతగా జగనన్న చేదోడు పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. షాపులు ఉన్న రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్ల బ్యాంక్ ఖాతాల్లో ఏటా రూ.10 వేల చొప్పున జమ చేశారు. 21 నుంచి 60 సంవత్సరాల్లోపు వయసు ఉన్న వృత్తిదారులు ఈ పథకానికి అర్హులుగా నిర్ణయించారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా లబ్ధిదారులకు నగదును అందజేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2020–21 సంవత్సరంలో 29,827 మందికి రూ.29.83 కోట్లు, 2022 ఫిబ్రవరి 8వ తేదీన 28,448 మందికి రూ.28.45 కోట్లు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. మూడో విడతగా 2023 జనవరి 30వ తేదీన నూతన కృష్ణా జిల్లాలో 10,788 మంది లబ్ధిదారులకు రూ.10.79 కోట్లు, ఎన్టీఆర్ జిల్లాలో 16,583 మందికి రూ.16.59 కోట్లు చొప్పున ఆర్థిక సాయం అందించారు.

19న నాలుగో విడత అమలు

ఈ నెల 19వ తేదీన 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాలుగో విడత జగనన్న చేదోడు పథకాన్ని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పద్ధతి ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. కృష్ణా జిల్లాకు సంబంధించి 9,803 మంది లబ్ధిదారులకు రూ.9.80 కోట్లు, ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి 15,176 మందికి రూ.15.18 కోట్ల మేర లబ్ధిచేకూరనుంది. కృష్ణా జిల్లాలో నాయీ బ్రాహ్మణులు 1,245 మంది, రజకులు 1,808 మంది, టైలర్లు 6,750 మంది, ఎన్టీఆర్ జిల్లాలో 1,271 మంది నాయీబ్రాహ్మణులు, 2,979 మంది రజకులు, 10,926 మంది టైలర్ల బ్యాంక్ ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమకానున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19వ తేదీన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే కార్యక్రమంలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. కృష్ణా జిల్లాకు సంబంధించి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం కలెక్టర్ పి.రాజాబాబు లబ్ధిదారులకు చెక్కు అందజేస్తారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



జగనన్న చేదోడు పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాం. ఈ పథకం ద్వారా వచ్చే ఆర్థిక సాయాన్ని వృత్తిదారులు వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశం. నాలుగో విడత ఆర్థిక సాయం ఈ నెల 19వ తేదీన లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమవుతుంది.

– ఎ.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బీసీ కార్పొరేషన్

ఈ–క్రాప్ చేసిన ప్రతి గింజా కొంటాం

- రైతులకు ఎటువంటి ఇబ్బందులూ రానివ్వం
- నవంబర్ 15 నుంచి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు
- తేమ, నూక శాతంలో సమస్యలు వస్తే ప్రత్యేక బృందంతో పరిష్కారం
- గోనె సంచులు, ధాన్యం రవాణాకు ట్రాక్టర్లను సిద్ధం చేస్తున్నాం
- బందరు ఎమ్మెల్యే పేర్ని నాని, కృష్ణా జిల్లా జేసీ అపరాజిత సింగ్



సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి పేర్ని నాని, చిత్రంలో జేసీ అపరాజిత సింగ్ తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ–క్రాప్‌లో నమోదైన పంటకు సంబంధించి ప్రతి గింజా కొనుగోలు చేస్తామని మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో రైస్ మిల్లర్లు, పీఏసీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు, పౌర సరఫరాల శాఖ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ.. నవంబర్ నెలాఖరు నుంచి వరి కోతలు ప్రారంభమవుతాయన్నారు. పండిన పంటను చేను నుంచి ఆర్బీకేల ద్వారా సేకరిస్తామన్నారు. ఈ–క్రాప్‌లో నమోదు ఆధారంగా ప్రతి గింజనూ మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోలు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ చర్యల్లో భాగంగా రైతులు ఎటువంటి ఇబ్బందులూ ఎదుర్కోకూడదన్న ఉద్దేశంతో ముందస్తు చర్యల కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 50 వేల నుంచి 60 వేల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందన్న అంచనాలు ఉన్నాయన్నారు. నవంబర్ 15 నుంచి 20వ తేదీలోపు ప్రతి రైతు భరోసా కేంద్రంలో గోనె సంచులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఏ రైతుకైనా తేమ, నూక, రంగు మారిన ధాన్యంలో సమస్య ఎదురైతే పరిష్కరించేందుకు సాంకేతిక బృందాలను నియమించామని తెలిపారు. ఆ బృందానికి సమాచారం తెలిపిన రెండు గంటల్లో ఆ సమస్య పరిష్కారమవుతుందన్నారు. ప్రతి ఆర్బీకే పరిధిలో డిసెంబర్ ఒకటో తేదీ నంచి ధాన్యం రవాణాకు పది ట్రాక్టర్లు సిద్ధంగా ఉండేలా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ బాధ్యత తీసుకున్నారని పేర్కొన్నారు.

21 నుంచి ఈ–క్రాప్ వివరాల ప్రదర్శన

కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ మాట్లాడుతూ.. గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ–క్రాప్ నమోదు చేసిన రైతువారీ వివరాలను ఈ నెల 21వ తేదీ నుంచి రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి ధాన్యం సేకరణపై అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో డ్వామా, హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ జి.వి.సూర్యనారాయణ, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎ.శ్రీధర్, జిల్లా పౌర సరఫరాల అధికారి వి.పార్వతి, సహకార అధికారి వి.ఫణికుమార్, జిల్లా పౌరసరఫరాల అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్.కోటిరెడ్డి, మండల వ్యవసాయాధికారి బి.హారిక, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గడిదేశి బాలజీసు, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు శ్రీకాకోళపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆర్థరైటిస్‌కు చెక్

- కీళ్లమార్పిడికి దారితీస్తున్న ఆర్థరైటిస్
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో 40 వేల మంది వరకూ బాధితులు
- నిర్లక్ష్యం చేస్తే కీళ్లకు అరుగుదల ముప్పు
- ప్రభుత్వాస్పత్రికి వారంలో వంద మంది రోగుల రాక



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆర్థరైటిస్.. ఎలా వస్తుందో కచ్చితమైన కారణం తెలియని ఆటో ఇమ్యూన్ వ్యాధి. ఈ వ్యాధి సోకితే కీళ్లు అరిగి ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు దారితీసే ప్రమాదం ఉంది. ఆర్థరైటిస్ ఉన్న వారు క్రమం తప్పకుండా మందులు వాడటం, వ్యాయామం, ఆహార నియమాలు పాటించి, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా అదుపులో ఉంచొచ్చు. విజయవాడ ప్రభుత్వాస్పత్రి (జీజీహెచ్)కి వారంలో వంద మంది వరకూ ఆర్థరైటిస్ బాధితులు వస్తున్నారు. వారిలో ఎక్కువగా వయస్సు రీత్యా వచ్చే ఆస్టియో ఆర్థరైటిస్ బాధితులు, రుమటాయిడ్ ఆర్థరైటిస్ రోగులు ఉంటున్నారు. జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగంలో ఆర్థరైటిస్ రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఆర్థరైటిస్‌కు ప్రత్యేకంగా చికిత్స అందించేందుకు రుమటాలజిస్టులు సైతం నగరంలో అందుబాటులోకి వచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే ఆర్థరైటిస్ రోగుల సంఖ్య పెరుగుతూ వస్తుంది. ఆర్థరైటిస్ కారణంగా కీళ్లు అరిగిపోవడంతో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు దారి తీస్తున్నట్లు వైద్యులు చెపుతున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 40 వేల మంది ఆర్థరైటిస్ రోగులు ఉన్నట్లు అంచనా

తొలిదశలో గుర్తించాలి

- ఆర్థరైటిస్‌ను తొలిదశలో గుర్తిస్తే కీళ్ల అరుగుదలకు దారితీయకుండా అదుపులో ఉంచొచ్చు.
- 45 ఏళ్ల వయస్సు దాటిన వారిలో ఆస్టియో ఆర్థరైటిస్ వస్తుంది. రుమాటాయిడ్ ఆర్థరైటిస్ ఏ వయస్సు వారికైనా రావచ్చు.
- వీటితో పాటు, గౌట్, సోరియాసిస్ ఆర్థరైటిస్, స్పాండెలో ఆర్థరైటిస్, లూపస్ వంటి 12 రకాల సోకుతుంటాయి.
- ఈ వ్యాధి సోకినట్లు తొలిదశలో గుర్తించి మందులు వాడితే దాని ద్వారా వచ్చే దుష్ఫలితాలను నివారించొచ్చు.
- లేకుంటే లూపస్ వంటివి గుండె, కిడ్నీలపై ప్రభావం చూపి ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది.

ఎవరికి రావొచ్చంటే..

- థైరాయిడ్ ఉన్న వారికి, అబార్షన్స్ అయిన మహిళలకు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది.
- 16 నుంచి 45 ఏళ్ల మహిళలకు ఆర్థరైటిస్ రావచ్చు.
- ఏ రకమైనది వ్యాధి సోకిందో తెలుసుకోవాలి. దానికి అనుగుణంగా మందులు వాడాలి.

సకాలంలో మందులు వాడాలి



విజయవాడ ప్రభుత్వాస్పత్రి ఆర్థోపెడిక్ విభాగం ఓపీకి వారానికి వంద మంది వరకూ ఆర్థరైటిస్ రోగులు వస్తున్నారు. ఎక్కువగా వయస్సు రీత్యా వ్యాధి వచ్చిన రోగులు ఉంటారు. ఏ వయస్సు వారికైనా వచ్చే రుమటాయిడ్ ఆర్థరైటిస్ రోగులు కూడా తరచూ వస్తుంటారు. వారిలో కీళ్లు అరిగిన వారు ఉంటున్నారు. ఇటీవల ఆర్థరైటిస్ కేసులు బాగా పెరిగాయి. కీళ్లు అరిగిపోవడంతో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. సకాలంలో గుర్తించి మందులు వాడాలి.

– డాక్టర్ పి.పవన్‌కుమార్, ఆర్థోపెడిక్ అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్ విజయవాడ

వ్యాధి రకాన్ని గుర్తించాలి



ఆర్థరైటిస్‌లో 12 రకాలు ఉన్నాయి. వాటిలో రోగికి ఏ రకమైన ఆర్థరైటిస్ సోకిందో తెలుసుకుని మందులు వాడాల్సి ఉంటుంది. కొందరికి ఆరు నెలలు, ఏడాది పాటు మందులు వాడితే తగ్గిపోతుంది. మరి కొందరు దీర్ఘకాలికంగా మందులు వాడాల్సి ఉంటుంది. లక్షణాలను తొలిదశలో గుర్తించి మందులు వాడితే దుష్ఫలితాలు లేకుండా చూడొచ్చు. కీళ్లనొప్పులు, వాపులు ఉండటం, ఉదయాన్నే వేళ్లు, కీళ్లు పట్టేసినట్లు ఉండటం వంటి లక్షణాలను గుర్తించి నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ ఎస్.కావ్యాదేవి, రుమటాలజిస్ట్

ప్రజలందరికీ మంచి జరగాలి



పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఆలయ చైర్మన్, ఈఓ



మంత్రి కారుమూరికి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మ వారిని వేడుకున్నానని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాల్లో మూడో రోజైన మంగళవారం అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ దర్శనమిచ్చింది. అమ్మ వారిని మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి పెద్దిరెడ్డికి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కె.ఎస్.రామారావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు సాదరంగా స్వాగతం పలికారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా అమ్మవారిని పెద్దిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, చైర్మన్, ఈఓ అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటం, పట్టువస్త్రాలను అందజేశారు. అనంతరం మీడియా పాయింట్‌లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడారు. అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర ప్రజలందరికీ మంచి చేకూరాలని అమ్మను వేడుకున్నానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మంచి విజయం సాధించాలని ప్రార్థించానన్నారు.

ఉత్సవ ఏర్పాట్లు బాగున్నాయి

దసరా ఉత్సవాల ఏర్పాట్లు చాలా బాగున్నాయంటూ భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం మంత్రి కారుమూరి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రంతో పాటు దేశంలోని ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని, ప్రజలందరికీ అన్నం, ఆహారానికి లోటు లేకుండా చూడాలని అమ్మ వారిని వేడుకున్నానన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసిన దేవస్థానం అధికారులు, పాలక మండలికి అభినందనలు తెలిపారు.

పేలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- ఎగసిపడిన మంటలు, ఆయిల్
- ఇద్దరు వృద్ధులకు తీవ్ర గాయాలు
- ప్రమాదంలో దగ్ధమైన ఆటో, రిక్షా
- ఘటనాస్థలం సమీపంలో పెట్రోల్ బంక్



మంటలు ఆర్పుతున్న స్థానికులు

చల్లపల్లి(అవనిగడ్డ): మండల కేంద్రమైన చల్లపల్లి గ్రామంలోని ప్రధాన కూడలికి అత్యంత చేరువలో పెట్రోలు బంకు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం ఒక్కసారిగా పేలింది. దానిలోని ఆయిల్‌తోపాటు మంటలు ఎగసిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు వృద్ధులు తీవ్రంగా గాయపడ్డారు. ఆటో, రిక్షా దగ్ధమయ్యాయి. గ్రామంలోని బందరు రోడ్డులో ఉన్న ఇండియన్ బ్యాంక్ ఎదురుగా పెట్రోల్ బంక్ ఆవరణలో ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అది మంగళవారం ఒక్కసారిగా పేలిపోవటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎగసిపడిన ఆయిల్, మంటలు దిమ్మ పక్కన ఉన్న ఆటోపై, పక్క నుంచి వెళ్తున్న రిక్షాపై పడ్డాయి. లక్ష్మీపురం శివారు పుచ్చగడ్డకు చెందిన ఆటో డ్రైవర్ కొడాలి శ్రీనివాసరావుపై, ఆటోపై ఆయిల్ పడింది. శ్రీనివాసరావు ఆటో నుంచి బయటకు వచ్చిన వెంటనే మంటలు వ్యాపించి ఆటో దగ్ధమైంది. శ్రీనివాసరావు ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. కాసానగర్‌కు చెందిన 85 ఏళ్ల రిక్షా కార్మికుడు రామావత్తుల పుల్లయ్య బంకు వద్ద బోరింగ్ పంపు వద్ద బకెట్లో నీరు పట్టుకుని రిక్షాలో వెళ్తుండగా వీపు, తలపై ఆయిల్ పడి మంటలు అంటుకున్నాయి. రిక్షా దగ్ధమవగా, పుల్లయ్య వంటిపై దుస్తులను స్థానికులు లాగేసి ప్రమాదం నుంచి రక్షించారు. అతని వీపుపై తీవ్రంగా కాలింది. ట్రాన్స్‌ఫార్మర్ కింద కండెల దుకాణంలో పని చేసేందుకు వచ్చిన నారాయణరావు నగర్‌కు చెందిన పసుపులేటి చినసాంబయ్యపై మంటలు, ఆయిల్ కలిసి పడటంతో అతనికి మంటలు అంటుకున్నాయి. స్థానికులు అతడిపై నీళ్లు పోసి కాపాడారు. గాయపడిన వారిని స్థానికులు గ్రామంలోని ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెలరేగిన మంటలను ఆర్పేందుకు స్థానిక యువకులు, బంకు సిబ్బంది, ఆటో డ్రైవర్లు తీవ్రంగా శ్రమించారు. బంకులో ఉన్న అగ్నిమాపక గ్యాస్, ఇసుక, నీరు చల్లి మంటలు పూర్తిగా అదుపు చేశారు. విద్యుత్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్ లోపలి మంటలను ఆర్పారు. విద్యుత్ శాఖ డీఈఈ (ఆపరేషన్స్) పులి శివనాగేశ్వరరావు, ఏఈఈ కె.అరవింద్ కుమార్ తక్షణ చర్యలు చేపట్టారు. పేలిన ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి ప్రత్యామ్నాయ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఓవర్ లోడు కారణంగానే ఈ ట్రాన్స్‌ఫార్మర్ పేలిందని భావిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తరుచూ శబ్దం వచ్చి విద్యుత్ సరఫరా నిలిచిపోవడం సాధారణమని స్థానికులు పేర్కొన్నారు. మంటలు పక్కనే ఉన్న పెట్రోలు బంకుకు వ్యాపించకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.



క్షతగాత్రుడు రామావత్తుల పంతులు



క్షతగాత్రుడు పసుపులేటి చిన సాంబయ్య

వైద్యసేవల్లో ఇంత నిర్లక్ష్యమా?

యూపీహెచ్‌ఎస్ సిబ్బందిపై జేసీ ఆగ్రహం



డాక్టర్ సమతతో మాట్లాడుతున్న జేసీ అపరాజిత సింగ్, ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: పేద రోగులకు వైద్య సేవలు అందించటంలో నిర్లక్ష్యం సబబు కాదని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని 31వ డివిజన్ శారదానగర్‌లో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని జేసీతో కలిసి పేర్ని నాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అర్బన్‌హెల్త్ సెంటరులో తమకు వైద్యసేవలు సక్రమంగా అందటం లేదని స్థానికలు ఎమ్మెల్యే, జేసీ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన వారు డాక్టర్ టి.సమతను పిలిచి ఆరా తీశారు. అర్బన్ హెల్త్ సెంటరు పని తీరులో మార్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ జి.గీతాబాయిని ఫోన్‌లో జేసీ ఆదేశించారు. భవనంలోని పలు గదులను మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, కార్పొరేటర్లు ప్రారంభించారు.

హత్యకేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గవర్నరుపేట పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ఒక హత్య కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది. కృష్ణలంకకు చెందిన పులి శ్రీనివాసరావు (51) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. 2017 జూలై 17వ తేదీన పులి శ్రీనివాసరావు, తన కుమారుడు నాగరాజు కలిసి ఆటోలో ఇంటికి వెళ్తున్న సమయంలో అమృత వైన్స్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు ఆటోకు అడ్డంగా వచ్చారు. పులి శ్రీనివాసరావు ఆటో హారన్ కొట్టిన సమయంలో వారిలో ఒకరు గొడవకు దిగి శ్రీనివాసరావు, నాగరాజును ముఖం, తలపై కొట్టి గాయపరిచాడు. శ్రీనివాసరావు నోరు, ముక్కు నుంచి రక్తం రావడంతో నాగరాజు సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడి వైద్యుడి సూచన మేరకు ఓ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించాడు. శ్రీనివాసరావు తీవ్రగాయాలతో చికిత్స పొందుతో పరిస్థితి విషమించి మరుసటి రోజు మృతిచెందాడు. నాగరాజు ఫిర్యాదు మేరకు గవర్నరుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అప్పటి గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్ దర్యాప్తు చేపట్టి గుణదల రైల్వే ట్రాక్ సమీపంలో గుడేటి సురేష్ (27)ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. 22 మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం మంగళవారం తుది తీర్పునిచ్చింది. గుడేటి సురేష్ దాడిచేయడం వల్లే శ్రీనివాసరావు మృతి చెందాడని నిర్ధారించి, నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రెండు వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.

29 మంది ఉద్యోగాలకు ఎంపిక

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పెనమలూరు మండలం పోరంకిలో నిర్వహించిన జాబ్‌మేళాలో 29 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధి అధికారి డి.విక్టర్‌బాబు తెలిపారు. పోరంకిలోని వరుణ్ నెక్సా షోరూమ్ ఆవరణలో మంగళవారం మినీ జాబ్‌మేళా జరిగింది. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 51 మంది యువకులు హాజరవగా వారికి కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 29 మందిని ఆ కంపెనీలో వివిధ విభాగాల్లో ఉద్యోగాలకు ఎంపిక చేశారని విక్టర్‌బాబు తెలిపారు. తమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పంట కాలువలో వ్యక్తి గల్లంతు



కుడిపూడి భాస్కరరావు (ఫైల్)

అవనిగడ్డ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని పులిగడ్డ అక్విడెక్టు వద్ద పంట కాలువలో ఓ వ్యక్తి గల్లంతైన ఘటన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కోనసీమ జిల్లా రావులపాలెం మండలం మల్లాయిదొడ్డికి చెందిన కుడిపూడి భాస్కరరావు కంద చేనులో పనులు చేసేందుకు కొద్దిరోజుల క్రితం అవనిగడ్డ మండలం పులిగడ్డ గ్రామానికి వచ్చాడు. మంగళవారం అక్విడెక్టు వద్ద స్నానం చేసేందుకు పంటకాలువలో దిగాడు. నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. అతను కొట్టుకుపోవడాన్ని గమనించిన కొంతమంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో కలసి ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. భాస్కరరావు ఆచూకీ లభించలేదు. అతనికి భార్య, ఇద్దరు వివాహిత కుమార్తెలు ఉన్నారు.

బాలికను కిడ్నాప్ చేసిన యువకుడి అరెస్ట్

కంచికచర్ల(నందిగామ): ఓ ప్రయివేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలికను మోసగించి కిడ్నాప్ చేసిన ఘటనలో నిందితుడైన యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ పి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. నందిగామ మండలం మాగల్లు గ్రామానికి చెందిన బాలిక మండలంలోని కీసరలోని ఓ ప్రయివేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. నందిగామ మండలం అంబారుపేటకు చెందిన 22 ఏళ్ల మాణిక్యాలరావు ఆ బాలికకు మాయ మాటలు చెప్పి ఈ నెల 14వ తేదీ కిడ్నాప్ చేశాడు. ఈ నెల 15వ తేదీన బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు 16వ తేదీన కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేసి నందిగామ కోర్టులో హాజరుపర్చారు. నిందితుడికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

భవన నిర్మాణాలను సత్వరం పూర్తి చేయాలి

– జెడ్పీ సీఈఓ జ్యోతిబసు



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ జ్యోతిబసు తదితరులు

కురుమద్దాలి(పామర్రు): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాలను సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతిబసు ఆదేశించారు. కురుమద్దాలి గ్రామంలో నిర్మాణంలో ఉన్న భవన సముదాయాలను ఆయన స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జ్యోతిబసు మాట్లాడుతూ.. రూ.72 లక్షలతో చేపట్టిన సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని జగనన్న కాలనీని పరిశీలించారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, సర్పంచ్ జి.విజయభారతి, ఎంపీడీఓ వై.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అంజలీదేవి, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటికి కొరత లేకుండా చర్యలు

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు, డీఆర్వో పెద్దిరోజా

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో సాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. తన క్యాంపు కార్యాలయం నుంచి మండలాధికారులతో మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల సమగ్ర సవరణ, సాగునీటి సమస్యలు, పాఠశాల విద్యార్థుల్లో ఎనిమియా నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సాగునీటి కొరత లేదన్నారు. శివారు ప్రాంతాల్లో సాగునీటి సమస్యను అధిగమించేందుకు నీటి సరఫరా సక్రమంగా చేపట్టాలన్నారు. ఏయే కాలువలకు ఏయే తేదీల్లో సాగునీటి సరఫరా ఉంటుందో నివేదికను తయారుచేసి ఆ సమాచారం రైతులకు చేరేలా సంబంధిత అధికారులు, వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫొటో ఓటర్ల జాబితాల సంక్షిప్త సవరణ కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులన్నీ పరిశీలించాలన్నారు. అనంతరం ఆన్‌లైన్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని, కుటుంబంలోని ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని సూచించారు. జాబితాలన్నీ క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలు పరిశీలించి ప్రతివారం ప్రగతిని సమీక్షిస్తామని, సరిగ్గా వెరిఫికేషన్ చేయని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల, కళాశాలల విద్యార్థుల్లో ఎనిమియాను గుర్తించి, నివారణకు ఆహారం తీసుకునే సమయంలో మందులు ఇవ్వాలన్నారు. విద్యార్థి వారీగా ప్రొఫైల్ తయారుచేయాలని సూచించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో డీఆర్వో పెద్ది రోజా, అధికారులు పాల్గొన్నారు.

నందిగామలో భారీ చోరీ

రూ.61 లక్షల సొత్తు స్వాహా



ఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

నందిగామ: ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో భారీ చోరీ జరిగిన ఘటన నందిగామ పట్టణంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని పాత కరెంట్ ఆఫీస్ రోడ్డులో చలమల వెంకటేశ్వరరావుకు ఇల్లు ఉంది. ఆయన కొద్ది సంవత్సరాల క్రితం మృతి చెందారు. ప్రస్తుతం ఆ ఇంట్లో ఆయన భార్య భవాని ఒక్కరే ఉంటున్నారు. ఆమె కుమార్తె హైదరాబాద్‌లో చదువుకుంటోంది. ఈ క్రమంలో సెప్టెంబర్ 18వ తేదీన ఇంటికి తాళాలు వేసి భవానీ హైదరాబాదు వెళ్లారు. తిరిగి మంగళవారం సాయంత్రం నందిగామ వచ్చారు. ఇంటి తలుపులు తీసుకొని లోపలికి వెళ్లి చూడగానే దక్షిణం వైపు డోరు పగలగొట్టి ఉండటం, బీరువా తాళాలు పగలగొట్టడంతో పాటు సామగ్రి చిందర వందరగా పడి కనిపించాయి. చోరీ జరిగిందని భావించిన ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగులు బీరువాలో ఉన్న 700 గ్రాముల బంగారు ఆభరణాలు, 30 కిలోల వెండి ఆభరణాలు, రూ.10 వేల నగదు చోరీ చేశారు. ఎల్ఈడీ టీవీ, మైక్రో ఓవెన్ కూడా చోరీకి గురయ్యాయని భవానీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ పండు దొర తెలిపారు. ఘటనా స్థలాన్ని ఏసీపీ జనార్దన్ నాయుడు సందర్శించారు. క్లూస్, ఫింగర్ ప్రింట్ టీంలు ఆధారాలు సేకరించాయి. చోరీకి గురైన బంగారం విలువ రూ.40 లక్షలు, వెండి విలువ రూ.21 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు.

కృష్ణా నదిలో గుర్తు తెలియని మృతదేహం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం మంగళవారం ప్రకాశం బ్యారేజీ వద్దకు కొట్టుకొచ్చింది. ఈ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిపే ఎటువంటి ఆధారాలూ లభించలేదు. మృతుడి వయస్సు 30 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, వంటిపై నల్ల టీషర్ట్, నల్ల జీన్స్ ప్యాంట్ ఉన్నాయని, 5.6 అడుగుల ఎత్తు ఉంటాడని పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఉత్సవాల్లో 24 గంటలూ వైద్య శిబిరాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): దసరా మహోత్సవాల్లో 24 గంటలూ వైద్య శిబిరాలు అందుబాటులో ఉంటాయని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ మాచర్ల సుహాసిని తెలిపారు. ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను మంగళవారం డాక్టర్ సుహాసిని తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూచించారు. ఆమె మాట్లాడుతూ ఉత్సవాల్లో 12 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రోజూ మూడు షిఫ్టుల్లో ఈ నెల 25 వరకూ నిర్వహించే శిబిరాల్లో 330 మంది వైద్యులు, సిబ్బంది సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమె వెంట పలువురు వైద్యాధికారులు ఉన్నారు.

500 మందికి వైద్య పరీక్షలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నార్త్ శాఖ జమాఅతె ఇస్లామిహింద్ నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపులో 500 మందికి పైగా వైద్య పరీక్షలు చేశారు. గుండె స్పెషలిస్ట్ డాక్టర్ తాబిష్ సయ్యద్ బృందం ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగరు, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా ముజాహిద్‌ఖాన్ ఉమ్రి, అధ్యక్షుడు మౌలానా అబుల్ సత్తార్, ఖలీలుల్లాహ్, హబీబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థుల్లో స్కిల్స్ పెంపునకు 'వాద్వాని'తో ఒప్పందం

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని ఐటీఐ విద్యార్థుల్లో ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ పెంచేలా తీర్చిదిద్దడానికి బెంగుళూరుకు చెందిన వాద్వాని ఫౌండేషన్‌తో రాష్ట్ర ఉపాధి శిక్షణ శాఖ అధికారులు మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. విద్యార్థుల్లో ఐటీ, ఆంగ్లభాషా నైపుణ్యం, సాఫ్ట్‌స్కిల్స్ మెరుగుపర్చడానికి వాద్వానితో కలిసి శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ నవ్య, ఫౌండేషన్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు సునీల్ దాహియ, ఉపాధి శిక్షణశాఖ జాయింట్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివి

ఆటోనగర్(విజయవాడతూర్పు): పటమట పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈఓ హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చౌదరిపేట, ధనేకులవారి స్ట్రీట్, కాకతీయ రోడ్డు, యార్లగడ్డ అప్పారావు వీధి, అశోక్‌నగర్, ఫరూఖ్‌నగర్, పప్పులమిల్లు రోడ్డు, పండరీపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

శాంకరీ శ్రీకరీ..


అమ్మవారికి ప్రత్యేక పూజలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నియోజకవర్గంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక శ్రీదుర్గా భవానీ ఆలయం (ధనకొండ)లో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని మంగళవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. బుధవారం మహాలక్ష్మిగా అమ్మవారిని అలంకరించనున్నారు.

● స్థానిక విశాలాంధ్ర రోడ్డులోని చలసాని చౌక్‌లో అమ్మ వారిని గాయత్రీదేవిగా అలంకరించారు. నేడు బుధవారం కాత్యాయనీ దేవిగా అలంకరిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. మారుతీనగర్‌లో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.

'సిద్ధార్థ' ప్రాంగణంలో

లబ్బీపేట(విజయవాడతూర్పు): శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యాన సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో మూడో రోజు శ్రీ అన్నపూర్ణాదేవిగా అమ్మవారిని అలంకరించారు. ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. సాయంత్రం శ్రీ కనకదుర్గ లలితా పారాయణ సామూహిక బృంద సభ్యులు లలితా సహస్ర పారాయణ చేశారు. శ్రీ విద్యాపీఠానికి చెందిన వాసుదేవానంద గిరిస్వామి ప్రవచనాలు చేశారు. ఉత్సవ కమిటీ జనరల్ సెక్రటరీ వైట్ల కృష్ణప్రసన్న, ఇతర సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.



చలసానిచౌక్‌లో గాయత్రీదేవిగా

లబ్బీపేట(విజయవాడతూర్పు): బృందావనకాలనీలోని అనంత్ డైమండ్స్ షోరూమ్ వద్ద మంగళవారం అమ్మవారిని శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో పూజలు నిర్వహించారు. టిక్కిల్‌రోడ్డులో రాకపోకలు సాగించే స్థానికులు వెయ్యి మందికి ప్రసాదాలు అందజేసినట్లు షోరూమ్ అధినేతలు జాస్తి వెంకట భానుప్రకాష, విష్ణుప్రియలు తెలిపారు.

పటమట(విజయవాడతూర్పు): దర్శిపేటలోని శ్రీ రాజరాజేశ్వరి శ్రీ లలితా పరమేశ్వరీ దేవస్థానంలో మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కోడె వెంకటసురేష్ కవిత దంపతుల ఆధ్వర్యంలో కుంకుమార్చన జరిగింది. అనంతరం మహిళలు కుటుంబ సమేతంగా అన్నపూర్ణ దేవి అలంకారంలో భాగమైన బియ్యాన్ని కానుకగా సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు ఆవుల నాసరయ్య, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, కోశాధికారి యామా శివ నారాయణ తదితరులు పాల్గొన్నారు

● విజయవాడకల్చరల్: లబ్బీపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో పార్వతీదేవి అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చింది. శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నవకుంభారాధన నిర్వహించారు.

దత్తపీఠంలో..

పటమట(విజయవాడతూర్పు): పటమట దత్తపీఠంలో మరకత రాజరాజేశ్వరి.. అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని అన్నపూర్ణ అవతారంలో పూజిస్తే పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని, దేశం సస్యశ్యామలంగా ఉంటుందని పండితులు తెలిపారు. అనంతరం 21 మంది పిల్లలను అమ్మవారి స్వరూపం దేవతా మూర్తులుగా చేసి వారికి కుమారి పూజ, సుహాసిని పూజలు చేశారు. ఆయుష్య మహామృత్యుంజయ హోమం, పూర్ణాహుతి చేసి భక్తులకు అన్నదానం చేశారు.

కృష్ణలంక పరిధిలో..

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఉత్సవాల్లో మంగళవారం కృష్ణలంక, మెట్లబజార్‌లోని వాసవీ సేవా సంఘంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. సంఘం కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మానేపల్లి మాణిక్యాలరావు, గొంట్లా రామ్మోహనరావు, కోశాధికారి చందలూరి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● త్రిశక్తిపీఠంలో కాళీమాత.. గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పండితులు తూములూరి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో లలితా పారాయణ, కూచిపూడి నృత్యాలు, కచేరీ విశేషంగా ఆకట్టుకున్నాయి. భారతుల శ్రీధర్, భావన(యూఎస్ఏ) దంపతులు సమర్పించిన పట్టుచీర అమ్మవారికి అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జగదీష్‌కుమార్, పుల్లయ్య, ఆధ్యాత్మిక సలహాదారుడు భారతుల విజయకిరణ్ తదితరులు పర్యవేక్షించారు.

● రాణిగారితోటలోని శ్రీ మహాశక్తి దేవస్థానంలో అమ్మవారు మంగళవారం మూడోరోజు అన్నపూర్ణదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.



వాసవీ సేవా సంఘంలో అన్నపూర్ణాదేవిగా



త్రిశక్తి పీఠంలో..



ధనకొండపై అన్నపూర్ణాదేవిగా



అన్నపూర్ణాదేవిగా రాజరాజేశ్వరి లలిత పరమేశ్వరి



సిద్ధార్థ ప్రాంగణంలో అన్నపూర్ణాదేవి



శత చండీయాగంలో భక్తులు



దత్తపీఠంలో అన్నపూర్ణాదేవిగా శ్రీమరకత రాజరాజేశ్వరి

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్ సీపీ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంక 20వ డివిజన్‌లోని నవభారత్ స్కూల్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య పరీక్షలను పరిశీలించి రోగులకు మందుల కిట్లను పంపిణీ చేశారు. అవినాష్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టడం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు.

ప్రతి సచివాలయానికి వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం, గర్భిణులకు నెరోజులకు సరిపడా పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. వంద రోజుల కార్యక్రమంలో అందరికీ వైద్య పరీక్షలు చేసి మందులు ఇస్తారన్నారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో నాణ్యమైన వైద్య, ఆపరేషన్లు చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నామని, ప్రజలందరూ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించి గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషక ఆహార కిట్లను అందజేశారు. శిబిరంలో 550 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, జోనల్ కమిషనర్ కృష్ణ, రాష్ట్ర వైద్య విభాగం ఉపాధ్యక్షుడు షేక్ మెహబూబ్, వైద్యులు డాక్టర్ ఉదయ్, మొబీన్, హర్ష, ఆదిత్య, గీతిక, వైఎస్సార్ సీపీ నాయకులు సుభాని, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో రోగులకు మందుల కిట్లను అందజేస్తున్న దేవినేని అవినాష్

వేగంగా ఆధునికీకరణ పనులు

పటమట(విజయవాడతూర్పు): ఆధునికీకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్ ఆదేశించారు. అజిత్ సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌లో నిర్మిస్తున్న ఇన్ఫర్మేషన్ పార్కును మంగళవారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అక్కడ గ్రీనరీపై ఉద్యానవన అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఎక్సెల్‌ప్లాంట్‌కు రోజూ ఎంత చెత్త వస్తుందనేది సిస్టమ్‌లో తనిఖీ చేశారు. చెత్త వేయింగ్ (వే బ్రిడ్జి) పని తీరును పర్యవేక్షించి పలు సూచనలు చేసారు. పార్కులో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇన్ఫర్మేషన్ పార్కు ను పరిశుభ్రంగా నిర్వహించాలని మరోసారి పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో వీఎంసీ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మూలా నక్షత్రం రోజున సహకరించాలి

కనకదుర్గ నగర్‌లో దుకాణదారులతో సీపీ రాణా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మూలా నక్షత్రం రోజున భక్తులకు ఇబ్బంది కలగకుండా దుకాణాలు మూసివేసి పోలీసులతో సహకరించాలని సీపీ టీకే రాణా సూచించారు. కనకదుర్గ నగర్‌లోని పూజా సామగ్రి, ఫ్యాన్సీ దుకాణ యజమానులతో సీపీ టీకే రాణా మంగళవారం మాట్లాడారు. తొలుత అమ్మవారి ఆలయానికి చేరుకున్న సీపీ క్యూలైన్లో భక్తులతో మాట్లాడారు. అమ్మవారి దర్శనంలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీసీ కెమెరా కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సూచనలు చేశారు. మహా మండపం, ఆలయ పరిసరాల మీదగా కొండ దిగువకు చేరుకున్నారు. ప్రతి సెక్టార్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడి ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భవానీఘాట్, పున్నమి ఘాట్‌లకు చేరుకున్న సీపీ వీఐపీ వాహనాల్లో కొండపైకి చేరుకునే భక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట డీసీపీ విశాల్ గున్ని, ఏబీజీ ఎం. రవీంద్రబాబు, డీసీపీ అజిత వేజెండ్ల తదితరులు పాల్గొన్నారు.



కనకదుర్గ నగర్‌లో మాట్లాడుతున్న సీపీ రాణా

దసరా సందడి



దసరా.. నగరానికి సందడిని తెచ్చింది. ఉత్సవాల్లో మూడో రోజు మంగళవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో దుర్గమ్మను దర్శించుకున్న భక్తజనం మది పులకించింది. దుర్గగుడి ప్రాంగణం వివిధ వర్ణాల విద్యుత్ తోరణాలతో కళకళలాడుతోంది. ఆలయంలో ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. నగరోత్సవంలో డప్పు కళాకారుల విన్యాసాలు, కోలాట నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారులు భారతీయ నృత్య వైభవాన్ని చాటుతున్నారు. విభిన్నప్రతిభావంతులు, వృద్ధులకు వలంటీర్లు సేవలు అందించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











ప్రణాళికాబద్ధంగా 'సురక్ష' అమలు

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రణాళికబద్ధంగా అమలు చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో మంగళవారం ఉన్నతాధికారులతో, సచివాలయం సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్దేశించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అన్ని సచివాలయాల పరిధిలో పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రతి ఒక్క కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనేది ప్రధాన లక్ష్యంగా 229 సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. సచివాలయాల పరిధిలోని స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు, వలంటీర్ల, ఆశావర్కర్ల సారథ్యంలో ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను తెలుసుకోవాలని, ప్రీ సర్వే లో ఆరోగ్య శ్రీ యాప్‌ను వివరించాలని, వైద్య సేవలు అవసరమైన వారికి టోకెన్లు అందించాలని తెలిపారు. సమావేశంలో వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గానగర్‌లో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ నృత్యవైభవాన్ని చాటుతున్నాయి. మంగళవారం ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన కళాకారులు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలు, ఆంధ్రనాట్యం అంశాలను ప్రదర్శించారు. ఘంటసాల సంగీత కళాశాల నృత్యవిభాగం అధ్యాపకుడు శ్రీనివాస్ బృందం అందెలరవమిది పదములుదా, ఇదిగో భద్రాద్రి అంశాలను ప్రదర్శించారు. మైలవరానికి చెందిన నాట్యకళాకారిణి ఎస్.కనకలక్ష్మి బృందం, అనూషా నాయుడు, నందికొట్కూర్‌కు చెందిన జగదీష్, విశాఖపట్నాకి చెందిన సుజన దీపిక, హైదరాబాద్‌కు చెందిన జానకి బృందాలు సంప్రదాయ నృత్యాలను అభినయించారు.

ప్రతిభ

మన చుట్టూ మనకు తెలియకుండానే
ఎంతో మంది రకరకాల బాధలకు లోనవుతుంటారు.
వారిలో ముఖ్యంగా వృద్ధులు, వికలాంగుల
సమస్యలకు సరైన పరిష్కారం తెలియక
ఇబ్బందులు పడుతుంటారు.
వారి మానాన వారిని అలాగే వదిలేయడం కన్నా
పరిష్కారాన్ని కనుగొంటాను అనుకున్నాడు.
తనదైన మార్గంలో ప్రయత్నించాడు.
విజయం సాధించాడు.
సత్కారాలను పొందుతున్నాడు
హైదరాబాద్ వాసి హేమేష్ చదలవాడ.


తల్లి సంధ్యతో హేమేష్ చదలవాడ

అమ్మమ్మలకు అండగా!

దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో సేవలు అందించిన 21 ఏళ్ల లోపు 20 మంది యువ సాధకులను ఢిల్లీలో మొన్న జరిగిన 'అన్‌స్టాపబుల్ 21' వేదికగా సత్కరించారు. హ్యూమన్ స్టడీస్, సైన్స్, క్రీడలు, ఫైన్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్, సోషల్ ఇంపాక్ట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనే ఏడు రంగాలలో ప్రతిభావంతులైన యువతకు ఈ సత్కారాన్ని అందజేశారు. వారిలో హైదరాబాద్‌కు చెందిన 16 ఏళ్ల హేమేష్ చదలవాడ ఎలక్ట్రానిక్స్ రంగంలో కనబరిచిన ప్రతిభకు గుర్తింపు పొందాడు.

వృద్ధులకు సహాయం..

హేమేష్ పన్నెండేళ్ల వయసు నుంచి ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్ రంగంలో గణనీయమైన ప్రతిభను చూపుతున్నాడు. అల్జిమర్స్ వ్యాధితో బాధపడుతున్న అమ్మమ్మను చూసి ఆమెకు ఏదైనా సాయం చేయాలనుకున్నాడు. తన ఆలోచనల గురించి హేమేష్ చెబుతూ 'నడిచేటప్పుడు అమ్మమ్మ అడుగులు తడబడుతుండేవి. మతిమరపు ఉండేది. ఆమెకు తన మీద తనకు కంట్రోల్ ఉండేది కాదు. కొన్నిసార్లు అర్ధరాత్రి మంచంపై నుంచి లేచి ఎటో వెళ్లిపోయేది. దీంతో ఆమెను కనిపెట్టి ఉండటం కష్టమయ్యేది. అమ్మమ్మకు, ఆమెను చూసుకునే మాకూ ఇదో సవాల్‌గా ఉండేది. కొన్ని అందుబాటులో ఉన్న డివైజ్‌లను ప్రయత్నించి చూశాం. కానీ, ఏ మాత్రం సంతృప్తిగా అనిపించలేదు. అమ్మమ్మకు సాయపడే డివైజ్‌ను నేనే సొంతంగా తయారుచేయాలనుకున్నాను' అని తనలో రూపుదిద్దుకున్న ఆలోచనను వివరిస్తాడు. హేమేష్ కృషి, పట్టుదల, అంకితభావానికి అతని తల్లిదండ్రులు కిశోర్, సంధ్యలు ప్రోత్సాహం అందించారు.


హేమేష్ తయారుచేసిన డివైజ్

> మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతో మందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను.
> – హేమేష్

పరికరం ఎలా పనిచేస్తుందంటే..

ఈ పరికరం వాచ్‌లాగా మణికట్టుకూ కట్టుకోవచ్చు. బ్యాడ్జ్‌గానూ ధరించవచ్చు. రోగి నడక, భంగిమ, శరీర ఉష్ణోగ్రత, నాడిని పర్యవేక్షిస్తుంది. నీళ్ల జారిపడుతుండే శబ్దాన్ని కూడా గుర్తించగలదు. మనిషి దూరంగా తిరుగుతున్నప్పుడు లేదా పడిపోవడం వంటి ప్రమాదంలో ఉన్నప్పుడు వెంటనే తెలియజేస్తుంది. ఇంకా అలారంలో 'పిల్‌బాక్స్' ఫీచర్ కూడా ఉంటుంది. ఇది రోగులు వారి మందులు తీసుకునే సమయం వచ్చినప్పుడు హెచ్చరికలను పంపుతుంది. 'ఈ డివైజ్ మా అమ్మమ్మ కోసం తయారుచేసినప్పుడు ఇంటర్నెట్ సరైన మార్గం చూపింది. అయితే, ఈ పరికరం పూర్తయ్యేసరికి అమ్మమ్మ చనిపోయారు' అని బాధపడే హేమేష్ డివైజ్ చేతిలో పట్టుకొని 'మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతోమందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను' అని చెబుతున్న హేమేష్ 12వ తరగతి చదువుతున్నాడు. తన తదుపరి ప్రాజెక్ట్స్‌తో ఎలక్ట్రానిక్స్, రోబోటిక్ రంగంలో మరిన్ని అడుగులు వేస్తున్నట్టుగా వివరించాడు.

2021లో ప్రధానమంత్రి చేతుల మీదుగా రాష్ట్రీయ బాల పురస్కారాన్ని అందుకున్నాడు. పేరున్న కంపెనీల నుంచి గ్రాంట్‌లను పొందాడు.


– నిర్మలారెడ్డి

మణిపూర్ ఒక మంచి వార్తను వినిపించింది.
ఆ రాష్ట్రానికి చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్ తీసిన
'ఆంద్రో డ్రీమ్స్' ముంబైలో జరుగుతున్న చలన చిత్రోత్సవంలో
బెస్ట్ డాక్యుమెంటరీగా ఎంపికైంది.
మణిపూర్‌లోని మారుమూల గ్రామం 'ఆంద్రో'లో ఆడపిల్లల
ఫుట్‌బాల్ క్లబ్‌ను 30 ఏళ్లుగా పరిస్థితులకు ఎదురీది నడుపుతున్న
'లైబి' అనే మహిళ పోరాటాన్ని ఈ డాక్యుమెంటరీ రికార్డు చేసింది.
ఆడపిల్లల క్రీడా స్వేచ్ఛను ఎన్ని అడ్డంకులొచ్చినా
కొనసాగనివ్వాలనే సందేశం ఇచ్చే ఈ డాక్యుమెంటరీ
దేశ, విదేశాల్లో ప్రశంసలు పొందుతోంది.

అడ్డంకులను దూరంగా తన్ని...


దర్శకురాలు: మీరా లాంగ్‌జామ్

న్యూస్‌మేకర్


ఆంద్రో డ్రీమ్స్ పోస్టర్

అంతా చేసి ఎనిమిది వేల మంది జనాభా మించని ఊరు ఆంద్రో. మణిపూర్ తూర్పు ఇంఫాల్ జిల్లాలో మారుమూల ఉంటుంది అది. అక్కడి ఆడపిల్లలు ఫుట్‌బాల్ ఆడితే ఏంటి... ఆడకపోతే ఏంటి? కాని 60 ఏళ్ల లైబి మాత్రం– ఆడాల్సిందే అంటోంది. ఆమె గత ముప్పై ఏళ్లుగా 'ఆంద్రో మహిళా మండల్ అసోసియేషన్– ఫుట్‌బాల్ క్లబ్' (అమ్మ– ఎఫ్‌సీ) నడుపుతోంది. ఈ క్లబ్‌కు నిధులు లేవు. బిల్డింగ్ లేదు. ఊళ్లో ప్రోత్సాహం లేదూ, ఏమీ లేదు. కాని లైబి మాత్రం అంతా తానై క్లబ్‌ను నడుపుతోంది. ఈ మధ్యే ఆమె ఒక పూరి పాక నిర్మించి దానినే క్లబ్ బిల్డింగ్‌గా ప్రారంభించుకుంది.

'అమ్మాయిలు కేవలం వంటకు, ఇంటి పనికి అంకితమై పోకూడదు. చదువుకోవాలి. ఆడాలి. ధైర్యంగా భవిష్యత్తును నిర్మించుకోవాలి. మా ప్రాంతంలో పురుషులదే సర్వాధికారం. ఇంటి పెద్ద, తెగ పెద్ద ఎంత చెప్తే అంత. వారి దృష్టిలో ఆడవాళ్ల గురించి చింతించాల్సింది ఏమీ ఉండదు. అమ్మాయిలు ఆడతామన్నా ఒప్పుకోరు. నా పోరాటం వల్లే ఇవాళ మా ఊరి నుంచి జాతీయ స్థాయిలో అమ్మాయిలు ఫుట్‌బాల్ ఆడుతున్నారు' అంటుంది లైబి.



తన ఫుట్‌బాల్ క్లబ్ పూరి పాక ముందు లైబి

ఈమె పోరాటం ప్రపంచానికి చెప్పదగ్గది అనిపించింది మణిపూర్‌కే చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్‌కు. అలా తయారైన డాక్యుమెంటరీనే 'ఆంద్రో డ్రీమ్స్'.

ఇద్దరి కథ

ప్రస్తుతం ముంబైలో 'జాగరణ్ ఫిల్మ్ ఫెస్టివల్' అట్టహాసంగా జరుగుతోంది. ఇందులో 'ఆంద్రో డ్రీమ్స్' బెస్ట్ డాక్యుమెంటరీగా నిలిచింది. ఇప్పటికే కేరళ, కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు ఎంపికైన ఈ డాక్యుమెంటరీ ముంబైలో విమర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. 'దీనికి కారణం ఆంద్రోలో అమ్మ క్లబ్‌ను నడుపుతున్న లైబి పోరాటాన్ని, ఆ క్లబ్‌లో గొప్ప ఫుట్‌బాల్ ప్లేయర్‌గా ఉంటూ మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలనుకునే నిర్మల అనే అమ్మాయి ఆకాంక్షలని నేను చూపించడమే. ఒక రకంగా చాదస్త వ్యవస్థతో రెండు తరాల స్త్రీల పోరాటం ఈ డాక్యుమెంటరీ' అని తెలిపింది మీనా లాంగ్‌జామ్.

మణిపూర్ వెలుతురు

నిజానికి మే 3వ తేదీ నుంచి మణిపూర్ వేరే కారణాల రీత్యా వార్తల్లో ఉంది. కాని మణిపూర్‌ను అభిమానించేవారికి ఇప్పుడు ఈ డాక్యుమెంటరీ సాధిస్తున్న విజయాలు సంతోషాన్ని ఇస్తున్నాయి. 'నా డాక్యుమెంటరీ విజయం మా ప్రాంతంలో గతాన్ని మర్చిపోయి కొత్త జీవితం మొదలుపెట్టే ఉత్సాహాన్ని ఇస్తే అంతే చాలు' అంది మీనా లాంగ్‌జామ్. మణిపూర్ యూనివర్సిటీలో కల్చరల్ స్టడీస్‌లో ప్రొఫెసర్‌గా ఉన్న మీనా పాఠాలు చెప్పడంతో పాటు డాక్యుమెంటరీలు కూడా తీస్తుంది. 2015లో ఆమె మణిపూర్‌లో ఫస్ట్ మహిళా ఆటోడ్రైవర్‌గా ఉన్న లైబీ ఓయినమ్ మీద డాక్యుమెంటరీ తీస్తే దానికి చాలా పేరొచ్చింది. ఆ తర్వాత 'అచౌబీ ఇన్ లవ్' పేరుతో పోలో ఆటకు అనువైన స్థానిక జాతి అశ్వాలపై డాక్యుమెంటరీ తీస్తే దానికీ పేరొచ్చింది. ఇప్పుడు 'ఆంద్రో డ్రీమ్స్' మణిపూర్ ఘనతను చాటుతోంది.


బాలికలు, యువతులు క్రీడల్లో ఎంతో రాణిస్తున్నా ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో ఆంక్షలు ఉండనే ఉంటాయి. అలాంటి ప్రతి చోట అమ్మాయిలను ప్రోత్సహించే లైబి లాంటి యోధురాళ్లు, వారి గెలుపు గాథలను లోకానికి తెలిపే మీనా లాంటి వాళ్లు ఉండాలని కోరుకుందాం.

యూత్ పల్స్

'ఇప్పటి వరకు ఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూశారు. ఇక డీఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూసే టైమ్ వచ్చింది'... ఇది తెలుగు సినిమాలో మాస్ డైలాగ్ కాదు. సోషల్ మీడియాలో ఒక కుర్రాడు పెట్టిన కామెంట్.

సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్‌ల హవా నడుస్తున్న కాలం ఇది. కస్టమర్‌లు ఏది కొనాలో, ఏ షో చూడాలో, ఎలాంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలో చెబుతున్నారు. ఇప్పుడు ఈ ట్రెండ్‌కు అడ్డుపడే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్ యువతరం నుంచే వచ్చి బలపడుతోంది. ట్రెడిషనల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఒక ప్రాడక్ట్‌ను హైప్ చేస్తే డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఆ హైప్‌ను ఛాలెంజ్ చేస్తున్నారు....

ఢీ అంటే ఢీ
ఆర్ట్ ఆఫ్ డీఇన్‌ఫ్లుయెన్సింగ్





> సమస్య ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కాదు. కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్‌లు అనుసరిస్తున్న ధోరణి. వారిలో మార్పు రావాలి. సామాజిక బాధ్యత పెరగాలి. యువతలో అశాంతి, ఆందోళన రేకెత్తించే కంటెంట్‌కు దూరంగా ఉండాలి.
> – హిమాద్రి పటేల్, డిజిటల్ క్రియేటర్

మార్కెటింగ్ డాటా అండ్ ఎనలిటిక్స్ కంపెనీ కంతార్ స్టడీ రిపోర్ట్ ప్రకారం వినియోగదారులపై ఇన్‌ఫ్లుయెన్సర్‌ల సిఫారసుల ప్రభావం తక్కువేమీ కాదు. సోషల్ మీడియాలో ఎటు చూసినా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కనిపిస్తారు. టీ పొడుల నుంచి టీపాయ్‌ల వరకు రకరకాల ప్రాడక్ట్స్‌ను ప్రమోట్ చేయడానికి చిన్నచిన్న క్యాచీ వీడియోలను రూపొందిస్తారు. దీనికి భిన్నంగా ఒక ప్రాడక్ట్‌ను విశ్లేషిస్తూ విమర్శిస్తే...అదే డీఇన్‌ఫ్లుయెన్సింగ్!

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' హ్యాష్‌ట్యాగ్‌తో టిక్ టాక్‌లో ఈ ట్రెండ్ మొదలైంది.

సోషల్ మీడియా ఎనాలటిక్స్ ఫర్మ్ ట్యూబ్‌లర్ ల్యాబ్స్ చెబుతున్నదాని ప్రకారం గత సంవత్సరం నుంచి ఈ ట్రెండ్ ఊపందుకుంది. మ్యాడి వెల్ అనే ఇన్‌ఫ్లుయెన్సర్ ప్రముఖ కాస్మటిక్ స్టోర్స్‌లో పని చేసింది. కొన్ని ప్రాడక్ట్స్ పట్ల కస్టమర్‌లు ఎందుకు విముఖంగా ఉన్నారో తన స్వీయ అనుభవాలను తెలియజేసింది. ఈ ప్రభావంతో ఆమె పేరు ఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితా నుంచి డీఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితాలోకి చేరింది.

న్యూయార్క్‌కు చెందిన ఇరవై సంవత్సరాల క్లారా కొన్ని బ్రాండ్‌లను విమర్శిస్తూ వీడియోలు చేసింది. వాటిలో ఒకటి వైరల్‌గా మారింది. అదే సమయంలో తాను విమర్శించిన బ్రాండ్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో అనే భయం పట్టుకుంది. అయితే తనకు తానుగా ధైర్యం తెచ్చుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు.

'నేను సరియైన వివరాలతోనే వీడియో చేశాను. నేనెందుకు భయపడాలి' అంటోంది క్లారా.

మన సెలబ్రిటీ ఒకరు ఆరోగ్య సంబంధమైన విషయాలపై కాస్త లోతుగానే మాట్లాడాడు. అయితే ఆయన అవగాహన లోపాన్ని ఒక వైద్యుడు వెంటనే ఎత్తిచూపాడు. పాపులర్ చైనీస్ వ్లోగర్ ఒకరు తన వయసు తక్కువగా కనిపించేలా సాంకేతిక మాయ చేస్తే ఎవరో కుర్రాడు కనిపెట్టి 'ఆయన అసలు రూపం ఇది' అని చూపాడు.

స్వీడస్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఫేక్ ట్రిప్ గురించి మరొక యువకుడు 'ఇవి ఫొటోషాప్ చిత్రాలు' అని నిజాన్ని బహిర్గతం చేశాడు. నిజానికి ఇలాంటివి సోషల్ మీడియాలో గతంలో లేవని కాదు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' పుణ్యామా అని 'అది కాదు ఇది' అని వెంటనే సాధికార సమాచారంతో స్పందించే ధోరణి పెరిగింది.

డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు వోవర్–హైప్‌డ్ ప్రాడక్ట్స్‌ను విమర్శించడమే కాదు చౌక ధరల్లో లభించే వాటి గురించి చెబుతున్నారు.

యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలోని వార్టన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్ అయిన అమెరికస్ రీడ్ ఇలా అంటున్నారు... 'ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో ఎక్కువ మంది సాధికారికంగా మాట్లాడడం లేదేమో అనే భావన కస్టమర్‌లలో వచ్చింది. డబ్బులు ఇస్తారు కాబట్టి సంబంధిత ప్రాడక్ట్‌ను ప్రమోట్ చేస్తారు. నిజానిజాల గురించి వారికి అవసరం లేదు. ఈ నేపథ్యంలో కాస్తో కూస్తో డీఇన్‌ఫ్లుయెన్సర్‌రే నయం అనుకుంటున్నారు. నిజానికి డీఇన్‌ఫ్లుయెన్సర్ కూడా ఇన్‌ఫ్లుయెన్సర్‌రే'

కొందరు ఒక అడుగు ముందుకు వేసి ఈ ట్రెండ్‌కు 'యాంటీ క్యాపిటలిస్ట్' ట్రెండ్‌గా నామకరణం చేశారు.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ వల్ల వృథా ఖర్చులు తగ్గుతాయని, వేలం వెర్రికి అడ్డుకట్టపడుతుందని, పర్యావరణ కోణంలో కూడా ఈ ట్రెండ్ వల్ల మేలు జరుగుతుందని యువతరంలో ఎంతోమంది బలంగా వాదిస్తున్నారు. తమ అభిప్రాయాలను సామాజిక మాధ్యమాలలో ఇతరులతో పంచుకుంటున్నారు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్‌పై ప్రశంసలతో పాటు విమర్శలు కూడా ఉన్నాయి.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్‌కు విషయ సాధికారత, నిజాయితీ అనేవి కీలకం. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' రూపంలో సూడో–అథెంటిసిటీ ముందుకు వస్తుందని, ఈ ట్రెండ్‌ను తమ స్వార్థానికి ఉపయోగించుకునే వారి సంఖ్య పెరుగుతుందనే విమర్శ ఉంది.

'ఈ ట్రెండ్ కాస్త చివరికి ఎలా మారుతుందంటే ఇది కొనవద్దు. మీరు కొనాల్సింది అది అన్నట్లుగా!' అంటుంది 26 సంవత్సరాల అమెరికన్ ఇన్‌ఫ్లుయెన్సర్ జెస్సిక.

'ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌లు చెప్పగానే కస్టమర్‌ల అభిప్రాయాలు రాత్రికి రాత్రి మారిపోవు. ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కేవలం సలహా ఇస్తారు. అంతే. ఏది కొనాలి, ఏది కొనకూడదు అనే స్వీయవిచక్షణ కస్టమర్‌లలో ఉంది. ఇన్‌ఫ్లుయెన్సర్‌లుగా మేము పారదర్శకంగా, నిజాయితీగా ఉంటాం' అంటుంది ఫ్రాన్స్‌కు చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్ కోలిన్. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 4,00,000 ఫాలోవర్స్ ఉన్నారు.

ప్రస్తుతం డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ హెల్త్, ఫైనాన్స్, లైఫ్‌స్టైల్ విభాగాలలో ఎక్కువగా కనిపిస్తుంది.

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్ అనేది వాపా బలుపా?' అనేది పక్కన పెడితే ఈ ట్రెండ్ మూలంగా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ప్రాఫిట్‌కు మాత్రమే కాదు మెరిట్‌కు కూడా ప్రాధాన్యత ఇచ్చే ధోరణి, జవాబుదారీతనం పెరుగుతుంది.

● ఆటో అన్సారీ

లైఫ్ గేర్ మార్చింది


నజ్మా అన్సారీ

ఓ యువకుడు యాచకుడి వేషంలో, కేజీల మొత్తంలో కరెన్సీ నాణేలను తీసుకుని ఐఫోన్ కొనడానికి వెళ్లిన వార్త ఇటీవల సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. మంచి వయసు, ఓపిక ఉన్న వారే ఇలా చేస్తుంటే... ఓపిక లేకపోయినా సమాజంలో గౌరవంగా బతికేందుకు బురఖా వేసుకుని ఆటో నడుపుతోంది నజ్మా అన్సారీ. అయినా ఇతరుల ముందు చేయి చాచే కంటే.. కష్టపడడమే గౌరవం అనుకుంది. 'గేర్లు మార్చేయండి చాలు గౌరంగా బతకవచ్చు' అని చెబుతూ ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తోంది.



నజ్మా అన్సారీ వయసు 45. ఉత్తరప్రదేశ్, మొరాదాబాద్ నగరంలోని కటఘర్‌లో ఆమె నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. 2010లో భర్త మరణించడంతో ఇంటి భారం ఆమె మీద పడింది. అప్పటిదాక గృహిణిగా ఉన్న నజ్మాకు తన కొడుకు, కూతుర్ని ఎలా పెంచాలో అర్థం కాలేదు. భర్త నడిపిన టీషాపును అద్దె కట్టలేక వదిలేసింది. ఇంట్లోనే టీ తయారు చేసి విక్రయించింది. అలా పిల్లల అవసరాలు చూసుకుంటూ ఉండగానే భర్త ఇన్సురెన్స్ డబ్బులు రూ.4.35 లక్షలు వచ్చాయి. మూడు లక్షల రూపాయలతో 2015లో కూతురికి పెళ్లి చేసింది.

ఆదాయం సరిపోక..

టీ స్టాల్ నడుపుతూ కుటుంబాన్ని లాక్కొస్తున్న నజ్మాకు డబ్బులు సరిపోయేవి కావు. కూతురి పెళ్లి తరువాత ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో భర్త ఇన్సురెన్స్ డబ్బుల్లో మిగిలిన మొత్తంతో ఎలక్ట్రిక్ ఆటో కొనుక్కుంది. ఇంటి పనులన్నీ పూర్తిచేసి ఆటో తోలుతూ సంపాదిస్తోంది.

అర్ధరాత్రనే భయం లేదు

నజ్మా మూడు షిఫ్టుల్లో ఆటో నడుపుతోంది. బురఖా ధరించి ఉదయం తొమ్మిదిగంటలకు ఆటో స్టార్ట్ చేస్తుంది. ఎండ వేడికి బురఖాలో ఎక్కువ సమయం ఉండలేక మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వచ్చేస్తుంది. తిరిగి సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది వరకు ఆటో నడుపుతోంది. మళ్లీ రాత్రి తొమ్మిది నుంచి రెండుగంటల వరకు విరామం లేకుండా నడుపుతుంది. ఇలా మూడు షిఫ్టుల్లో మొత్తం మీద రోజుకి ఐదు నుంచి ఆరు వందల వరకు సంపాదిస్తోంది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు నజ్మా ధైర్యాన్ని మెచ్చుకుని ప్రోత్సహిస్తున్నారు. అయితే నజ్మాను చూసిన ఓ హిందూ మహిళ కూడా ఆటో నడపడం మొదలు పెట్టింది. దీంతో ఆ మహిళ ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగు పడ్డాయి. ఇలా ఇతరులకు స్ఫూర్తి నిలుస్తూనే, తన కష్టార్జితంతో హజ్ యాత్రకు వెళ్తానని చెబుతోంది నజ్మ.

అడుక్కునే కంటే...

''పేదరికం ఉందని అక్కడా ఇక్కడా చేయి చాచకుండా కష్టపడి ఏ పనైనా చేసి గౌరవంగా బతకవచ్చు. ఆటో గేర్లు మారుస్తూ, ప్రయాణికులను గమ్యాలకు చేరుస్తున్నాను. ఇక మహిళా డ్రైవర్‌గా నాకు రాత్రి సమయాల్లో కూడా ఎటువంటి ఇబ్బంది ఎదురు కాలేదు. ముఖ్యమంత్రి యోగి ప్రభుత్వం వచ్చాక అర్ధరాత్రి బయటకు రావడానికి కూడా భయం వేయడం లేదు. ప్రభుత్వ అధికార యంత్రాంగం మాకు రక్షణ కల్పిస్తోంది. పరిస్థితులు మరింత దిగజారినప్పుడు అల్లా కాపాడతాడు'' అని నజ్మా అన్సారీ ధైర్యంగా చెబుతోంది.

బ్యూటిప్స్





● వేప చెట్టు ఇంటి దగ్గర్లో ఉంటే వేరే సౌందర్యసాధనాలతో పనే ఉండదు. వేపాకులు, బెరడు, వేపనూనె ఔషధాలుగానే కాదు, సౌందర్య సాధనాలుగానూ ఉపయోగపడతాయి. ఎలాంటి చర్మ సమస్యలకైనా వేపతో ఇట్టే చెక్ పెట్టేయవచ్చు. ● ముఖంపై మొటిమలు, నల్లమచ్చలు ఏర్పడుతుంటే వేపాకులతో చక్కని విరుగుడు ఉంది. గుప్పెడు వేపాకులను అరలీటరు నీటిలో వేయాలి. వేపాకులు పూర్తిగా మెత్తగా మారిపోయేంత వరకు ఆ నీటిని మరిగించాలి. కాసేపటికి నీరు ఆకుపచ్చ రంగులోకి మారుతుంది. అప్పుడు వడగట్టి ఆ కషాయాన్ని సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఆ నీటితో కాస్త దూదిని తడిపి ముఖాన్ని రుద్దుకుంటే చాలు. మొటిమలు, మచ్చలు మటుమాయం అవుతాయి. ● చర్మం పొడిబారి, తరచు దురదలు పెడుతున్నట్లయితే, పైన చెప్పుకున్నట్లే వేపాకులతో కషాయం చేసి, బకెట్ నీటిలో ఒకకప్పు కషాయాన్ని పోసి ఆ నీటిని స్నానానికి ఉపయోగిస్తే చాలు. కొద్దిరోజుల్లోనే చర్మం ఆరోగ్యకరంగా మారుతుంది. ● ముఖం తరచు జిడ్డుగా మారుతుంటే, వేపాకుల పొడి, గంధంపొడి, గులాబి రేకుల పొడి సమభాగాలుగా తీసుకుని కలుపుకోవాలి. చెంచాడు పొడిలో మూడు నాలుగు చుక్కల వేపనూనె, కొద్దిగా తేనె, నిమ్మరసం పిండుకుని ముద్దలా కలుపుకోవాలి. దానిని ముఖానికి పట్టించి, అరగంటసేపు ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే ముఖం తాజాగా మారుతుంది.